
మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - మంగళవారం 10 నవంబర్ 2026 ‖ సంపుటి: 10 ‖ సంచిక: 304 ‖ పేజీలు:12 ‖ వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

టైటానిక్ కన్నా పెద్ద నౌకను ముంచేయనున్నారు..



2

రెండోసారి పారిపోయిన ఆడపులి!



2

ఎల్లమ్మ మీద ఆన..

కృష్ణా జలాలను కొడంగల్‌కు తెస్తా

సంక్రాంతి తర్వాత రాష్ట్రంలో 'ప్రజాబలం' సునామీ

అనుభవం లేకపోయినా నన్ను సీఎంను చేశారు

రోజుకు 18గంటలు పనిచేస్తున్న

కేటీఆర్ ఎన్ని జన్మలెత్తినా రేవంత్ కాలేడు

గడ్డం పెంచినంత మాత్రన ప్రయోజనం లేదు

గుండె ధైర్యం కావాలి..త్యాగం తెలియాలి

కేసీఆర్ చేసిన అప్పులకు రూ. 2లక్షల కోట్లు కట్టినం



వికారాబాద్, నవంబర్ 9(మనం న్యూస్): ఎవరూ అడ్డుపడ్డా...ఎన్ని అడ్డంకులు ఎదురైనా... కృష్ణా జలాలను కొడంగల్‌కు తీసుకొస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఒక్కింత భావోద్వేగానికి గురైన సీఎం ఎల్లమ్మమీద ఆన అంటూ శపథం చేశారు. మంత్రిగా పనిచేసిన అనుభవం తనకు లేప్పటికీ తనను ముఖ్యమంత్రిని చేశారని రాష్ట్ర ప్రజల రుణం తీర్చుకునేందుకు రోజుకు 18గంటలు పనిచేస్తున్నా నని చెప్పుకొచ్చారు. కృతిమంగా గడ్డం పెంచినంత మాత్రన కేటీఆర్ రేవంత్ కాలేడని అందుకు గుండె ధైర్యం, త్యాగం తెలియాలన్నారు. కేసీఆర్ చేసిన అప్పులకు ఇప్పటి వరకు 2లక్షల కోట్ల రూపాయలు చెల్లించామని తెలిపారు. సంక్రాంతి తర్వాత ప్రజా బలం పేరిట రాష్ట్రమంతా తిరుగుతానని ఆ సునామీలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కొట్టుకుపోతాయని సీఎం జోష్యం చెప్పారు. సోమవారం లగచర్ల ఇండస్ట్రియల్ కారిడర్‌లో రూ. 9,053కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభను ఉద్దేశించి రేవంత్‌రెడ్డి ప్రసంగించారు.

మన ప్రాజెక్టులు పూర్తి కాలేదు.. మన పాలాలకు నీళ్లు అందించలేదు..

బూర్గుల రామకృష్ణారావు నుంచి ఇప్పటి వరకు ఎంతో మంది పాలమూరు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించినా ఈ ప్రాంతంలో వలసలు ఆగలేదన్నారు. మన ప్రాజెక్టులు పూర్తి కాలేదు.. మన పొలాలకు నీళ్లు అందించలేదని, ఈ 75 ఏండ్లలో ఒకరిని అడిగే పరిస్థితే తప్ప కావాల్సింది చేసే సమయం రాలేదన్నారు. ఆనాడు పార్లమెంటు ఎన్నికల్లో గెలిపించిన కేసీఆర్ పాలమూరు ప్రాజెక్టులు పూర్తి చేస్తారని నమ్మారని,

...మిగతా 2లో

మిగులు బడ్జెట్‌తో రాష్ట్రాన్ని ఇస్తే..

జీతాలివ్వలేని స్థితికి తెచ్చారు

కేసీఆర్ పదేళ్లలో చేసిన అప్పులకు వడ్డీ కడుతున్నం

పాలమూరు ప్రజలు ఎంపీగా గెలిపిస్తే గజ్వేల్‌కు పారిపోయిండు

హకీంపేట రైతు ఆత్మీయ సభలో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 9, (మనం బ్యూరో): కాంగ్రెస్ మిగులు బడ్జెట్‌తో తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తే కేసీఆర్ పదేళ్లలో జీతాలు ఇవ్వలేని పరిస్థితికి తీసుకొచ్చారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతీ నెలా ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం 'రైతన్నతో ఆత్మీయ సభ' పేరుతో వికారాబాద్ జిల్లా హకీంపేటలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ సంక్షేమ పథకాలకుసంబంధించి ప్రతి నెలా 10 తేదీ లోగా నిధులు విడుదల చేస్తున్నామనీ, ప్రభుత్వ పనులు చేసిన

...మిగతా 2లో

తగ్గిన క్యాన్సర్ మందుల ధరలు



9



ఎల్‌నినో విపత్తును ఎదుర్కొనే దిశలో మనమంతా భాగస్వాములమవుదాం. సామాజిక బాధ్యతను నిర్వర్తిద్దాం. ఎల్ నినో ఎందుకు వచ్చింది..? ఇందుకు కారకులెవరు..?? లాంటివి ఇప్పుడు అప్రస్తుతం. మన ముంగిటికి ఎల్ నినో రక్కసి వచ్చి చేరింది. ఈ సమయంలో వ్యక్తిగతంగా ప్రతి పౌరుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. సామాజికంగా ఎలాంటి అడుగులు ముందుకు పడాలి ... ఇదే ఇప్పుడు అత్యవసరం. అలాగే ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన చర్యలు ఎలా ఉండాలి వంటి అంశాలు ఎంతో ముఖ్యం. ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇందుకు సన్నద్ధమయ్యాయి. పౌరులుగా మనమందరం కూడా ఇందుకు సిద్ధం కావాలి. తెలంగాణ ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి సబ్ కమిటీని సైతం ఏర్పాటు చేసింది. ఎల్ నినోలాంటి విపత్తులను దిగ్విజయంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రజలు ఎవరి బాధ్యతలను వాళ్లు నిర్వర్తించాల్సిందే... ఎల్ నినో ప్రభావం ఇప్పుడిప్పుడే ప్రారంభమైనప్పటికీ సమీప భవిష్యత్తులో దాని విశ్వరూపాన్ని చూడాల్సిన పరిస్థితిలు రావచ్చు.. విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడం మనకేం కొత్త కాకపోయినప్పటికీ పౌరులుగా మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు మనం తీసుకోవాల్సిందే... ప్రభుత్వాలు చేపట్టాల్సిన చర్యలు చేపట్టాల్సిందే. ఈ కోణంలోనే ఎలాంటి జాగ్రత్తలు ప్రజలు తీసుకోవాలి , ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు చేపట్టాలి అనే అంశాన్ని మీరు సూటిగా స్పష్టంగా తెలియజేయండి. ఈ విపత్కర పరిస్థితిలకు కారకులు వీరంటూ, వారంటూ ఎవరిని నిందించాల్సిన అవసరం లేదు.. అసలు ఆ జోలికే వెళ్ళకూడదు.. నిర్మాణాత్మకంగా ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు, ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు వీటిపైనే మీ సూచనలు సలహాలు పంపాలి.. మీడియా సంస్థగా మనం తెలుగు దినపత్రిక ఈ అంశాన్ని తన బాధ్యతగా గుర్తించి ఈ బహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మహా యజ్ఞంలో మీరూ పాలుపంచుకోండి. మీ ఆలోచనలను మాకు పంపించండి. వాటిని మీ పేరు, చిరునామా, ఫోటోతో పాటు ఈ శీర్షికలో రోజువారీగా ప్రచురిస్తాం. ఉత్తమ సూచనలకు గుర్తింపు కూడా ఇస్తాం మీ ఆలోచనలు, సలహాలు, సూచనలను పైన తెలిపిన వాట్సాప్ లేదా ఈ మెయిల్‌కు పంపించండి.

- ఎడిటర్





ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కుంటుంబ సభ్యులమధ్య కేక్ కట్ చేస్తున్న సీఎం.. అభినందనలు తెలుపుతున్న మంత్రులు సీతక్క, వాకిటి శ్రీహరి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఎంపీ మల్లు రవి తదితరులు

బస్తర్‌లో భద్రతా దళాలతో

మోడీ దీపావళి



రాయ్‌పూర్ , నవంబర్ 9: ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో ప్రధాని నరేంద్ర మోడీ పర్యటించారు. జవాన్లతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఆర్‌పీఎఫ్ క్యాంపులో మాట్లాడుతూ.. దేశ అంతర్గత శత్రువుల వల్ల ఎప్పుడూ ప్రమాదమేనని అన్నారు. వారి పట్ల ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. నక్సలిజం, ఉగ్రవాదంపై పోరులో ఎంతో మంది జవాన్లు అమరులయ్యారని పేర్కొన్నారు. మావోయిస్టు తీవ్రవాదంపై దశాబ్దాలుగా సాగిన పోరాటంలో విజయం సాధించినందుకు ఈ దీపావళి వేడుకలు చాలా ప్రత్యేకమైనవని పేర్కొన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో పని చేస్తోన్న పోలీసు సిబ్బంది, భద్రతా దళాల త్యాగాలు, అంకితభావం వల్లే ఈ విజయం సాధ్యమైందని కొనియాడారు.

'ఈ ఏడాది దీపావళి నిజంగా ప్రత్యేకమైనది. 40-50 ఏళ్ల తర్వాత మనకు ఇలాంటి పండగ వచ్చింది. మావోయిస్టులపై దశాబ్దాలుగా సాగిన పోరాటంలో దేశం సంపూర్ణ విజయం సాధించిన తొలి దీపావళి ఇదే. ఇది మనం సాధించిన అసాధారణ విజయం. నక్సలిజం పూర్తిగా అంతమవ్వడంతో ఇప్పుడు దేశంలోని ప్రతి జిల్లా తిరుగుబాటు నుంచి విముక్తి పొందింది. ప్రజలు ధైర్యంగా బయటకు రాగలుగుతున్నారు. ఇదంతా ధైర్యవంతులైన లక్షలాదిమంది సైనికులు చేసిన పోరాట ఫలితమే. అందుకే

...మిగతా 2లో

జనగణన-2027..

జనవరి 25 నుంచి ఇంటింటి సర్వే

- ఫిబ్రవరి 28 వరకు కొనసాగనున్న ప్రక్రియ

హైదరాబాద్, నవంబర్ 09, (మనం బ్యూరో): రాష్ట్రంలో జనగణన -2027కు రాష్ట్ర ప్రభుత్వం తేదీలు ఖరారు చేసింది. అందుకు సంబంధించిన జీఓ ఎంఎస్ నెం.155ను ప్రభుత్వం సోమవారం జారీ చేసింది. దీంతో వచ్చే ఏడాది జనవరి 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా జనాభా లెక్కల సేకరణ చేపడతారు. ఫిబ్రవరి 28 వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. అయితే, జనవరి 10 నుంచి 24 తేదీ వరకు స్వీయ జనగణనకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ప్రజలే స్వయంగా

...మిగతా 2లో

జెన్సన్‌పై గూఢచర్య కుట్ర

మా దేశంపై బురద చల్లే ప్రయత్నమే

చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి జియాకున్

బీజింగ్, నవంబర్ 9: అమెరికా చిప్ దిగ్గజం 'ఎన్‌విడియా' సీఈఓ జెన్సన్ హువాంగ్- అలిస్ హువాంగ్ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. అలిస్ హువాంగ్‌పై చైనా 'గూఢచారి' అనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జెన్సన్ హువాంగ్‌ను ఇరికించేందుకు చైనా గూఢచర్య కుట్ర పన్నిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే.. వీటిని చైనా ఖండించింది. ఈ ఆరోపణలు నిరాధారమైనవని, బీజింగ్‌పై బురద చల్లేందుకే ఇలాంటి దుష్ప్రచారం చేస్తున్నారని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి జియాకున్ స్పష్టం చేశారు. చైనా కోసం సమాచారం సేకరిస్తున్నట్లు అమెరికా నిఘా వర్గాలు నిర్ధారించిన ఓ వాణిజ్య అధికారితో తనకు సన్నిహిత సంబంధం ఉన్నట్లు ఎన్‌విడియా

...మిగతా 2లో

ఆమెతో సంబంధం నిజమే

ఎన్‌విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్

వాషింగ్టన్, నవంబర్ 9: అమెరికాకు చెందిన చిప్ దిగ్గజం ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ తాజాగా సంచలన విషయం వెల్లడించారు. చైనీస్ గూఢచారిగా భావిస్తున్న అలిస్ హువాంగ్

...మిగతా 2లో

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం..

తెలంగాణలో వర్షాలు



2

తెలంగాణలో క్రమంగా పెరుగుతున్న చలి తీవ్రత, పడిపోతున్న ఉష్ణోగ్రతలు

మా దృష్టిలో హసీనా ఎప్పటికీ

నేరస్థురాలే

బంగ్లాదేశ్ న్యాయశాఖ మంత్రి అసదుజ్జమాన్

కొత్త పాస్‌పోర్టు ఇవ్వండి హసీనా విజ్ఞప్తి



ఢాకా, నవంబర్ 9: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా భారత్‌లో ఆశ్రయం పొందుతున్న విషయంపై బంగ్లాదేశ్ న్యాయశాఖ మంత్రి అసదుజ్జమాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. దోషిగా తేలిన హసీనాను భారత్ నుంచి స్వదేశానికి తిరిగి తీసుకురావడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఈ



విషయంపై ఇప్పటికే న్యూఢిల్లీకి పలుమార్లు విజ్ఞప్తి లేఖలు పంపినట్లు తెలిపారు. అయినా ఎటువంటి సమాధానం రాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. 'నా దృష్టిలో హసీనా ఒక నేరస్థురాలు. మా ట్రైబ్యునల్ ఆమెను దోషిగా నిర్ధారించింది. బంగ్లాదేశ్ ప్రజలలో ఇదే ఆమెకు

...మిగతా 2లో

ఇరాన్‌ను రెచ్చగొట్టి.. ఇరుకునపడ్డ ట్రంప్..

నెతన్యాహు



వాషింగ్టన్, నవంబర్ 9: ఇరుకున పెట్టబోయి ఇరకాటంలో పడ్డట్లయ్యింది ఇప్పుడు ట్రంప్, నెతన్యాహుల పరిస్థితి. పశ్చిమాసియాపై ఆధిపత్యం చెలాయించాలని ఆశ ఒకరిది.. ఉనికిని కాపాడుకోవాలనే ఆరాటం మరొకరిది.. వెరసి వీరిద్దరూ చేతులు కలిపి ఇరాన్‌తో కయ్యానికి కాలుదువ్వారు. కానీ, గోడకు కొట్టిన బంతిలా ఆ యుద్ధమే వారి సొంతగడ్డపై చతికిలపడేలా చేసింది. ఒకరు దేశ పార్లమెంటుపై పట్టు కోల్పోగా.. మరొకరు ఏకంగా అధికార పీఠం నుంచి దిగిపోయే పరిస్థితి వచ్చింది. మరి స్వదేశంలో ఈ నేతలకు తగిలిన ఎదురుదెబ్బలు..

...మిగతా 2లో

RANGA REDDY DISTRICT - TELANGANA MODEL SCHOOLS (TGMS) RECRUITMENT

Applications Invited on Outsourcing Basis - 36 Posts in 9 Model Schools

POSTWISE VACANCY DETAILS

Sl. No.	Post Name	Required Qualification	Age Limit	Monthly Remuneration
1	Art Teacher	MFA/BFA in Applied Art, Painting, Sculpture, Commercial Arts, Print Making and Animation	Min 21 - Max 44	Rs. 22,750/-
2	Yoga Teacher	Graduation and Diploma in Yoga / Degree in Yoga / B.P.Ed. with Yoga specialization	Min 21 - Max 44	Rs. 22,750/-
3	Computer Teacher	Master's or Bachelor's Degree with Computer Science, IT, B.Tech/B.E., MCA, BCA, B.Sc. Computers or B.Com. (Computers)	Min 21 - Max 44	Rs. 22,750/-
4	Librarian	Master's or Bachelor's Degree in Library Science / Library and Information Science from a recognized University (BLib.Sc./BLI.Sc.)	Min 21 - Max 44	Rs. 19,550/-

MODEL SCHOOLS (9 LOCATIONS)

Palamakula • Chevella • Shabad • Gungal • Arutla • Nednur • Bongloor • Maheshwaram • Shankarpally

OTHER DETAILS

- Selection: Interview only
- Engagement: Purely on Outsourcing Basis for academic year 2026-27

CONTACT - FOR APPLICATIONS & ENQUIRIES

M/s Rahul Sayi Placement Services
Phone: 9247455999, 9951746983
Email: rahulsayi2019@gmail.com

Note: This recruitment is on outsourcing basis only. Candidates must meet the eligibility criteria as per TGMS norms.

మనం Manam

టైటానిక్ కన్నా పెద్ద నౌకను ముంచేయనున్నారు..

వాషింగ్టన్, నవంబర్ 9: ఒకప్పుడు సముద్రయానంలో ప్రపంచ రికార్డు సృష్టించిన చారిత్రక అమెరికన్ నౌక 'ఎస్ఎస్ యునైటెడ్ స్టేట్స్' ఇప్పుడు సముద్ర గర్భంలో మరో రికార్డు నెలకొల్పేందుకు సిద్ధమవుతోంది. త్వరలోనే దీన్ని అమెరికా ఫ్లోరిడాలోని డెస్టిన్-ఫోర్ట్ వాల్టన్ బీచ్‌కు సుమారు 40 కిలోమీటర్ల దూరంలో సముద్రంలో ముంచేయనున్నారు. దీంతో ఈ నౌక.. ప్రపంచంలోనే అతిపెద్ద కృత్రిమ పగడపు దిబ్బగా మారనుంది. అదేవిధంగా దశాబ్దాలుగా ఈ ఓడను సంరక్షిస్తూ వస్తున్న 'ఎస్ఎస్ యునైటెడ్ స్టేట్స్ కన్సర్వెన్సీ' సంస్థ.. ఫ్లోరిడా తీరంలో దీనికి సంబంధించి ఓ మ్యూజియాన్ని నిర్మించాలని యోచిస్తోంది. నౌక భాగాలు, కళాఖండాలను అందులో పొందుపర్చనుంది. ఇందుకు అనుగుణంగా ఓడ రెండు పెద్ద పొగ గొట్టాలను ఇప్పటికే తొలగించి భద్రపర్చింది.

టైటానిక్ కంటే పెద్దది..

టైటానిక్ కంటే పెద్దదైన 990 అడుగుల ఈ 'ఎస్ఎస్ యునైటెడ్ స్టేట్స్'.. కేవలం విలాసవంతమైన నౌక మాత్రమే కాదు. అత్యవసర సమయాల్లో సైనిక బలగాల రవాణాకు ఉపయోగించేలా దీన్ని ప్రత్యేకంగా రూపొందించారు. నేవల్ హిస్టారికల్ ఫౌండేషన్ ప్రకారం.. 1950లో మొదలైన దీని నిర్మాణానికి 70 మిలియన్ డాలర్లకుపైగా ఖర్చయింది. ఇందులో సాధారణంగా 1,900-2,000 మంది ప్రయాణికులను, యుద్ధ సమయాల్లో ఏకంగా 14 వేల మంది సైనికులను తరలించవచ్చు. 1952లో ఈ నౌక తన తొలి ప్రయాణంలోనే న్యూయార్క్ నుంచి ఐరోపాకు కేవలం మూడు రోజుల 11 గంటల్లో చేరుకుంది. ఈ రికార్డు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది! ఈ ఓడలో ఆయా సమయాల్లో నలుగురు అమెరికా అధ్యక్షులు.. హ్యారీ ట్రూమన్, ఐసెన్‌హోవర్, జాన్ ఎఫ్. కెన్నడీ, బిల్ క్లింటన్ ప్రయాణించడం విశేషం.1969లో సేవల నుంచి వైదొలిగిన అనంతరం ఈ నౌక దశాబ్దాల పాటు పలువురు యజమానుల చేతులు మారుతూ.. అట్లాంటిక్ ఓడరేవుల్లో నిలిచిపోయింది. సుమారు 30 ఏళ్లపాటు ఫిలడెల్ఫియా షిప్‌యార్డ్‌లో ఉన్న అనంతరం.. 2024లో దానిని తుక్కుగా అమ్మేయడమా? లేదా కృత్రిమ పగడపు దిబ్బగా మార్చడమా? అనే పరిస్థితి తలెత్తింది. అప్పుడే ఫ్లోరిడాలోని ఒకలూసా కౌంటీ.. ఒక మిలియన్ డాలర్లతో దీన్ని కొనుగోలు చేసింది. గతేడాది ఫిలడెల్ఫియా నుంచి తరలించారు. కృత్రిమ పగడపు దిబ్బగా మార్చే ఉద్దేశంతో సముద్ర పర్యావరణానికి ఎటువంటి హాని కలగకుండా.. లోపలి భాగాలను ఖాళీ చేసి, ప్రమాదకర పదార్థాలను తొలగించారు. ఈ ప్రాజెక్టు ద్వారా చేపల వేట, డైవింగ్ వంటి పర్యాటక కార్యకలాపాలతో ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనం చేకూరుతుందని ఒకలూసా కౌంటీ ఆశిస్తోంది.

రెండోసారి పారిపోయిన ఆడపులి..!

కోల్‌కతా, నవంబర్ 9: పశ్చిమ బెంగాల్ టైగర్ రిజర్వ్ ప్రాంతంలో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. కాంక్రీటు ఎన్‌క్లోజర్‌లో ఉన్న ఓ ఆడపులి అత్యంత చాకచక్యంగా సొరంగం తవ్వుకుని అక్కడి నుంచి పారిపోవడం చూసి ఫారెస్ట్ అధికారులు షాకయ్యారు. మరో విషయమేంటంటే.. ఆ పులి ఇలా రిజర్వ్ ప్రాంతం నుంచి తప్పించుకోవడం రోజుల వ్యవధిలో ఇది రెండోసారి కావడం గమనార్హం. వివరాల్లోకి వెళితే.. పశ్చిమ బెంగాల్‌లో పులుల సంతతిని పెంచడంలో భాగంగా ఇటీవల బిహార్ నుంచి ఓ మూడేళ్ల ఆడపులిని తీసుకొచ్చారు. రాయల్ బెంగాల్ టైగర్ జాతికి చెందిన ఈ ఆడపులి 'రాణి'ని అక్టోబరు 5న బుక్సా టైగర్ రిజర్వ్‌లో విడిచిపెట్టారు. అయితే, రెండు వారాలకే ఈ పులి టైగర్ రిజర్వ్ నుంచి పారిపోయింది. దాదాపు 13 రోజుల పాటు పులి కోసం తీవ్ర గాలింపు చేపట్టిన అటవీశాఖ అధికారులు.. నవంబరు 3న అస్సాంలోని రైమోనా టైగర్ రిజర్వ్‌కు సమీపంలోని ఓ నది వద్ద దాన్ని గుర్తించారు. ఆ మరుసటి రోజు తీసుకొచ్చి బుక్సాలోని 25-మైల్ టవర్ వద్ద ఎన్‌క్లోజర్‌లోబంధించారు. అయితే, ఆదివారం మధ్యాహ్నం ఆ పులి అక్కడ నుంచి తప్పించుకున్నట్టు అధికారులు గుర్తించారు. కాంక్రీట్ గోడల మధ్య బంధించినప్పటికీ పులి బయటకు రావడంతో వారు ఆశ్చర్యపోయారు. అక్కడకు వెళ్లగా.. సొరంగం కన్పించింది. పులి తన పంజా సాయంతో సొరంగం తవ్వి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు నిర్ధరణకు వచ్చారు. దీంతో మళ్లీ గాలింపు ముమ్మరం చేశారు. పులిని వెతకడం కోసం దాదాపు 60 మంది అటవీశాఖ సిబ్బందిని మోహరించారు. మూడు కుంకీ ఏనుగులను కూడా రంగంలోకి దించారు. అయితే, ఇప్పటికే చాలా దూరం వెళ్లి ఉంటుందని, దాని రేడియో కాలర్ సిగ్నల్స్ కూడా అందట్లేదని అధికారులు వెల్లడించారు. అయితే, పులులు ఇలా సొరంగం తవ్వడం అత్యంత అరుదని అటవీ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. అస్సాం అడవుల్లో మగ పులితో బంధం ఏర్పరుచుకోవడం వల్లే రాణి తప్పించుకుని ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

జెన్సన్‌పై గూఢచర్య కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

బోర్డు ముందు జెన్సన్ హువాంగ్ అంగీకరించినట్లు 'ది న్యూయార్క్ టైమ్స్' ఓ కథనాన్ని వెలువరించింది. ఈ వ్యవహారంపై విచారణ ప్రారంభిస్తున్నట్లు ఎన్‌విడియా ప్రకటించిందని తెలిపింది. అడ్వాన్స్‌డ్ చిప్లను చైనాకు అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న అలిస్ హువాంగ్ అనే చైనా పౌరురాలితో జెన్సన్ హువాంగ్ సన్నిహిత సంబంధం కలిగి ఉన్నారని, ఆమె బీజింగ్‌కు గూఢచారిగా వ్యవహరిస్తున్నారని ఇటీవల ఇదే వార్తాసంస్థ ప్రచురించిన ఓ కథనాన్ని చైనా ఇప్పటికే ఖండించింది. మరోవైపు.. చైనా మీడియా ప్రస్తుతం అలిస్ హువాంగ్‌తో జెన్సన్ హువాంగ్ తన సంబంధాన్ని అంగీకరించిన అంశంపైనే ఎక్కువగా దృష్టి సారించింది.

అధికారిక మీడియా సంస్థలు కూడా ప్రభుత్వ వాదననే సమర్థిస్తున్నాయి. జెన్సన్‌పై గూఢచర్య ఆరోపణలకు సంబంధించి వచ్చిన కథనాలు.. అమెరికా- చైనా సంబంధాలను అస్థిరపరిచే లక్ష్యంతో ఉన్నాయని పేర్కొన్నాయి. ''ఇరుదేశాల మధ్య సంబంధాలు మెరుగుపడటం ప్రారంభమైనప్పుడల్లా.. తెరవెనుక నుంచి ఇలాంటి విమర్శలు వస్తుంటాయి'' అని చైనా ప్రభుత్వ మీడియా సంస్థ 'గ్లోబల్ టైమ్స్' తెలిపింది.

మా దృష్టిలో హసీనా ఎప్పటికీ నేరస్థురాలే

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న గుర్తింపు. హసీనాను ఎప్పటికైనా, ఎలాగైనా బంగ్లాదేశ్‌కు తీసుకువస్తాం. తగినశిక్ష విధిస్తాం. కానీ ఈ విషయంలో న్యాయ శాఖకు ప్రత్యక్ష ప్రమేయం ఉండదు. ఎందుకంటే ఆమె మరో దేశంలో ఉన్నారు కాబట్టి దీనిని హోం మంత్రిత్వ శాఖ చూసుకుంటోంది. ఒకవేళ వారు ఆమెను మాకు అప్పగిస్తే ఎటువంటి భావోద్వేగాలకు తావులేకుండా ఈ విషయాన్ని చట్టప్రకారం పరిష్కరిస్తాం. నిబంధనలు ఉల్లంఘించేలా మేం ఏమీ చేయబోం' అని అసదుజ్జమాన్ పేర్కొన్నారు. కాగా భారత్‌లో ఆశ్రయం పొందుతున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా స్వదేశానికి వెళ్లేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే కొత్త పాస్‌పోర్టు, జాతీయ గుర్తింపు కార్డు జారీ చేయాలని ఆమె బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. ఈ దిశగా అవసరమైన చర్యలు తీసుకోవాలని తన న్యాయవాది ద్వారా ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్‌కు ఓ లేఖను ఈమెయిల్ చేశారు. హసీనా పార్టీ 'అవామీ లీగ్' ఈ విషయాన్ని ధ్రువీకరించింది. లండన్‌లోని మ్యాట్రిక్స్ ఛాంబర్స్‌లోని తన న్యాయ ప్రతినిధుల ద్వారా కూడా ఆమె బంగ్లాదేశ్‌కు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు.హసీనా సమర్పించిన దరఖాస్తుల ప్రామాణికతను, ఈ విషయంలో చట్టపరమైన అంశాలను ప్రభుత్వం పరిశీలిస్తోందని బంగ్లాదేశ్ హోం మంత్రి సలాహుద్దీన్ అహ్మద్ చెప్పినట్లు అధికారిక బీఎస్ఎస్ వార్తాసంస్థ తెలిపింది. ఆ పత్రాల కోసం దరఖాస్తు చేసేందుకు హసీనాకు ఏదైనా చట్టపరమైన హక్కు ఉందా? అనే విషయాన్ని విదేశాంగ, న్యాయశాఖలు పరిశీలిస్తున్నాయని చెప్పారు. మరోవైపు.. హసీనా విజ్ఞప్తిని హాస్యాస్పదమైనదిగా విదేశాంగశాఖ సహాయమంత్రి హుమాయున్ కొబీర్ పేర్కొన్నారు. ఆమెకు మరణశిక్ష పడిందని, ఉగ్రవాదులకు బంగ్లాదేశ్ పాస్‌పోర్టులను జారీ చేయదని వ్యాఖ్యానించారు. ఆమె నిజంగా స్వదేశానికి తిరిగి రావాలనుకుంటే.. అప్పగింత ఒప్పందం కింద తనను అప్పగించమని భారత్‌ను కోరాలన్నారు.

ఆమెతో సంబంధం నిజమే

(మొదటి పేజీ తరువాయి)

అలియాస్ హువాంగ్‌లే తో తనకు వివాహేతర సంబంధం ఉందని అంగీకరించారు. ఈ మేరకు ఎన్‌విడియా సంస్థ ఉద్యోగులకు ఒక ఇ-మెయిల్ పంపించారు. తప్పును ఒప్పుకొంటూ.. తన కుటుంబానికి, సంస్థకు క్షమాపణలు చెప్పారు. ''నేను చేసిన తప్పును సమర్థించుకోలేను. నా కుటుంబానికి, ఎన్‌విడియా సిబ్బందికి క్షమాపణలు చెబుతున్నా. సంస్థలో నాయకుడిగా ముందుడి నడిపించడం నా బాధ్యత. కానీ, నేను నా బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమయ్యాను. అయితే, సంస్థకు నేను కట్టుబడి ఉన్నా. మళ్లీ మీ అందరి విశ్వాసాన్ని పొందడానికి కృషి చేస్తా. మన సంస్థ అంతర్గత విచారణను ప్రారంభించింది. దానికి పూర్తిగా సహకరిస్తా''అని జెన్సన్ పేర్కొన్నారు. ఈ విషయంపై ఎన్విడియా సంస్థ ప్రతినిధులు స్పందిస్తూ.. జాతీయ భద్రత లేదా ఎన్విడియాకు సంబంధించి రహస్యాలేవీ లీక్ అవ్వలేదని వెల్లడించారు. జెన్సన్‌పై తమకు పూర్తి నమ్మకముందన్నారు. అంతర్గత విచారణకు ఆయన సహకరిస్తారని.. సంస్థ సీఈఓగా కూడా కొనసాగుతారని తెలిపారు.చైనా పౌరురాలైన అలిస్‌ను ఆ దేశ గూఢచారిగా అమెరికా నిఘా సంస్థలు ఇటీవల గుర్తించాయి. చైనీస్ ఇన్వెస్టర్ అయిన ఈమె.. ప్రస్తుతం సింగపూర్‌కు చెందిన డేటా సెంటర్ కంపెనీ 'మెగాస్పీడ్'లో కీలక హోదాలో పనిచేస్తున్నారు. అమెరికా ఆంక్షలు దాటుకుని ఎన్‌విడియా ఏఐ చిప్లను ఈ సంస్థ చైనాకు చేరవేస్తోందనే ఆరోపణలు రావడంతో అమెరికా ప్రభుత్వం దర్యాప్తు చేపట్టింది.

జెన్సన్ మంచి వ్యక్తి: ట్రంప్

అలిస్‌తో సంబంధం ఆరోపణలపై ఎన్‌విడియా బోర్డు స్వతంత్ర దర్యాప్తు జరుపుతోంది. ఈ నేపథ్యంలో జెన్సన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మద్దతుగా నిలిచారు. ఆయన మంచి వ్యక్తి , దేశం కోసం ఆయన అద్భుతంగా పనిచేశారని ప్రశంసించారు. అలాగే, త్వరలో తాను వెళ్లనున్న ఆసియా పర్యటనకు హువాంగ్‌ను తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు.


దీపావళి పర్వదినానా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమం రాష్ట్రంలో విజయవంతంగా జరిగింది. కొడంగల్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. దీపావళి పండగను పురస్కరించుకొని మంత్రులు లబ్ధిదారులకు ఇళ్లను అందజేశారు.















కృష్ణా జలాలను కొడంగల్‌కు తెస్తా

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రావాలని.. కష్టాలు తీరాలని కనిపించిన దేవుడికల్లా దండం పెట్టామని, తెలంగాణ వచ్చినా.. ముఖ్యమంత్రిగా బాధ్యత ఇచ్చినా పాలమూరు జిల్లా గుండెలపై తన్ని గజ్వేల్ కు పోయిండని దుయ్యాబట్టారు. భుజాలపై మోసిన పాలమూరు జిల్లా ప్రాజెక్టులను పదేళ్లు పడావు పెట్టాడని కక్షగట్టి పాలమూరు అభివృద్ధిని అడ్డుకున్నాడన్నారు.

ఇన్నేండ్లు ఏ దేవుడు మన కష్టాలు వినలేదు

2023 లో ముక్కోటి దేవతల ఆశీస్సులతో.. కొడంగల్ బిడ్డల ఆత్మగౌరవాన్ని నిలబెట్టే అవకాశం దక్కిందని, ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన క్షణం నుంచి ఏ ఒక్కరోజైనా సెలవు తీసుకోలేదన్నారు. పదేళ్లలో కేసీఆర్ 8 లక్షల 11 వేల కోట్లు అప్పు పెట్టి ఫామ్ హౌస్ లో పడుకున్నాడన్నారు. తనకు అప్పు చేసే అలవాటు లేదు అబద్ధాలు చెప్పే అలవాటు అసలే లేదన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల కష్టాలు చూసి 11 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తారీఖున జీతాలు ఇవ్వాలని ఆలోచన చేశామన్నారు. జనవరి 1 , 2024 నుంచి ప్రతీ నెల మొదటి తారీఖున జీతాలు పడుతున్నాయని, ప్రతీ సంవత్సరం కేసీఆర్ అప్పులకు తప్పులకు 80 వేల కోట్లు చెల్లిస్తున్నామని, కేసీఆర్ అప్పులకు తప్పులకు ఈ 34 నెలల్లో 2 లక్షల కోట్లకుపైగా చెల్లించామని తెలిపారు.

తింటే కుంభకర్ణుడు.. పంటే బకాసురుడు.

మాట్లాడాలి రమ్మంటే కేసీఆర్ రాడని, ఆయన తింటే కుంభకర్ణుడు.. పంటే బకాసురుడంటూ చురక లాంటించారు. మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పనులు మేం మొదలు పెడితే.. కేసీఆర్, కేటీఆర్ అడ్డుకుంటామంటున్నారు. కేటీఆర్ కు గడ్డం రావడానికి 50 ఏండ్లు పట్టింది.. బుద్ధి రావడానికి ఎన్నేండ్లు పడుతుందో పులిని చూసి నక్క వాతలు పెట్టుకుంటే ఎన్నటికీ నక్క పులి కాదన్నారు. మేం లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేసుకుంటే మీకు కడుపుమంట ఎందుకు? డిసెంబర్ నాటికి కృష్ణా జలాలు తెచ్చి కొడంగల్ బీడు భూములను తడుపుతామని, కొడంగల్ భూముల్లో పచ్చని పంటలు పండేలా చేసే బాధ్యత తనదని పునరుద్ఘటించారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా కొండగల్‌ను తీర్చిదిద్దుతా

ఆనాడు కొడంగల్ బిడ్డలు చదువుకోవాలంటే పక్క జిల్లాలకు, పక్క రాష్ట్రాలకు వెళ్లాల్సి ఉండేదని, ఇవాళ కొడంగల్ ను ఎడ్యుకేషన్ హబ్ గా చేసి.. ఉన్నత చదువులకు కొడంగల్ వచ్చేలా చేసుకుంటున్నామన్నారు. కొడంగల్ అభివృద్ధి జరుగుతుంటే కొందరు ఏడుపులు మొదలు పెట్టారన్నారు. అందరం కలసికట్టుగా ఎల్‌నినోను ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, దామోదర రాజనర్సింహ, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఇవి శంకుస్థాపనల

కొత్తవాల్‌గూడ నుంచి నాచారం వరకు రూ.5,060 కోట్లతో రేడియల్ రోడ్డు-2 నిర్మాణానికి శంకుస్థాపన, ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద రూ.1,410 కోట్లతో 223 కొత్త, అసంపూర్తి బీటీ రహదారుల పనులకు శంకుస్థాపన , రూ.2,100 కోట్లతో ఎంఎన్‌కేఎల్ఐఎస్ రెండో దశ పనులకు శంకుస్థాపన, విద్యా రంగంలో రూ.118.80 కోట్లతో 10 తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు శంకుస్థాపన , రూ.123 కోట్లతో కొడంగల్లో వ్యవసాయ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన, రూ.41.83 కోట్లతో కొడంగల్, కోస్గి, మద్దూరులో ఆధునిక బస్ స్టాండ్ల నిర్మాణానికి శంకుస్థాపన, రూ.20 కోట్లతో మద్దూరులో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన, రూ.20 కోట్లతో సమీకృత డివిజనల్ కార్యాలయ సముదాయం నిర్మాణానికి శంకుస్థాపన, రూ.59.30 కోట్లతో రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపన, రూ.4.45 కోట్లతో తిమ్మారెడ్డిపల్లిలో గురులోక మసంద్ ప్రభు మందిరం అభివృద్ధికి శంకుస్థాపన, రూ.5.10 కోట్లతో కొడంగల్‌లో నిరంజన్ మఠం అభివృద్ధికి శంకుస్థాపన, రూ.10 కోట్లతో లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్లో పర్యాటక హోటల్ నిర్మాణానికి శంకుస్థాపన, రూ.81 కోట్లతో ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు సీఎం రేవంత్ శంకుస్థాపనలు చేశారు.

జీతాలివ్వలేని స్థితికి తెచ్చారు



(మొదటి పేజీ తరువాయి)

కాంట్రాక్టర్లకు ప్రతి నెలా 20 తేదీ లోగా బిల్లులు చెల్లిస్తున్నామని వెల్లడించారు. కేసీఆర్ చేసిన అప్పులు, తప్పులకు ఏటా రూ.80 వేల కోట్ల వడ్డీ కడుతున్నామనీ, ఇప్పటి వరకు రూ.2 లక్షల కోట్లకు పైగా వడ్డీ కట్టామని తెలిపారు. '' రైతు కుటుంబం నుంచి వచ్చిన నన్ను గుండెల్లో పెట్టుకున్నారు. తెలంగాణ సీఎంగా ఈ జన్మంతా గుర్తు పెట్టుకునేలా ఆశీర్వదించారు. ఈ ప్రాంతం నుంచి చాలా మంది మంత్రులు వచ్చినా పాల మూరు నుంచి వలసలు ఆగలేదని ''పేర్కొన్నారు. ఎన్ని దశాబ్దాలు గడచినా మన ప్రాజెక్టులు పూర్తి చేయాలేదు. మనకు కావాల్సింది ఇచ్చేటోడు 75 ఏళ్లలో ఎవరూ రాలేదని వ్యాఖ్యా నించారు. ఉద్యమం సమయంలో పాల మూరు నుంచి గెలిచిన కేసీఆర్ జిల్లా రుణం తీర్చుకుంటారని ఆశించామనీ, పాలమూరు జిల్లా నుంచి పోటీ చేసి కేసీఆర్ సీఎంగా గెలవాలని ఆశించారని పేర్కొన్నారు. కానీ, కేసీఆర్ మాత్రం పాలమూరు ప్రజల గుండెల మీద తన్ని గజ్వేల్‌కు వెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు సాధించిన మక్తల్-నారాయణపేట ప్రాజెక్టును పక్కన పెట్టారనీ మరోసారి మక్తల్-నారాయణ పేట-కొడంగల్ పథకానికి కార్యరూపం ఇస్తే దాన్ని కూడా అడ్డుకుంటామని అంటున్నారు. అలాంటి వారు తెలంగాణకు అవసరమా అని ప్రశ్నించారు. కాగా, ఈ సభలో సీఎం రేవంత్ రెడ్డి కేటీఆర్ గడ్డంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. విదేశీ కన్స లెంట్‌ను పెట్టుకుని కేటీఆర్ తనకు పోటీగా మారాల నుకుంటున్నాడనీ, నా మాదిరిగా గడ్డం పెంచుకోవా లని సలహా ఇచ్చారట. పులిని చూసి నక్క వాతలు



పెట్టుకున్నట్లుంది. ఎన్ని వేషాలు వేసినా పులి పులే నక్క నక్కే కేటీఆర్ ఎన్ని జన్మలెత్తినా రేవంత్ రెడ్డి కాలేరు. నాలాగా మారాలంటే గుండె ధైర్యం కావాలి. కార్యకర్తలకు అండగా నిలవాలి. నమ్మిన వాళ్లను ముంచే కేటీఆర్ ఎప్పుడూ రేవంత్ కాలేరు. కేటీఆర్‌కు గడ్డం రావడానికే 50 ఏళ్లు పట్టింది. బుద్ధి రావడానికి ఇంకెన్నేళ్లు పడుతుందో అని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

బస్తర్‌లో భద్రతా దళాలతో మోడీ దీపావళి

(మొదటి పేజీ తరువాయి)

నేను ఈ రోజు మీతో కలిసి దీపావళి జరుపుకోవడానికి వచ్చాను. దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలంటే.. దృఢ సంకల్పంతో, స్పష్టమైన వ్యూహంతో శత్రువులను ఎదుర్కొని ఓడించాలి. 2014లో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే దేశం అంతర్గత భద్రతా ముప్పులపై దృష్టి సారించింది. దేశానికి సేవ చేసేందుకు ప్రజలు నాకు అవకాశం ఇచ్చారు. నేను





ప్రధానిగా బాధ్యతలు స్వీకరించాక మార్పు మొదలైంది. గతంలో నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో మావోయిస్టుల కంటే ఎక్కువగా సైనికులే ప్రాణాలు కోల్పోయారు. 2010లో దంతేవాడలో నక్సలైట్లతో జరిగిన ఎన్కౌంటర్‌లో 76 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు మరణించారు. అయినప్పటికీ ఆనాటి ప్రభుత్వాలు నక్సలిజాన్ని నయంకాని వ్యాధిగా భావించి..దానిని పట్టించుకోకుండా వదిలేశాయి. 47 ఏళ్లలో తొలిసారిగా ఒక అద్భుతం జరిగింది. గతేడాది కాలంలో విధి నిర్వహణలో ఒక్క సీఆర్‌పీఎఫ్ జవాన్ కూడా ప్రాణాలు కోల్పోలేదు. దేశంలో సాయుధ నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాం. కానీ దిమాగీ నక్సల్స్ ఇంకా మన మధ్యే తిరుగుతున్నారు. వారితో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది' అని ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు.



ఇరాన్‌ను రెచ్చగొట్టి.. ఇరుకునపడ్డ ట్రంప్..

(మొదటి పేజీ తరువాయి)

ఇరాన్ యుద్ధగతిని ఎలా మార్చబోతున్నాయి.

ట్రంప్ దూకుడుకు కళ్లెమేనా?

అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలతో కనీవినీ ఎరుగని రీతిలో కంగుతిన్నారు అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. ఇజ్రాయెల్‌తో మైత్రీనీ, ఇరాన్ యుద్ధం విషయంలో సొంత ప్రజలు ఆయనను ఎంతగా వ్యతిరేకిస్తున్నారో ఈ ఫలితాలతో స్పష్టమైంది. ఒక దశలో పోలింగ్ ముందు 'ఇజ్రాయెల్‌కు ఇక నుంచి నిధులు ఇవ్వడం ఆపేస్తాం' అని ట్రంప్ స్వయంగా చెప్పినా లాభం లేకపోయింది. దీంతో ఈ ఓటమికి ఇరాన్ యుద్ధమూ కారణమేనని అధ్యక్షుడు అంగీకరించాల్సి వచ్చింది. అమెరికా కాంగ్రెస్‌లో ఇప్పుడు డెమోక్రాట్లకు ఆధిపత్యం లభించడంతో.. చట్టపరమైన నిర్ణయాల విషయంలో ట్రంప్‌నకు అడ్డంకులు ఎదురయ్యే పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా యుద్ధ ఖర్చులు, ఇజ్రాయెల్‌కు నిధుల వంటి అంశాల్లో అధ్యక్షుడిని డెమోక్రాట్లు అడ్డుకోవచ్చు. అయితే, తనకు వీటో అధికారం ఉందంటూ వారిని నిలువరించే ప్రయత్నం చేస్తున్నారు ట్రంప్. ఇజ్రాయెల్ దేశ భద్రత, అస్తిత్వ రక్షణకే ప్రాధాన్యమంటూ ఇరాన్‌పై రణభేరి మోగించారు బెంజమిన్ నెతన్యాహు. టెహ్రాన్ చేతికి అణ్వాయుధాలు దక్కకుండా చూడటమే తమ లక్ష్యమన్న ఇజ్రాయెల్ ప్రధానికి జాతీయ ఎన్నికల్లో గట్టి ఎదురుదెబ్బే తగిలింది. యుద్ధం, అమెరికాతో పొత్తు విషయంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు, అవినీతి ఆరోపణల వంటి కారణాలతో ఈ ఎన్నికల్లో నెతన్యాహు కూటమి మెజార్టీ కోల్పోయింది. అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ.. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్యా బలం లేకపోవడంతో అధికారానికి దూరమయ్యే పరిస్థితి ఏర్పడింది. అరబ్ పార్టీల మద్దతుతో విపక్ష కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది.

ట్రంప్‌పై నెతన్యాహు ఒత్తిడి తెస్తారా?

రెండు దేశాల్లో ఇలాంటి అస్థిర రాజకీయ పరిస్థితుల్లో ఇరాన్‌పై యుద్ధంలో ఇప్పుడేం జరుగుతుందనే ఆసక్తి నెలకొంది. అయితే, ఇరాన్‌పై మరోసారి భీకర దాడులు చేసేలా ట్రంప్‌పై నెతన్యాహు ఒత్తిడి తెస్తున్నట్లు కొన్ని మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇటీవల వీరిద్దరూ ఫోన్లో మాట్లాడుకున్నప్పుడు ఈ విషయం చర్చకు వచ్చినట్లు సమాచారం. పశ్చిమాసియాలో ఘర్షణలు మళ్లీ పెరిగితే ఇజ్రాయెల్లో స్థిరమైన ప్రభుత్వ ఏర్పాటు సమీప భవిష్యత్తులో కష్టమే. దాన్ని అవకాశంగా మలచుకుని అత్యవసర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయొచ్చని నెతన్యాహు భావిస్తున్నట్లు సదరు కథనాలు పేర్కొంటున్నాయి.అటు ఇరాన్‌పై అమెరికా దాడులను కూడా కొట్టిపారేయలేం. ప్రస్తుతం వెలువడిన ఫలితాల ప్రకారం కాంగ్రెస్‌లో డెమోక్రాట్లు ఆధిపత్యం పొందాలంటే వచ్చే ఏడాది జనవరి దాకా ఆగాల్సిందే. అప్పుడే కొత్త సభ్యుల ప్రమాణ స్వీకారం జరగనుంది. అప్పటిదాకా అమెరికా చట్టసభలపై ట్రంప్‌నకు ఇంకా పట్టు ఉన్నట్లే. ఇరాన్‌పై సైనిక చర్య విషయంలో త్వరలోనే ఓ నిర్ణయం తీసుకుంటామని ట్రంప్ ప్రకటించారు. ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన చర్చలు జరుగుతున్నప్పటికీ.. హర్మూజ్‌లో ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే, ఈసారి ట్రంప్ దాడులకు దిగితే గల్ఫ్ మిత్ర దేశాల నుంచి కూడా అమెరికాకు వ్యతిరేకత ఎదురయ్యే అవకాశం ఉంది.

తెలంగాణలో వర్షాలు

హైదరాబాద్, నవంబర్ 9, మనం ప్రతినిధి: బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. నవంబర్ 13న ఆగ్నేయ బంగాళాఖాతంలో ఇది ఏర్పడవచ్చని అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో తెలంగాణ, ఏపీ,యానాం ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. మరోవైపు, తెలంగాణలో చలి తీవ్రత క్రమంగా పెరుగుతోంది. ఈశాన్య దిశ నుంచి వీస్తున్న పొడి గాలుల కారణంగా రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. హైదరాబాద్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 17 నుంచి 19 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదవుతున్నాయి. రాజేంద్రనగర్, శంషాబాద్, మేడ్చల్, ఘట్కేసర్ వంటి శివారు ప్రాంతాల్లో ఉదయం వేళ దట్టమైన పొగమంచు కమ్మేస్తోంది. సాయంత్రం 5:30 తర్వాత చలి గాలుల ప్రభావం ఎక్కువగా ఉంటోంది. ఇక ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 14-16 డిగ్రీలకు పడిపోయాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో సాధారణం కన్నా 2-3 డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి.కొత్తగా ఏర్పడనున్న అల్పపీడనం ప్రభావంతో రానున్న రోజుల్లో వర్ష సూచనలు ఉన్నాయి. సోమవారం కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

జనవరి 25 నుంచి ఇంటింటి సర్వే

(మొదటి పేజీ తరువాయి)

వివరాలు నమోదు చేసుకునేందుకు ఈ వెసులుబాటు కల్పించింది. ఇక మార్చి 1 నుంచి 5వ తేదీ వరకు రివిజనల్ రౌండ్ చేపట్టనుంది. 2027 మార్చి 1వ తేదీ అర్ధరాత్రి 12 గంటలు ప్రామాణికంగా నిర్ణయించింది. ఈమేరకు కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం గెజిట్‌లో పునఃప్రచురించింది.



బియ్యం ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు

గరిష్ట ధర కిలో రూ.79గా నిర్ణయం

కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచితే కఠిన చర్యలు

హైదరాబాద్, నవంబర్ 09, (మనం బ్యూరో): ఎల్నినో ప్రభావంతో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో నిత్యవసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయి. బియ్యం ధరలు ఆకాశాన్ని తాకాయి. ఈ నేపథ్యంలో తెలంగాణలో బియ్యం ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కనిష్ఠంగా కిలో బియ్యం ధర రూ.66గా.. గరిష్ఠంగా రూ.79గా నిర్ణయించింది. హెచ్ఎంటీ, జేఎస్ఆర్ బియ్యం గరిష్ఠ ధర రూ.79గా నిర్ణయించినట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ వెల్లడించింది. కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచితే చర్యలు తీసుకుంటామని బియ్యం వ్యాపారులు, రైస్ మిల్లు యజమానులను హెచ్చరించింది. సోనా మసూరి బియ్యం ధర రూ.66, తెలంగాణ సోనా రూ.74, సన్న రకం రూ.79గా నిర్ణయించినట్లు వెల్లడించింది.

బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలపై కఠిన చర్యలు: చీఫ్ రేషనింగ్ ఆఫీసర్

రాష్ట్రంలో బియ్యం కొరతపై వస్తున్న వార్తలు అవాస్తవమని చీఫ్ రేషనింగ్ ఆఫీసర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ తెలిపారు. బియ్యం బస్తాపై ఎమ్మార్పీ (ఖ్ఖ) దాటితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కృత్రిమ కొరత సృష్టించే దళారులపై నిఘా ఉంచామని అన్నారు. బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలపై కఠిన చర్యలు తీసుంటామని హెచ్చరించారు. పదేపదే అక్రమాలకు పాల్పడితే పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని ఆయన స్పష్టం చేశారు. రిటైలర్లకు నేరుగా రైస్ మిల్లర్ల నుంచి బియ్యం సరఫరా చేస్తామని ప్రకటించారు. 25 కిలోల బస్తాపై 26 కిలోల స్టిక్కర్ వేస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. నకిలీ ఎమ్మార్పీ స్టిక్కర్లతో అధిక ధరలకు బియ్యం విక్రయిస్తే కేసులు పెడతామని తెలిపారు. హెచ్ఎంటి బియ్యం కిలో గరిష్ట ధర రూ.66, ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా కిలో గరిష్ట ధర రూ.74, హెచ్ఎంటి, జేఎస్ఆర్ బియ్యం కిలో గరిష్ట ధర రూ.79గా నిర్ణయించినట్లు వివరించారు. ధరల నియంత్రణకు పౌరసరఫరాల శాఖ ప్రత్యేక తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. వినియోగదారులు మోసపోకుండా ప్రభుత్వ చర్యలు చేపట్టిందని తెలిపారు. అధిక ధరలకు బియ్యం విక్రయిస్తే ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా ప్రజలకు తెలంగాణ చీఫ్ రేషనింగ్ ఆఫీసర్ శ్యామ్ ప్రసాద్ లాల్ సూచించారు.

టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా మహమ్మద్ అతహర్ నియామకం




హైదరాబాద్, నవంబర్ 9, మనం ప్రతినిధి: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) రాష్ట్ర అధికార ప్రతినిధిగా భువనగిరి పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ అతహర్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం ఆయనకు సోమవారం నుంచి రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించింది. పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధత, రాజకీయ అనుభవం, ప్రజా సమస్యలపై అవగాహనతో పాటు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేసిన కృషిని గుర్తించి ఈ అవకాశం కల్పించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వహించనున్న మహమ్మద్ అతహర్ పార్టీ విధానాలు, ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజా సమస్యలను మీడియా వేదికగా ప్రజలకు వివరించనున్నారు. ఈ సందర్భంగా మహమ్మద్ అతహర్‌కు పలువురు నాయకులు, అభిమానులు శుభాకాంక్షలు తెలియజేశారు.

కలెక్టర్‌కు 6 నెలల జైలు శిక్ష..

తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు

జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధించిన హైకోర్టు

గడువు దాటినా స్పందించకపోవడంతో కలెక్టర్‌పై చర్యలు



హైదరాబాద్, నవంబర్ 9, మనం ప్రతినిధి: కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన కేసులో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డికి తెలంగాణ హైకోర్టు 6 నెలల సాధారణ జైలు శిక్ష విధించింది. రూ.2 వేల జరిమానా కూడా చెల్లించాలని ఆదేశించింది. జస్టిస్ కె.లక్ష్మణ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు సోమవారం తీర్పు వెలువరించింది. అయితే అప్పీలు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ శిక్ష అమలును 4 వారాల పాటు నిలిపివేసింది. రిజిస్ట్రేషన్ చట్టం-1908లోని సెక్షన్ 22-ఏ ప్రకారం నిషేధిత ఆస్తుల జాబితాలో ఉన్న కొన్ని ప్లాట్లను తొలగించాలంటూ బాధితులు గతంలో హైకోర్టును ఆశ్రయించారు. వారి వినతిని పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని 2025 ఆగస్టులో కలెక్టర్‌ను కోర్టు ఆదేశించింది. 60 రోజుల్లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేసింది. అయితే గడువు ముగిసినా కలెక్టర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో బాధితులు 2025 అక్టోబరు 15న కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఆ తర్వాతే అధికారులు స్పందించారు. బాధితులకు నోటీసులు జారీ చేసి, 2026 ఫిబ్రవరి 26న వారి వినతిని తిరస్కరించారు. అనంతరం జులై 8న మరోసారి తిరస్కరణ ఉత్తర్వులు ఇచ్చారు. కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైన తర్వాతే అధికారులు స్పందించడం, కోర్టు ఆదేశించిన గడువులోగా నిర్ణయం తీసుకోకపోవడంపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఉద్దేశపూర్వకంగానే కలెక్టర్ కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారని నిర్ధారించింది. ఐఏఎస్ స్థాయి అధికారి న్యాయస్థానం ఆదేశాలను నిర్లక్ష్యం చేయడం సమర్థనీయం కాదని స్పష్టం చేస్తూ ఆరు నెలల జైలు శిక్ష విధించింది.

ఏసీబీ వలలో కీసర ఎస్ఐ

చార్జీషీట్ దాఖలు చేసేందుకు రూ.2 లక్షలు డిమాండ్

బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు

రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన ఎస్ఐ శ్రీనివాస్

హైదరాబాద్, నవంబర్ 9, మనం ప్రతినిధి: హైదరాబాద్ లోని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని కీసర పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఒక కేసుకు సంబంధించి చార్జీషీట్ దాఖలు చేయడానికి బాధితుడి నుంచి రూ.2 లక్షలు తీసుకుంటుండగా అధికారులు ఆయన్ను సోమవారం నాడు అదుపులోకి తీసుకున్నారు.

పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఒక కేసుకు సంబంధించి చార్జ్‌షీట్ వేయాలని బాధితుడు ఎస్ఐని కోరారు. ఇందుకు ప్రతిఫలంగా 2 లక్షలు లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంత పెద్ద మొత్తం ఇవ్వలేకపోయిన బాధితుడు చివరకు ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగారు. ఈ ఉదయం శిల్పా నగర్ వద్ద బాధితుడి నుంచి ఎస్ఐ శ్రీనివాస్ రూ.2 లక్షల నగదును లంచంగా తీసుకుంటుండగా ఏసీబీ బృందం ఆయన్ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. కీసర పోలీస్ స్టేషన్లో కొద్ది రోజుల వ్యవధిలోనే ఇలాంటి అవినీతి ఘటన మరోసారి వెలుగుచూడటం పోలీస్ శాఖలో తీవ్ర చర్చనీయాంశమైంది. గతంలోనూ స్టేషన్ బెయిల్ కోసం రూ.5 లక్షలు డిమాండ్ చేస్తూ ఇక్కడి ఇన్స్పెక్టర్ పట్టుబడిన సంగతి తెలిసిందే. ఆ ఘటన మరువకముందే తాజాగా మరో ఎస్ఐ లంచం తీసుకుంటూ దొరికిపోయాడు. పట్టుబడిన ఎస్ఐ శ్రీనివాస్‌ను ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నారు

పట్నం నరేందర్ రెడ్డి అరెస్ట్

పార్టీ కార్యకర్త అంత్యక్రియలకు వెళుతుండగా

పరిగి వద్ద అదుపులోకి తీసుకున్న పోలీసులు



హైదరాబాద్, నవంబర్ 9, మనం ప్రతినిధి: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టు పోలీసులు అరెస్టు చేశారు. పార్టీ కార్యకర్త అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వెళుతుండగా.. ముఖ్యమంత్రి పర్యటన పేరుతో పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. నరేందర్ రెడ్డిని అక్రమంగా అదుపులోకి తీసుకోవడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. వికారాబాద్ జిల్లా పరిగి సమీపంలోని బహార్పేట్ చౌరస్తా వద్ద పోలీసులు పట్నం నరేందర్‌రెడ్డి వాహనాన్ని అడ్డుకుని ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఆయన కోస్గిలో మరణించిన ఓ బీఆర్ఎస్ కార్యకర్త అంత్యక్రియలకు వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ ప్రాంతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన ఉన్నందున, ముందస్తు జాగ్రత్త చర్యగానే నరేందర్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. ఈ అరెస్టుతో ఆగ్రహించిన బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీసు వాహనాన్ని చుట్టుముట్టి నిరసన వ్యక్తం చేశారు. అయితే, నరేందర్ రెడ్డి అరెస్టును ఆయన ఖండించారు.

ఈ ఘటనపై కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ''పరామర్శించేందుకు వెళుతున్న నాయకుడిని అరెస్టు చేయాల్సిన అవసరం ఏముంది? బాధిత కుటుంబానికి అండగా నిలవడం కూడా ఇందిరమ్మ రాజ్యంలో నేరమైందా? నిర్బంధాలతో ప్రతిపక్షాలను భయభ్రాంతులకు గురిచేయడమే కాంగ్రెస్ పార్టీ పాలనగా మార్చుకుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు బీఆర్ఎస్ ఏమాత్రం భయపడదన్నారు. ప్రజల, కార్యకర్తల పక్షాన పోరాటం కొనసాగుతుందనీ, పట్నం నరేందర్ రెడ్డిని ఎలాంటి షరతులు లేకుండా విడుదల చేయాలి'' అని డిమాండ్ చేశారు. మరోవైపు, పట్నం నరేందర్ రెడ్డి అరెస్టును మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కూడా ఖండించారు. ప్రతిపక్ష నేతలను అకారణంగా నిర్బంధించడం ప్రజాస్వామ్య విరుద్ధమని పార్టీ నేతలు స్పష్టం చేశారు.

ముంచుకొస్తున్న 'ఆక్వాన్'

నవంబర్ 11 నుండి 16 మధ్య బంగాళాఖాతంలో 'ఆక్వాన్' తుఫాను ఏర్పడే అవకాశం

అమరావతి,నవంబర్ 9(మనం న్యూస్): నవంబర్ 11 నుండి 16 మధ్య బంగాళాఖాతంలో 'ఆక్వాన్' తుఫాను ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆగ్నేయ బంగాళాఖాతం, దక్షిణ అండమాన్ సముద్ర పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడి, క్రమంగా అల్పపీడనంగా మారే సూచనలు ఉన్నాయని నివేదికలు చెబుతున్నాయి. ఇరాన్ ప్రతిపాదించిన పేరుతో ఈ తుఫానుకు 'ఆక్వాన్' అని నామకరణం చేయనున్నారు. ఈ తుఫాను తీవ్రత, ప్రభావంపై భారత వాతావరణ శాఖ (ఐ ఎం డి) నిశితంగా పరిశీలిస్తోంది. అల్పపీడనం ఏర్పడిన తర్వాతే తీరం, ఇతర ప్రభావాల గురించి స్పష్టత వస్తుందని వాతావరణ నిపుణులు వెల్లడించారు. తీర ప్రాంత ప్రజలు, మత్స్యకారులు వాతావరణ శాఖ హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనించాలని అధికారులు సూచిస్తున్నారు.

రాష్ట్రంలో జరిగిన వేర్వేరు అగ్నిప్రమాదాలపై సీఎం ఆరా

రాజాం, గన్నవరం, తిరువూరుల్లో అగ్నిప్రమాదాలు

అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

అమరావతి, నవంబరు 09,(మనం ప్రత్యేక ప్రతినిధి) : విజయనగరం జిల్లా రాజాం సహా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు అగ్నిప్రమాదాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా తీశారు. రాజాంలోని ఓ ఆటోమొబైల్ షోరూమ్లో జరిగిన అగ్నిప్రమాదంలో భారీఎత్తున ఆస్తినష్టం జరిగింది. దీపావళి టపాసులు ప్రమాదవశాత్తు షోర్మూ పడి మంటలు అంటుకోవటంతో షోరూమ్ దగ్ధమైంది. ఈ ఘటనలో భారీగా ఆస్తి నష్టం చోటు చేసుకుంది. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే ఘటనా స్థలికి చేరుకుని మంటలు ఆర్పివేసినట్టు అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. కృష్ణా జిల్లా గన్నవరంలో బాణా సంచా కాలుస్తుండగా నిప్పు రవ్వలు ఎగిరిపడి ఓ ఫర్నిచర్ దుకాణానికి మంటలు అంటుకున్నాయి.



తిరువూరులోని మరో దుకాణంలోనూ షార్ట్ సర్క్యూట్ జరిగి దుకాణం దగ్ధమైంది. మంటల కారణంగా ఆస్తినష్టం జరగటంపై సీఎం విచారం వ్యక్తం చేశారు. ఈ మూడు ఘటనలపై ఆరా తీసిన సీఎం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు జారీ చేశారు.

ఐజేయూ సెక్రటరీని కలిసిన తాడేపల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం నవంబర్ 8(మనం న్యూస్): దీపావళి పర్వదిన సందర్భంగా ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) సెక్రెటరీ జనరల్ దూసనపూడి సోమసుందర్ ని తాడేపల్లిగూడెం ప్రెస్ క్లబ్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సోమసుందర్ మాట్లాడుతూ జర్నలిస్టులందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. జర్నలిస్టులు సమాజంలో వెలుగులు నింపే దీపాల వంటి వారని, నిజాలను నిర్భయంగా ప్రజల ముందుకు తీసుకురావడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమన్నారు. దీపావళి పండుగ అందరి జీవితాల్లో సంతోషం, ఆరోగ్యం, శాంతి నింపాలని ఆకాంక్షించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మైలవరపు రవి కిరణ్, ప్రధాన కార్యదర్శి ఆశీర్వాదరావు, ఉపాధ్యక్షులు రాంబాబు, బాసింశెట్టి బాలాజీ, లక్ష్మణరావు, సభ్యులు నాగేశ్వరరావు , సుబ్బారావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ

టీడీపీకే కేటాయించాలి



తాడేపల్లిగూడెం నవంబర్ 9(మనం న్యూస్): సమన్వయం కోసం ఎంతో ప్రయత్నించామని, పార్టీ పెద్దలు వదిలేస్తే సొంతంగా పోటీ చేయడానికి సిద్ధమని తాడేపల్లిగూడెం టీడీపీ ఇన్ఛార్జ్ వలవల బాబ్జీ స్పష్టం చేశారు.సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమిలో భాగంగా తాడేపల్లిగూడెం మున్సిపాలిటీని టీడీపీకే కేటాయించాలని డిమాండ్ చేశారు. తాడేపల్లిగూడెంలో తెలుగుదేశం పార్టీకి బలమైన పునాది ఉందని, కార్యకర్తలు, నాయకులు అందరూ కలిసి పనిచేస్తే మున్సిపాలిటీని కచ్చితంగా గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. అక్కడ పోటీ చేసి తమ బలం నిరూపించుకుంటామని ఆయన అన్నారు.కూటమి ధర్మం పాటిస్తూ ఇప్పటివరకు సమన్వయంతో వెళ్లామని, అయినా టీడీపీకి సరైన ప్రాధాన్యత దక్కడం లేదని బాబ్జీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో పార్టీ పెద్దలు వెంటనే స్పష్టత ఇవ్వాలని కోరారు.మున్సిపాలిటీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించేందుకు కార్యకర్తలు ఇప్పటి నుండే సిద్ధంగా ఉండాలని, వార్డుల వారీగా ప్రచారం, ప్రజల సమస్యల పరిష్కారం పై దృష్టి పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

ఎల్ నినో నేపథ్యంలో 'తాగునీటి భద్రత'కు అత్యంత ప్రాధాన్యత: కలెక్టర్ అంకిత్

- ఎల్ నినోను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు
- సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా నీటి వనరుల బలోపేతం
- వైరా జలాశయం ద్వారా ఎనిమిది మండలాలకు తాగునీటి భరోసా
- 9,436 ఎకరాల ఆయకట్టుకు సాగునీటి భద్రత
- 20 చెరువుల్లో 1,058.65 మిలియన్ క్యూబిక్ ఫీట్ల నీటి నిల్వ



భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 9 (మనంప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎల్ నినో ప్రభావంతో భవిష్యత్తులో వర్షాభావ, కరువు పరిస్థితులు ఏర్పడినప్పటికీ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా కల్పించడమే ప్రధాన లక్ష్యంగా అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ, సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను జిల్లాలోని జలాశయాలు, చెరువులకు మళ్లిస్తున్నట్లు పేర్కొన్నారు. తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ నీటి నిల్వలను పెంచడం, భూగర్భ జలాలను రీఛార్జ్ చేయడం, సాగునీటి వనరులను పరిరక్షించడం వంటి చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో వివరించారు. 2026-27 వ్యవసాయ సంవత్సరంలో ఎల్ నినో వాతావరణ పరిస్థితుల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని నీటి వనరుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కఠిన రాతి నేలల ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు తగ్గిపోవడం, స్థానిక చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు అడుగంటడం వంటి పరిస్థితులు ఏర్పడినప్పుడు తాగునీటి అవసరాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గోదావరి జలాలను ప్రత్యామ్నాయ నీటి వనరుగా వినియోగించుకునేందుకు సీతారామ ఎత్తిపోతల పథకం ఎంతగానో దోహదపడుతోందని వివరించారు.

తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా సుమారు 17,150 ఎకరాలకు సాగునీరు అందించే సామర్థ్యం కలిగిన వైరా జలాశయం నీటిమట్టం డెడ్ స్టోరేజ్ స్థాయికి చేరుకున్న నేపథ్యంలో సీతారామ ఎత్తిపోతల పథకంలోని రాజీవ్ కాలువ ద్వారా గోదావరి జలాలను మళ్లించి జలాశయాన్ని నింపేందుకు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ చర్యల ద్వారా వైరా పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లోని ఎనిమిది మండలాల ప్రజలకు తాగునీటి సరఫరాకు భరోసా కల్పించేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. వర్షాలు ఆశించిన స్థాయిలో కురవని పరిస్థితుల్లో కూడా గోదావరి జలాలను ప్రత్యామ్నాయంగా వినియోగించుకోవడం ద్వారా ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు వీలవుతోందని అన్నారు . ప్రజలకు తాగునీరు అందించడం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, అందుకు అనుగుణంగా జలాశయాల్లో నీటి నిల్వలను కాపాడుకోవాలని, తాగునీటి అవసరాలకు సరిపడా నీటిని అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలను ముందుగానే అంచనా వేసి, ఎక్కడా సరఫరాలో అంతరాయం కలగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా అశ్వాపురం మండలంలోని బి.జి. కొత్తూరు పంప్ హౌస్-1 వద్ద ఖరీఫ్ 2026 సీజన్లో మొత్తం 1,604 గంటల పాటు భారీ మోటార్లను నిర్వహించి గోదావరి నది నుంచి 9.088 టీఎంసీల నీటిని ప్రధాన కాలువలోకి ఎత్తిపోసినట్లు కలెక్టర్ వివరించారు. అదేవిధంగా వి.కె. రామవరం వద్ద పంప్ హౌస్-2, కమలాపురం వద్ద పంప్ హౌస్-3 ద్వారా కూడా నీటిని వివిధ ప్రాంతాలకు తరలించినట్లు తెలిపారు. సంక్లిష్టమైన భౌగోళిక పరిస్థితులు ఉన్న ప్రాంతాలకు సైతం గోదావరి జలాలను మళ్లించడం ద్వారా నీటి కొరతను అధిగమించేందుకు ఈ పంపింగ్ కార్యకలాపాలు దోహదపడుతున్నాయని అన్నారు . ఈ నీటి మళ్లింపు ద్వారా ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, జూలూరుపాడు, సుజాతనగర్, తల్లాడ తదితర మండలాల్లోని నీటి వనరులకు ప్రయోజనం చేకూరిందని తెలిపారు. నీటి లభ్యత తక్కువగా ఉండే ప్రాంతాల్లోని చెరువులు, జలాశయాలను నింపడం ద్వారా తాగునీటి అవసరాలకు అదనపు భరోసా కల్పించడంతో పాటు వ్యవసాయ అవసరాలకు కూడా నీరు అందుబాటులోకి వచ్చిందన్నారు. జిల్లాలో సీతారామ ఎత్తిపోతల పథకం ప్యాకేజీలు 4, 7, 8, 9 మరియు 18ఎల్ రాజీవ్ కాలువ పరిధిలోని 20 మైనర్ ఇరిగేషన్ చెరువుల్లో గోదావరి జలాలను నిల్వ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ చెరువుల్లో మొత్తం 1,058.65 మిలియన్ క్యూబిక్ ఫీట్ల నీటిని నింపడం ద్వారా ప్రత్యక్షంగా 9,436 ఎకరాల ఆయకట్టుకు సాగునీటి భద్రత కల్పించినట్లు వివరించారు. ములకలపల్లి మండలంలోని ఏడుళ్లవాగు చెరువు, పెద్దయ్య చెరువు, శ్రీరాములు చెరువు, తుమ్మకుంట, ఊరచెరువు, ఏడుళ్ల చెరువుల్లో నీటిని నిల్వ చేసినట్లు తెలిపారు. అన్నపురెడ్డిపల్లి మండలంలోని వెంగళరావు సాగర్, పెద్దచెరువు, అన్నదైవం ప్రాజెక్టు, చంద్రుగొండ మండలంలోని మద్దుకూరు ప్రాజెక్టు, జంట్లకుంట, గండ్ర వీరయ్య కుంట, శనగకుంట, జూలూరుపాడు మండలంలోని మేడికుంట, ఎర్రవాగు ప్రాజెక్టు, శనగచెరువు, సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం ప్రాజెక్టు, తల్లాడ మండలంలోని సుబ్బమ్మ చెరువు, బ్రాహ్మణపల్లి చెరువు, ఓర చెరువుల్లో నీటి నిల్వలను పెంచినట్లు తెలిపారు . చెరువుల్లో నీటిని నిల్వ చేయడం వల్ల ఆయా గ్రామాల్లోని రైతులకు సాగునీటి భరోసా లభించడంతో పాటు పశువుల అవసరాలకు, స్థానిక నీటి వనరుల వినియోగానికి కూడా ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ముఖ్యంగా వర్షాభావ పరిస్థితుల్లో చెరువుల్లో నీటి నిల్వలు అందుబాటులో ఉండటం వల్ల వ్యవసాయానికి ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించవచ్చని తెలిపారు. జిల్లాలోని కఠిన రాతి నేలల ప్రాంతాల్లో చెరువులు, కాలువల్లో నీటిని నిల్వ చేయడం ద్వారా భూగర్భ జలాల రీఛార్జ్కు అవకాశం ఏర్పడుతుందని కలెక్టర్ తెలిపారు. చెరువుల్లో నీటి నిల్వలు పెరగడం వల్ల పరిసర ప్రాంతాల్లోని బావులు, బోరుబావుల్లో భూగర్భ జలమట్టాలు పెరిగేందుకు దోహదపడుతుందని వివరించారు. తద్వారా వ్యవసాయ అవసరాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి వనరుల లభ్యత మెరుగుపడుతుందని అన్నారు . నీటి వనరులను ప్రస్తుత అవసరాలకే కాకుండా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వర్షాకాలంలో లభించే నీటిని గరిష్ఠంగా నిల్వ చేసుకోవడం, చెరువుల పూర్తి సామర్థ్యాన్ని వినియోగించుకోవడం, భూగర్భ జలాల పెంపునకు అనువైన చర్యలు చేపట్టడం ద్వారా కరువు ప్రభావాన్ని తగ్గించవచ్చని తెలిపారు.

సీతారామ ఎత్తిపోతల పథకంలోని రాజీవ్ కాలువ ద్వారా మళ్లించిన గోదావరి జలాలు ఖమ్మం జిల్లాలోని నాగార్జునసాగర్ ఎడమ కాలువ చివరి ఆయకట్టు ప్రాంతాలకు కూడా ప్రయోజనం చేకూర్చాయని కలెక్టర్ తెలిపారు. చివరి ఆయకట్టులో నీటి కొరత కారణంగా పంటలు ఎండిపోయే పరిస్థితులను నివారించేందుకు గోదావరి జలాలను వినియోగించినట్లు వివరించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని 123 చిన్న నీటిపారుదల చెరువుల్లో 3,967 మిలియన్ క్యూబిక్ ఫీట్ల నీటిని నిల్వ చేయడం ద్వారా 11,965 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడంతో పాటు వైరా ప్రాజెక్టు పరిధిలో సుమారు 5 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటి భద్రత కల్పించినట్లు తెలిపారు .

ఎల్ నినో ప్రభావంతో భవిష్యత్తులో వర్షాభావ పరిస్థితులు తీవ్రతరమైనప్పటికీ ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ అందుకు అనుగుణంగా నీటి నిల్వలను అందుబాటులో ఉంచాలని సూచించారు. తాగునీటి సరఫరా పైప్లైన్లలో లీకేజీలను అరికట్టాలని, అవసరమైన చోట తక్షణ మరమ్మతులు చేపట్టాలని, తాగునీటి వనరులను క్రమం తప్పకుండా పరిశీలించాలని తెలిపారు. నీటి వృథాను నివారించడంతో పాటు ప్రజలకు నీటి పొదుపుపై అవగాహన కల్పించాలని సూచించారు.

సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకోవడం వల్ల భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తాగునీటి భద్రతకు భరోసా కల్పించడంతో పాటు 20 చెరువుల్లో నీటి నిల్వలను పెంచడం, 9,436 ఎకరాల ఆయకట్టుకు సాగునీటి భద్రత కల్పించడం, భూగర్భ జలాల పెంపునకు దోహదపడటం సాధ్యమైందని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు.

స్వర్గం -నరకం

జేబులో గాంధీ.. మనసుకు శాంతి
చేతిలో బ్రాందీ.. పోతుంది అశాంతి...
గాంధీ.. బ్రాందీ..ఉంటే బతుకు జిగేల్..
బాధలు పరార్...
నేడు రెండు రాజ్యం చేస్తున్నాయి
నేడు రెండు సంఘ మూలాలను
నాశనం చేస్తున్నాయి...
హద్దులు దాటితే నరకం హద్దుల్లో ఉంటేనె స్వర్గం

- రేడియమ్

9291527757

మక్కువ మీరగ

నీవు లేని ఈ రోజులను
ఇప్పుడిప్పుడే గోడలు
అలవాటు పడుతున్నాయి
బహుశా ఇంతటి నిశ్శబ్దాన్ని భరించటం
నీవు లేని ఈ గదులకు
కొంత కష్టమే కావచ్చు
ఒంటరిగా గోడ గడియారంలో
లోలకం మాత్రం
కాసేపు అలా ముందుకు,వెనుకకు కదిలి
ఏదో రహస్యం తెలుసుకుని
వస్తున్నట్టు కుదుట బడుతుంది
అక్కడక్కడా నీవు నడిచిన
పాదముద్రలు కొద్దికొద్దిగా
కనిపిస్తూ చెప్పాలనుకున్న కథలు చెప్పకుండా
నిద్రలోకి జారిపోతున్నాయి
గాలి వేగానికి ఎగురుతున్న పక్షిలా
కిటికీ పరదాలు లేచివస్తూ
ఏవో మాటల్ని నేలపై
చల్లిపోతున్నాయి

- డా. సుంకర రమేశ్

9492180764

పరమ విష్ణు భక్తుడు బలి

కార్తీక శుద్ధ పాడ్యమికి బలి పాడ్యమి అని పేరు. బలి చక్రవర్తికి ప్రీతికరమైన రోజు. బలి చక్రవర్తి కథను గూర్తి మహాభారతం, రామాయణం వంటి గ్రంధాలలోనే కాక బ్రహ్మపురాణం, కూర్మ పురాణం, మత్స్యపురాణం వంటి వానిలో కూడా ప్రస్తావన ఉంది. క్రీ.పూ 2వ శతాబ్దంలో పాణిని రాసిన అష్టాధ్యాయి 3.1.26 లో పతంజలి మహా భాష్యంలో బలి గురించి వివరణ ఉంది.

దాతృత్వంలో ప్రసిద్ధి చెందిన బలి వామన రూపంలో యాచన చేసిన విష్ణువుకు యాచన కోరుకోమని అంటాడు. అప్పుడు మూడడుగుల స్థలం ఇవ్వమని కోరుకుంటాడు. బలి వాగ్దానం చేసి నంతనే విష్ణుమూర్తి త్రివిక్రమ రూపం ఎత్తి రెండు అడుగులతో ఆకాశం, భూగోళాన్ని వశం చేసు కుంటాడు. ఇక మూడో అడుగు ఎక్కడ పెట్టాలని అడిగినప్పుడు బలి తన శిరస్సును చూపుతాడు. దాంతో త్రివిక్రముడతనిని పాతాళానికి తొక్కేస్తాడు. బలి భార్య వింధ్యావళి పతిభిక్షను కోరగా విష్ణువు అనుగ్రహించి వారి కుటుంబానికి పాతాళలోకాన్ని వాసం చేసి, తాను అతడి వాకిట గదాధరుడుగా కావలికాచే వాడయ్యెను. బలి చక్రవర్తి చిరంజీవి.

బలి చక్రావర్తి కార్తీక శుద్ధ పాడ్యమి తాను పా లించిన భూలోకాన్ని చూడడానికి సాయంకాలం వస్తాడు. ఆయన వెంట గదాధరుడైన భగవంతుడు మహావిష్ణువు వస్తాడు. వీధులు శుభ్రంగా ఉండి, ప్రతి ఇంటి ముంగిట దీపాలూ, మామిడి తోర ణాలు, రంగు రంగుల ముగ్గులూ ఉండటం చూసి, తన రాజ్యంలో ప్రజలందరూ ఆనందం, ఉత్సా హం, భోగభాగ్యాలతో హాయిగా ఉన్నారని బలి సంతోషపడతాడు. భగవంతుడు ఆనందిస్తాడు. అందుకే దీపావళి మరుసటి రోజు 'బలిపాడ్యమి' అయ్యింది. ఆ రోజు తెల్లవారు జామునే బలి చక్రవర్తిని పూజించాలి. బియ్యపు పిండితో బలి చక్రవర్తి బొమ్మ గీచి పూజ చేయవచ్చు. పూజ సమ యంలో 'బలిరాజ నమస్తుభ్యం విరోచనసుత ప్రభో, భవిష్యేంద్ర సురారాతే పూజేయం ప్రతి గృహ్యతాం' అని ప్రార్థించాలని, గోవర్ధన పూజ చేయాలని, ఆవులను అలంకరించి స్వేచ్ఛగా తిర గనివ్వాలని, శక్తి కొలది దానం చెయాలని చెప్తారు.

- ఆర్‌కేఎస్

9440595494

ప్రపంచానికి శాస్త్రమే పరమావధి



విజ్ఞాన శాస్త్రం మానవ జీవితాన్ని ఎంతో మార్చింది. జీవన ప్రమాణాలను మెరుగుపరిచింది. కొత్త ఆవిష్కరణలతో మానవ జ్ఞానానికి హద్దులు లేకుండా చేసింది. అయినప్పటికీ ప్రపంచం యుద్ధాలు, వాతావరణ మార్పులు, మహమ్మారులు, ఆహార కొరత, సాంకేతిక అసమానతలు వంటి సమస్యలను ఎదు ర్కొంటూనే ఉంది. శాస్త్ర సాంకేతిక రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్నా, దేశాల మధ్య సహకారం తగ్గుతున్న ప్రస్తుత పరిస్థి తుల్లో శాంతి, సుస్థిర అభివృద్ధికి విజ్ఞాన శాస్త్రం మరింత కీలక పాత్ర పోషించాలి. ప్రతి సంవత్సరం నవంబర్ 10న జరుపుకునే ప్రపంచ శాంతి, అభివృద్ధి కోసం విజ్ఞాన శాస్త్ర దినోత్సవం ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తుచేస్తుంది. శాస్త్రీయ పురోగతి కేవలం దేశాల మధ్య పోటీకి పరిమితం కాకుండా మానవాళి సంక్షేమానికి ఉపయోగపడాలి. 2026 సంవత్సరానికి శాస్త్రీయ దౌత్యం ద్వారా ఉమ్మడి ప్రయోజనాల సాధన అనే ఇతివృత్తాన్ని ప్రకటించారు. రాజకీయంగా విభేదించే దేశాల మధ్య కూడా శాస్త్రీయ సహకారం నమ్మకాన్ని, పరస్పర సంభాషణను పెంచగలదన్నదే దీని ఉద్దేశం. శాస్త్రీయ దౌత్యం అంటే వివిధ దేశాల పరిశోధకులు కలిసి పనిచేయడం మాత్రమే కాదు. జ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం, అనుభవాలను పంచుకుంటూ అందరికీ సంబంధించిన సమ స్యలకు పరిష్కారాలు కనుగొనడం కూడా. వాతావరణ మార్పు లు, అంటువ్యాధులు, సముద్ర కాలుష్యం, జీవవైవిధ్య నష్టం వంటి సమస్యలకు దేశాల సరిహద్దులతో సంబంధం లేదు. ఏ ఒక్క దేశమూ వీటిని ఒంటరిగా ఎదుర్కోలేదు. అందుకే శాస్త్రీయ సహకారం అవసరం.

కరోనా మహమ్మారి అంతర్జాతీయ శాస్త్రీయ సహకారంలోని బలాలను, పరిమితులను రెండింటినీ బయటపెట్టింది. వైరస్ను అర్థం చేసుకోవడానికి, వ్యాక్సిన్లను అభివృద్ధి చేయడానికి ప్రపంచవ్యాప్తంగా పరిశోధకులు సమాచారాన్ని, పరిశోధన ఫలితాలను పంచుకున్నారు. అయితే వ్యాక్సిన్ల, వైద్య సదుపాయాల పంపిణీలో కనిపించిన అసమానతలు ప్రపంచ దేశాల మధ్య సహకారం ఎంత బలహీనంగా ఉందో చూపిం చాయి. శాస్త్రీయ ఆవిష్కరణల ప్రయోజనాలు అందరికీ సమా నంగా అందినప్పుడే అవి మానవాళికి నిజమైన మేలు చేస్తాయి. వాతావరణ మార్పులు కూడా అంతర్జాతీయ సహకారం ఎంత అవసరమో తెలియజేస్తున్నాయి. భూతాపం పెరగడం, ప్రకృతి వైపరీత్యాలు తీవ్రమవడం వల్ల కలిగే ప్రమాదాలను శాస్త్రవేత్తలు ఎప్పటినుంచో హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ ఆ హెచ్చరికలకు తగినట్లుగా ప్రభుత్వాల చర్యలు ఉండటం లేదు. చారిత్రకంగా కర్బన ఉద్గారాలకు తక్కువ బాధ్యత వహించిన అభివృద్ధి చెందుతున్న దేశాలే వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కోవడంలో ఎక్కువ ఇబ్బందులు పడుతున్నాయి. అందువల్ల అంతర్జాతీయ సహకారం పరిశోధనలకే పరిమితం కాకుండా అందుబాటు ధరల్లో సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక సాయం, శాస్త్రీయ నైపుణ్యాన్ని కూడా అందించాలి.

కొత్త సాంకేతిక పరిజ్ఞానాలు కూడా అనేక సవాళ్లను ముందుకు తెస్తున్నాయి. కృత్రిమ మేధ, జీవ సాంకేతికత, ఆధునిక కంప్యూటింగ్ రంగాలు అభివృద్ధికి ఎన్నో అవకాశాలను కల్పిస్తున్నాయి. అదే సమయంలో వ్యక్తిగత సమాచార భద్రత, తప్పుడు ప్రచారం, సైబర్ దాడులు, ఉపాధి వంటి అంశాలపై ఆందోళనలు పెరుగుతున్నాయి. ప్రజా సంక్షేమం కంటే సాంకేతిక ఆధిపత్యమే ముఖ్యమైతే అసమానతలు మరింత పెరుగుతాయి. ఈ పరిజ్ఞానాల దుర్వినియోగాన్ని అరికట్టడానికి, బాధ్యతా యుతమైన ప్రమాణాలను రూపొందించడానికి దేశాల మధ్య సహకారం అవసరం.

భారతదేశానికి ఈ ఏడాది ఇతివృత్తం అంతర్జాతీయ శాస్త్రీయ సహకారంలో తన పాత్రను మరింత బలోపేతం చేసుకునే అవకాశాన్ని కల్పిస్తోంది. అంతరిక్ష పరిశోధన, ఔషధ తయారీ, వ్యవసాయం, సమాచార సాంకేతిక రంగాల్లో భారత్ గణనీయమైన పురోగతి సాధించింది. తక్కువ ఖర్చుతో సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో మన అనుభవం ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఉపయోగపడుతుంది. అయితే ఈ లక్ష్యాలను సాధించాలంటే పరిశోధన, అభివృద్ధి రంగాల్లో పెట్టుబడులు పెరగాలి.

కేంద్ర ప్రభుత్వ విజ్ఞాన, సాంకేతిక శాఖ రూపొందించిన 2025-26 పరిశోధన గణాంకాల నివేదిక ప్రకారం, 2023-24లో భారతదేశ పరిశోధన, అభివృద్ధి వ్యయం సుమారు రూ.2.45 లక్షల కోట్లు. ఇది దేశ స్థూల దేశీయో త్పత్తిలో కేవలం 0.84 శాతం మాత్రమే. ఈ వ్యయంలో ప్రైవేటు రంగం వాటా 51.8 శాతంగా ఉంది. ప్రైవేటు రంగం భాగ స్వామ్యం పెరగడం మంచి పరిణామమే. అయితే ప్రాథమిక పరిశోధనలు, విశ్వవిద్యాలయాల్లో సదుపాయాలు, దీర్ఘకాలిక శాస్త్రీయ ప్రాజెక్టులకు మరింత నిధులు అవసరం. యువ పరిశోధకులను ప్రోత్సహించడంతోపాటు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, విశ్వవిద్యాలయాల మధ్య సమన్వయం పెరగాలి.

శాస్త్రీయ పురోగతి సామాన్య ప్రజల జీవితాల్లోనూ కనిపిం చాలి. ఆరోగ్యం, వ్యవసాయం, విద్య, ఇంధనం, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లో ప్రభుత్వ నిర్ణయాలు శాస్త్రీయ ఆధారాలపై ఉండాలి. డిజిటల్ మాధ్యమాల ద్వారా తప్పుడు సమాచారం వేగంగా వ్యాపిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో శాస్త్రీయ దృక్పథం, హేతుబద్ధమైన ఆలోచన ఎంతో అవసరం. ప్రజల్లో శాస్త్ర విజ్ఞానంపై అవగాహన పెంచేందుకు ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, మీడియా కలిసి పనిచేయాలి.

శాస్త్రీయ విద్య, పరిశోధన అవకాశాలు అందరికీ అందు బాటులో ఉండాలి. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, మహిళలు కూడా పరిశోధన, ఆవిష్కరణల్లో పాల్గొనే అవకాశాలు పొందాలి. ఆర్థిక ఇబ్బందులు, సరైన సదుపాయాల కొరత కారణంగా ప్రతిభ వెనుకబడితే ఒక దేశం తన పూర్తి శాస్త్రీయ సామర్థ్యాన్ని సాధించలేదు.

శాస్త్రం ఒక్కటే యుద్ధాలను ఆపలేదు. రాజకీయ విభేదాలనూ పరిష్కరించలేదు. కానీ చర్చలకు ఉమ్మడి వేదికను కల్పించగలదు. జ్ఞానాన్ని పంచుకోవడం ద్వారా దేశాల మధ్య నమ్మకాన్ని పెంచగలదు. ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్య లకు ఆచరణాత్మక పరిష్కారాలను చూపగలదు. దేశాలు తమ ప్రయోజనాలను వదులుకోవాల్సిన అవసరం లేకుండానే శాస్త్రీయ సహకారం సాధ్యమవుతుంది. ఉమ్మడి సమస్యలను ఎదుర్కోవడానికి సమష్టి కృషి అవసరమని ఇది తెలియజేస్తుంది.

ప్రపంచ విజ్ఞాన శాస్త్ర దినోత్సవం కేవలం ఆవిష్కరణలను గుర్తుచేసుకునే వేడుకగా మిగిలిపోకూడదు. పరిశోధనలకు నిధులు పెంచాలని ప్రభుత్వాలకు, సమాజంతో మమేకం కావాలని శాస్త్రవేత్తలకు, రాజకీయ విభేదాలను పక్కనపెట్టి సహక రించాలని దేశాలకు ఇది గుర్తుచేయాలి. ఒక దేశం ఎంత ఆధునికంగా మారిందన్నది మాత్రమే శాస్త్రీయ పురోగతికి కొలమానం కాదు. ఆ పురోగతి ప్రజల జీవితాలను ఎంతగా మెరుగుపరిచిందన్నదే అసలైన ప్రమాణం.

విభేదాలతో నిండిన ప్రపంచంలో విజ్ఞాన శాస్త్రం మరో పోటీ రంగంగా మారకూడదు. అది మానవాళి ఉమ్మడి సంపదగా నిలవాలి. శాస్త్రీయ దౌత్యం ద్వారా దేశాల మధ్య సహకారాన్ని పెంచుకోవడం ప్రపంచ శాంతికి, సమాన అభివృద్ధికి, సుస్థిర భవిష్యత్తుకు ఎంతో అవసరం.

- డి జె మోహన రావు

వైష్ణవ, శైవ భక్తులకు కార్తీకం ప్రత్యేకం



నేటి నుంచే కార్తీక మాసం,దాని విశిష్టత!

చంద్రుడు పూర్ణుడై ఏనక్షత్రంలో ఉంటాడో ఆ నక్షత్రం పేరుతో కార్తీకమాసం అనే పేరు వచ్చింది గంగానదికన్నా గొప్పనది, వేదాలకు సమానమైన శాస్త్రాలు, విష్ణువు దేవునితో సమానమైన దేవుడు లేడని పురాణాల వచనం.ఈ సంత్సరం నవంబర్ 9 నాడు ప్రారంభం అయ్యి డిసెంబర్ 8 వరకు కార్తీక మాసం. శివ కేశవులకు అ త్యంత ప్రీతి కరమైన మాసం రుద్రాభిషేకాలు, విశేష అర్చన లు, రుద్రం, లక్ష బిల్వార్చనలు ఈ మాసంలో చేస్తారు. వీటి అన్నింటికీ శివు డు సంతోషుడై భక్తుల అధిష్టాలనుతీరు స్తాడు. కనుక శివునికి 'అశుతోషుడు' అనే పేరు వచ్చింది. చివరికి భక్తితో చెంబెడు నీళ్లు పోసిన సంతృప్తి చెందుతాడు. అందుకే శివుని అభిషేక ప్రియుడు అంటారు. విష్ణువు అలంకార ప్రియుడు. ఎవరైతే బిల్వ దళ ములతో శివుని పూజించిన లక్షల సంవత్సరాలు స్వర్గంలో జీవించవచ్చు అనే ప్రతితి ఉంది. ప్రదోషకాలంలో పరమేశ్వరుడు ఏకకాలంలో రెండు రూపాయలను ప్రదర్శి స్తాడు.ఎడమ భాగాన పార్వతి కుడి భాగాన పరమేశ్వరుడు దర్శనమిస్తాడు అర్ధనారీశ్వరుడుగా దర్శనమిచ్చు కాలం ప్రదోషకాలం తులసి దళా లతో శ్రీమహా విష్ణువు నుకార్తీకమాసం లోపూజిస్తేముక్తి దాయకం అందుకే కార్తీక మాసాన్ని దామోదర ప్రత్యర్థం అంటారు. ఈ మాసంలో ఏవ్రత దీక్ష అనుస రించిన ఏ మంత్ర దీక్ష తీసుకున్న సత్ఫలితాలు వస్తాయి. కార్తీక దీపాలను వెలిగించడం దీపదానం చెయ్యడం వల్ల సకలజీవరాశులు,రాళ్లు రప్పలు, వృక్షాలు కూడా ముక్తిని పొందుతాయి.ఈ నెలలో ప్రతి సోమవారం, ఏకాదశి, ద్వాదశి, పూర్ణిమలు విశేష ప్రాధాన్యతను కల్గి ఉంటాయి.ఈ మాసం లోనే ఆకాశదీపం పెడతారు. నది స్నానము చెయ్య డం వలన అనేక వృక్ష మూలికలు నీటిలో కరిగి మనకు ఆరో గ్యాన్ని ఇస్తాయి. శాస్త్రీయంగా సంస్కృతి పరంగా కార్తీక మాసం చాలా ముఖ్యమైనది.

- ఉమారాణి వైద్య


9000346200

తెలుగుకు ఆయనొక వెలుగు..

అమోఘ సంకల్పంతో
తెలుగును వెలిగించిన
మహోన్నత భాషాభిమాని
జీర్ణవస్థకు చేరి
శిథిలమై కనుమరుగవుతున్న
కవి పండితుల అమూల్య
సాహిత్యాన్ని
ఎంతో శ్రమకోర్చి సేకరింపజేసి
తాళపత్రాల బూజు దులిపి
నలుమూలల నుండి
లిఖిత పత్రాలను సేకరించి
పండితులను తానే
స్వయంగా నియమించి
లుప్తమైన భాగాలను వారితో
సప్రామాణికంగా పరిష్కరింపజేసి
భాషా సాహిత్య పరిరక్షణనే
తన గురుతర బాధ్యతగా భావించి
పరిష్కృతాలనే పుస్తకాలుగా ప్రచురించి
భావితరాలకు మహోన్నత
సాహిత్య నిధులను అందించిన
అవిరళ కృషీవలుడు
అసామాన్య సాహిత్యకారుడు
పుట్టుకతో ఆంగ్లేయుడైనా
తన మాతృభాష కన్నా
తెలుగునే ఎదకత్తుకున్నవాడు
భాషాదీప్తి కొడిగట్టకుండా
అనుక్షణం కాపాడిన ధీమంతుడు
ప్రాచీన గ్రంథాలను కాపాడి
ఆ సత్కవుల కవిత
కళాప్రతిభను చాటినవాడు
వేమన పద్యాలను శ్రద్ధతో శోధించి
సామాజిక తాత్వికతా సందేశాల్ని
గ్రహించేందుకు దారి వేసిన వాడు
ద్విభాషా నిఘంటువుల రూపకర్త
వ్యాకరణ, వాచక, కథా రచనకు
ఆయనే ఒక స్మరణీయ ఉదాహరణ
తెలుగు ఉన్నంతకాలం
యేతరమైనా
ఒక వెలుగై నడిపించిన
ఆ పేరును తలవడం తథ్యం
(10 నవంబర్ సిపిబ్రౌన్ జయంతి)

- డా. తిరునగరి శ్రీనివాస్

9441464764



తొలి రాజకీయ సంస్థ స్థాపకుడు సురేంద్రనాథ్ బెనర్జీ

సర్ సురేంద్రనాథ్ బెనర్జీ బ్రిటిష్ రాజ్ కాలంలో భారత రాజకీయ నాయకులలో ఒకడు. తొలి భారతీయ రాజకీయ సంస్థలలో ఒకటైన ఇండియన్ నేషనల్ అసోసియేషన్ను స్థాపించాడు. దీని ద్వారా ఆనందమోహన్ బోస్‌తో కలిసి 1883, 1885 లలో ఇండియన్ నేషనల్ కాన్ఫరెన్స్ రెండు సెషన్లకు నాయకత్వం వహించాడు. బెనర్జీ తరువాత ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడిగా మారారు. కాంగ్రెస్ మాదిరిగా కాకుండా మోంటాగు-చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలను స్వాగతించాడు. చాలా మంది ఉదారవాద నాయకులతో అతను కాంగ్రెస్ నుండి నిష్క్రమించి, 1919 లో ఇండియన్ నేషనల్ లిబరేషన్ ఫెడరేషన్ అనే కొత్త సంస్థను స్థాపించాడు. అతను ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ వ్యవస్థాపక సభ్యులలో ఒకడు.

సురేంద్రనాథ్ బెనర్జీ బెంగాల్ ప్రావిన్స్ లోని కలకత్తాలో బెంగాలీ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. అతని తండి దుర్గాచరణ్ బెనర్జీ వైద్యుడు, ఉదారవాద, ప్రగతిశీల ఆలోచనలు గలవాడు. కలకత్తా విశ్వవిద్యాలయం నుండి పట్టా పొందిన తరువాత, అతను 1868 లో రోమేష్ చుందర్ దత్, బిహారీ లాల్ గుప్తాతో కలిసి ఇండియన్ సివిల్ సర్వీస్ పరీక్షలను రాయడానికి ఇంగ్లాండ్ వెళ్ళాడు. అతను 1869 లో పోటీ పరీక్షలో నెగ్గినప్పటికీ, అతను తన వయస్సును తప్పుగా చూపించాడనే వాదనతో అతనిని నిషేధించారు. బెనర్జీ 1871లో మళ్లీ పరీక్షను రాసి విజయం పొంది సిల్హెట్‌లో అసిస్టెంట్ మేజిస్ట్రేట్‌గా నియామకం పొందాడు. బెనర్జీ లండన్లోని యూనివర్శిటీ కాలేజీలో తరగతులకు కూడా హాజర య్యాడు. అతను 1871 లో చివరి పరీక్షలు రాసి 1871 ఆగస్టులో భారత దేశానికి తిరిగి వచ్చాడు. 1874లో, బెనర్జీ లండన్ తిరిగి వచ్చి మిడిల్ టెంపుల్ లో విద్యార్థి అయ్యాడు. బ్రిటీష్ వారి పట్ల విసుగు చెంది భారతదేశానికి తిరిగి వచ్చా డు. అతను ఇంగ్లాండ్‌లో ఉన్న సమయంలో (1874-1875), ఎడ్మండ్ బుర్కే, ఇతర ఉదార తత్వవేత్తల రచనలను అధ్యయనం చేశాడు. ఈ రచనలు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా చేసిన నిరసనలలో అతనికి మార్గనిర్దేశం చేశాయి. అతన్ని ఇండియన్ బుర్కే అని పిలిచేవారు. 1882 లో అతను స్థాపించిన రిప్పన్ కాలేజీ (ఇప్పుడు సురేంద్రనాథ్ కాలేజీ)లో ఇంగ్లీష్ ప్రొఫెసర్ అయ్యాడు. అతను జాతీయవాద, ఉదార వాద రాజకీయ అంశాలతో పాటు భారతీయ చరిత్రపై బహిరంగ ప్రసంగాలు చేయడం ప్రారంభించాడు. అతను జూలై 26, 1876 న ఆనందమోహన్ బోస్‌తో కలిసి తొలి భార తీయ రాజకీయ సంస్థలలో ఒకటైన ఇండి యన్ నేషనల్ అసోసియేషన్ను స్థాపించాడు. 1878లో భారతీయ ప్రజలను బోధించ డానికి జరిగిన సమావేశంలో ఆయన ఇలా అన్నాడు, 'హిందువులు, ముస్లింలు, క్రైస్తవు లు, పరేసీల మధ్య శాంతి, సద్భావనల గొప్ప సిద్ధాంతం, మన దేశ ప్రగతి అన్ని వర్గాల మధ్య 'ఏకత్వం' అనే పదాన్ని అందులో మెరిసే బంగారం అక్షరాలు చెక్కనివ్వండి. మా మధ్య మత భేదం ఉండవచ్చు, సామాజిక వ్యత్యాసం ఉండవచ్చు. కానీ మనమందరం కలుసుకునే ఒక సాధారణ వేదిక ఉంది. ఇది మన దేశ సంక్షేమం వేదిక '. ఐసిఎస్ పరీక్షలకు హాజరయ్యే భారతీయ విద్యార్థులకు వయో పరిమితి సమస్యను పరిష్కరించడానికి అతను ఈ సంస్థను ఉపయోగించాడు. భారత దేశం లో బ్రిటీష్ అధికారులు దేశవ్యాప్తంగా ప్రసం గాల ద్వారా చేసిన జాతి వివక్షను ఆయన ఖండించాడు. ఇది తనను బాగా ప్రాచుర్యం పొందేట్లు చేసింది.



1879లో, అతను ది బెంగాలీ అనే వార్తాపత్రికను స్థాపిం చాడు. 1883లో, తన వార్తా పత్రికలో వ్యాఖ్యలను ప్రచురిం చినందుకు బెనర్జీని అరెస్టు చేసినప్పుడు, కోర్టు ధిక్కారంలో బెంగాల్ అంతటా, ఆగ్రా, ఫైజాబాద్, అమృత్‌సర్, లాహోర్, పూణేలలో హర్తాళ్ళు, నిరసనలు చెలరేగాయి. భారత జాతీయ కాంగ్రెస్ గణనీయంగా విస్తరించింది. కలకత్తాలో జరిగిన వార్షిక సమావేశానికి భారత దేశం నలుమూలల నుండి వందలాది మంది ప్రతినిధులు వచ్చారు. 1885లో బొంబాయిలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ స్థాపించిన తరువాత, బెనర్జీ 1886లో వారి సాధారణ లక్ష్యాలు, సభ్య త్వాల కారణంగా తన సంస్థను అందులో విలీనం చేశాడు. 1895లో పూనాలో, 1902లో అహ్మదాబాద్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. 1905 లో బెంగాల్ ప్రావిన్స్ విభజనను నిరసించిన ప్రజా నాయకులలో సురేంద్ర నాథ్ ఒకడు. బెనర్జీ ఈ ఉద్యమంలో ముందంజలో ఉన్నాడు. బెంగాల్, భారత దేశం అంతటా నిరసనలు జరిగి, విస్తృతమైన ప్రజా మద్దతును పొందాడు. ఇది చివరికి 1912లో బెంగాల్ విభజనను తిప్పికొట్ట డానికి బ్రిటిష్ వారిని బలవంతం చేసింది. భారత నాయకులైన గోపాల్ కృష్ణ గోఖలే, సరోజిని నాయుడులకు బెనర్జీ పోషకునిగా మారారు. మితవాద కాంగ్రెస్ సీనియర్ - మోస్ట్ నాయకులలో బెనర్జీ కూడా ఒకడు. విప్లవం, రాజకీయ స్వాతంత్ర్యాన్ని సమర్థిం చిన వారు బాల గంగాధర్ తిలక్ నేతృత్వంలో 1906లో పార్టీని వీడారు. స్వదేశీ ఉద్యమం లో బెనర్జీ ఒక ముఖ్యమైన వ్యక్తిగా విదేశీ ఉత్పత్తులకు వ్యతిరేకంగా భారత దేశంలో తయారైన వస్తువులను సమర్థించాడు.

1909 లో మోర్లే-మింటో సంస్కరణ లకు బెనర్జీ మద్దతు ఇచ్చాడు. మహాత్మా గాంధీ ప్రతిపాదించిన శాసనోల్లంఘన ఉద్య మం ప్రతిపాదిత పద్ధతిని బెనర్జీ విమర్శిం చాడు. మాంటెగ్ చెమ్స్ ఫర్డ్ సంస్కరణలను అంగీకరించడానికి సురేంద్రనాథ్ బెనర్జీ అనుకూలంగా ఉన్నాడు. కొందరు కాంగ్రెస్ను విడిచిపెట్టి ఇండియన్ లిబరేషన్ ఫెడరేషన్స్థాపించారు. వారిని ఉదారవాదులు అని పిలుస్తారు. ఆ తరువాత వారు భారత జాతీయ ఉద్యమంలో తమ సాంగత్యాన్ని కోల్పోయారు. బెంగాల్ ప్రభుత్వంలో మంత్రి పదవిని అంగీకరించడం అతనికి జాతీయ వాదుల, ప్రజలకు కోపాన్ని కలిగించింది.

అతను 1921 లో సంస్కరించ బడిన శాసన మండలికి ఎన్నుకోబడ్డాడు. అదే సంవత్సరంలో నైట్ , 1921 నుండి 1924 వరకు స్థానిక స్వపరిపాలన మంత్రిగా పదవిలో ఉన్నాడు. 1923 లో ఎన్నికలలో అతని ఓటమి అతని రాజకీయ జీవితాన్ని ముగించింది. కాగా 1923 లో బెంగాల్ శాసనసభ ఎన్నికలలో స్వరాజ్య పార్టీ అభ్యర్థి బిధన్ చంద్ర రాయ్ చేతిలో ఓడిపోయాడు. బ్రిటీష్ సామ్రాజ్యానికి రాజకీయ మద్దతు ఇచ్చినందుకు అతను నైట్ అయ్యాడు. బెనర్జీ బెంగాల్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేస్తున్నప్పుడు కలకత్తా మునిసిపల్ కార్పొరేషన్ను మరింత ప్రజాస్వామ్య సంస్థగా మార్చాడు. ఆయన 1925 లో ప్రచురించబడిన ఎ నేషన్ ఇన్ మేకింగ్ ద్వారా విస్తృతంగా ప్రశంసలు అందు కున్నాడు. సురేంద్రనాథ్ 6 ఆగస్టు 1925 న బరాక్ పూర్‌లో మరణించాడు. భారత రాజకీయాల అధికారి కరణకు మొదటిగా బాట వేసిన నేతగా - భారత రాజకీయాల మార్గ దర్శకునిగా బాగా గుర్తుంచుకో బడుతున్నాడు. బ్రిటీషువారు ఆయన చివరి సంవత్సరాలలో 'సరెండర్ నాట్' బెనర్జీగా గౌరవించారు.

నవంబర్ 10...సురేంద్రనాథ్ బెనర్జీ జయంతి

- రామ కిష్టయ్య సంగన భట్ల

9440595494

చిగురుమామిడిలో ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు

- లబ్ధిదారులతో కలిసి సంబరాల్లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్





చిగురుమామిడి నవంబర్ 9 (మనం న్యూస్): మండల కేంద్రంలో లోకిని స్వప్న - నరేష్ దంపతుల నూతన ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని లబ్ధిదారులతో కలిసి దీపావళి జరుపుకున్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న సొంతింటి కల ప్రజాపాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో సాకారమైన ఆనందంలో స్వప్న కుటుంబం దీపావళి జరుపుకుంది. ఈ సందర్భంగా మంత్రి స్వప్న దంపతులకు నూతన బట్టలు పెట్టి, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రజా ప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలతో కలిసి క్రాకర్స్ కాల్చుతూ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన ప్రభుత్వం పేదల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ విజయవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. గత పదేళ్లుగా ఇళ్ల నిర్మాణం జరగకపోవడంతో అర్హులైన పేదలను గుర్తించి విడతలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా నూతన ఇందిరమ్మ ఇళ్లలో తొలి దీపావళి జరుపుకుంటున్న లబ్ధిదారులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వద్దకు వెళ్లి వారితో కలిసి దీపావళి వేడుకలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ రోజే జన్మదినం జరుపుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రోజుల్లో పేదలు, బలహీన వర్గాలు, రైతులకు అన్ని రకాలుగా ప్రభుత్వం సంపూర్ణ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. మొదటి విడతలో భాగంగా నియోజకవర్గంలోని 173 గ్రామాలకు సమాన ప్రాతిపదికన 3,500 ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ చేశామని తెలిపారు. రెండవ విడతలో మరో 2,000 ఇండ్లు మంజూరు కానున్నాయని, ఇందులో గుడిసెలను పక్కా ఇల్లుగా మార్చడానికి 500, సగంలో నిలిచిపోయిన ఇండ్లను పూర్తి చేసుకోవడానికి 500, కొత్తగా ఇండ్లు నిర్మించుకునేందుకు మరో 1,000 ఇండ్లను అన్ని గ్రామాలకు సమానంగా కేటాయించడం జరిగిందని చెప్పారు. సొంతిల్లు అనేది పేదవారి జీవితకాల స్వప్నమని, ఆ కలను సాకారం చేయడమే రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గత పదేళ్ల విరామం వల్ల గృహ నిర్మాణానికి భారీ డిమాండ్ ఏర్పడిందని, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా సంక్షేమ పథకంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ నెల 21 తేదీన చిగురుమామిడిలో అలింకో (అఔఐఋ) ఆధ్వర్యంలో దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ శిబిరంలో అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు శ్రవణ యంత్రాలు, వీల్చైర్లు, చేతికర్రలు, కృత్రిమ అవయవాలు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. గ్రామాల్లోని దివ్యాంగులు, వృద్ధులు ఎవరూ మిస్ కాకుండా ఫంక్షన్ హాల్లో నిర్వహించే ఈ శిబిరానికి తీసుకొచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు. త్వరలోనే గౌరవెల్లి నుంచి సాగునీరు రాబోతుందని, నియోజకవర్గంలో వ్యవసాయానికి నీటి కొరత లేకుండా చూస్తామని చెప్పారు. నియోజకవర్గ పరిధిలో పెండింగ్లో ఉన్న బ్రిడ్జి నిర్మాణ పనులను సైతం త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు నిండాలని ఆకాంక్షిస్తూ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, స్థానిక సర్పంచ్ అకవరం భవాని శివప్రసాద్, చిగురుమామిడి సింగిల్ విండో చైర్మన్ చిట్టమల్ల రవీందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అందే సురేష్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు మార్కరాజు, వివిధ గ్రామాల సర్పంచులు వార్డు సభ్యులు కాంగ్రెస్ నాయకులు యువజన కాంగ్రెస్ నాయకులు మహిళా సంఘాల నాయకులు అభిమానులు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు

గ్రీవెన్స్ డే సందర్భంగా ప్రజా ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ



- బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశం

జగిత్యాల, నవంబర్ 09(మనం న్యూస్): ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా ఈ రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 15 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగుతోందని ఎస్పీ తెలిపారు.

సర్వ సుందరంగా ఎల్లమ్మ చెరువు



చిగురుమామిడి, నవంబర్ 9 (మనం న్యూస్): మన హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు ఇప్పుడు సర్వ సుందరంగా మారిపోయింది. ఎప్పుడో ఒకప్పుడు సాధారణ చెరువులా కనిపించిన ఈ చెరువు, ఇప్పుడు చూసే వారందరినీ ఆకట్టుకునే అందమైన ప్రదేశంగా మారింది.సాయంత్రం పూట చెరువు కట్ట మీదకు వెళ్తే ఆ వాతావరణమే వేరు. చల్లటి గాలి, నీటి మీద మెరుస్తున్న రంగు రంగుల లైట్లు, గ్లాస్ బ్రిడ్జి మీద నడుస్తున్న జనాల సందడి చూస్తే మనసుకు ఎంతో హాయిగా ఉంటుంది. ఉదయం పూట వాకింగ్ కు వచ్చే వారు, సాయంత్రం పూట కుటుంబాలతో వచ్చే వారితో చెరువు కట్ట ఎప్పుడూ కళకళలాడుతూ ఉంటుంది. ఈ చెరువు అభివృద్ధికి బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఎల్లమ్మ చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని, హుస్నాబాద్ కు మంచి గుర్తింపు తీసుకురావాలని ఆయన ఎప్పుడూ చెబుతూ వస్తున్నారు. ఆయన చొరవతోనే చెరువు కట్ట సుందరీకరణ పనులు, గ్లాస్ బ్రిడ్జి, వాటర్ ఫ్రంట్ పనులు వేగంగా జరిగాయి. చెరువు కట్ట మొత్తం ఇప్పుడు శుభ్రంగా, అందంగా తయారైంది. నడవడానికి వీలుగా వాకింగ్ ట్రాక్, కూర్చొని సేద తీరడానికి బెంచీలు, పిల్లలు ఆడుకోవడానికి చిన్న పార్కు, చుట్టూ పూల మొక్కలు, వాటర్ ఫ్రంట్ ఏర్పాట్లు అన్నీ చాలా బాగున్నాయి. ముఖ్యంగా గ్లాస్ బ్రిడ్జి ఈ చెరువుకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్లాస్ బ్రిడ్జి మీద నిలబడి చెరువును చూస్తుంటే, నీటి అందం, చుట్టూ ఉన్న పచ్చదనం, దూరంగా కనిపించే గుట్టలు అన్నీ ఒకేసారి కళ్ళ ముందు కనిపిస్తాయి. అందుకే చాలా మంది యువత, కుటుంబాలు ఇక్కడికి వచ్చి ఫోటోలు దిగుతున్నారు. ఎల్లమ్మ చెరువు ఇప్పుడు కేవలం చెరువు కాదు. మన ఊరి వాళ్ళు సాయంత్రం సేద తీరే చోటు. బతుకమ్మ, దసరా, దీపావళి వంటి పండుగల సమయంలో అయితే ఈ చెరువు వద్ద సందడి మరింత ఎక్కువగా ఉంటుంది.మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ అభివృద్ధికి ఎప్పుడూ ముందుంటారని, ఎల్లమ్మ చెరువును మరింత అందంగా తీర్చిదిద్దుతామని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ అందాన్ని ఇలాగే కాపాడుకోవడం మనందరి బాధ్యత. చెరువులో చెత్త వేయకుండా, కట్ట మీద ఉన్న మొక్కలను, లైట్లను పాడు చేయకుండా చూసుకోవాలి. మన చెరువు, మన గౌరవం అని ప్రతి ఒక్కరూ అనుకుంటే ఈ చెరువు ఎప్పుడూ ఇలాగే సర్వ సుందరంగా ఉంటుంది.

పందిళ్ల శివారులో ఘోర రోడ్డు ప్రమాదం

- కారు ట్రాక్టర్ ఢీ
- స్పాట్ లోనే తండ్రీ,కూతురు మృతి
- మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి
- పండుగ వేళ కొండాపూర్లో తీరని విషాదం



చిగురుమామిడి,నవంబర్ 9 (మనం న్యూస్): సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పందిళ్ల బ్రిడ్జి దాటిన తర్వాత పవనసుత మిల్లు సమీపంలో సిద్దిపేట -హుస్నాబాద్ ప్రధాన రహదారిపై సోమవారం ఒక ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.ట్రాక్టర్, కారు ఢీకొన్న ఈ ఘోర దుర్ఘటనలో తండ్రి,ఏడేళ్ల కుమార్తె అక్కడికక్కడే మృతి చెందారు. పండుగ వేళ స్వగ్రామానికి వస్తుండగా జరిగిన ఈ ప్రమాదం కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది.కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన పైడిపేల్లి శ్రీకాంత్ (33) హైదరాబాద్లో క్యాబ్ డ్రైవర్గా పనిచేస్తున్నారు.కొండాపూర్లో ఓ కార్యక్రమానికి భార్య స్వాతి, కుమార్తె మహాన్వి (7),కుమారుడు విహాన్ క్రిష్ణతో కలిసి ఆయన హైదరాబాద్ నుండి కారులో స్వగ్రామానికి బయలుదేరారు.పందిళ్ల గ్రామం దాటిన తర్వాత పవనసుత మిల్లు సమీపంలోకి రాగానే వీరు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది.ఈ ప్రమాద తీవ్రతకు శ్రీకాంత్, ఆయన కుమార్తె మహాన్వి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కారు నడుపుతున్న శ్రీకాంత్ భార్య స్వాతికి తీవ్ర గాయాలవ్వగా, కుమారుడు విహాన్ క్రిష్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు.ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ కాలు కూడా విరిగినట్లు సమాచారం.గాయపడిన వారందరినీ చికిత్స నిమిత్తం కరీంనగర్లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ సంతాపం

సిద్దిపేట - హుస్నాబాద్ ప్రధాన రహదారిపై హుస్నాబాద్ మండలం పందిళ్ల శివారులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతురు మృతి చెందడం పట్ల రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన పైడిపల్లి శ్రీకాంత్ (33), ఆయన కుమార్తె మహాన్వి రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని మంత్రి పేర్కొన్నారు. పండుగ వేళ కుటుంబంతో సంతోషంగా గడపాల్సిన సమయంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు ప్రాణాలు కోల్పోవడం తీరని విషాదమని, వారి మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ, మృతుల కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేశారు.ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్ భార్య స్వాతికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశిస్తూ, ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే బాలుడు విహాన్ క్రిష్ క్షేమంగా ఉండాలని కోరుకున్నారు. మృతుల కుటుంబానికి ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు మంత్రి సూచించారు. రోడ్డు ప్రయాణాల్లో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని ఈ సందర్భంగా మంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఇందిరమ్మ ఇంట్లో దీపావళి సంబరాలు



- పాల్గొన్న డిసిసి అధ్యక్షులు గాజంగి నందయ్య

జగిత్యాల రూరల్, నవంబర్ 9(మనం న్యూస్): టీ పీసీసీ పిలుపు మేరకు జగిత్యాల రూరల్ మండలం పొలస గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంట్లో దీపావళి సంబరాలు కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు గాజంగి నందయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు స్వంత ఇంటి కలను సాకారం చేస్తూ ఇందిరమ్మ ఇళ్లు పథకం ద్వారా పేదలకు గూడు కల్పిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి జగిత్యాల జిల్లా ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ,నిరుపేదలకు సంక్షేమ పథకాలను అందజేయడంలో ఎంతో కృషి చేస్తున్నటువంటి ముఖ్యమంత్రి కి ప్రజలు అండగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మిల్కూరి శంకరయ్య, మహమ్మద్ షాహిద్ ,సురేష్ జయరాం .వెంకన్న ,మెల్ల శంకరయ్య, అనపురపు . సత్తన్న, ఫజల్ తదితరులు పాల్గొన్నారు.


ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



- పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్
- ప్రజావాణి ఫిర్యాదుల సంఖ్య32

జగిత్యాల, నవంబర్ 9 (మనం ప్రతినిధి): ప్రజావాణి ద్వారా ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులు, వినతులపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారని తెలిపారు. ప్రజల నుండి అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతాయుతంగా తీసుకొని, సంబంధిత సమస్యపై సమగ్ర విచారణ జరిపి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన అర్జీలను పెండింగ్లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 32 ఫిర్యాదులు, వినతులు అందాయని, వాటిని సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకొని పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తును అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో పాటు దరఖాస్తుదారులకు తగిన సమాచారం అందించాలని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ, డిఆర్ఓ కె. వై ప్రసాద్, ఆర్డీవో లు మధు సూదన్, జీవాకర్ రెడ్డి, నరసింహ రావు, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు మరియు తదితరులు పాల్గొన్నారు.

రేకొండలో పిచ్చి కుక్కల స్వైరవిహారం





- పలువురికి తీవ్ర గాయాలు
- భయాందోళనలో గ్రామస్థులు
- తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని అధికారులకు విజ్ఞప్తి

చిగురుమామిడి, నవంబర్ 9 (మనం న్యూస్): గ్రామ ప్రజలపై కుక్కలు దాడి చేస్తున్నాయని సమాచారం రావడంతో హుటాహుటిన అక్కడికి వెళ్లిన సర్పంచ్ పై సైతం కుక్కలు దాడి చేసిన సంఘటన సోమవారం జరిగింది.కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రేకొండ గ్రామంలో పిచ్చి కుక్కలు స్వైరవిహారం చేస్తూ గ్రామస్థులపై విరుచుకుపడ్డాయి.సోమవారం గ్రామంలో ఒక్కసారిగా చెలరేగిన కుక్కల దాడిలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు.గాయపడిన వారిలో గ్రామ సర్పంచ్ అల్లేపు సంపత్తో పాటు దుడ్డేల రాజవ్వ,దుడ్డేల బుధవ్వ సహా మరో నలుగురు గ్రామస్థులు ఉన్నారు.రహదారులపై వెళ్తున్న వారిని, ఇళ్ల ముందు ఉన్న వారిని కుక్కలు వెంటాడి వేటాడటంతో గ్రామంలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. కుక్కల దాడిలో గాయపడిన బాధితులను వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారు అక్కడ వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు.గ్రామంలో కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోవడం,అవి పిచ్చిగా ప్రవర్తిస్తూ మనుషులపై దాడులకు తెగబడుతు ండటంతో బయటకు రావాలంటేనే జనం వణికిపోతున్నారు.కుక్కను పట్టుకునే క్రమంలో గ్రామస్తుల దాడిలో కుక్క మృతి చెందింది.మరే ఏ గ్రామంలో ఇలాంటి సంఘటనలు పునరుద్ధం కాకుండా ఇప్పటికైనా సంబంధిత అధికారులు,జిల్లా పంచాయతీ యంత్రాంగం తక్షణమే స్పందించి,గ్రామంలో కుక్కల బెడద నివారణకు తగిన చర్యలు చేపట్టాలని,వీధుల్లో తిరుగుతున్న కుక్కలను నియంత్రించి తమకు రక్షణ కల్పించాలని రేకొండ గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి



- జిల్లా కలెక్టర్‌ను కోరిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల నవంబర్ 9 (మనం న్యూస్): జగిత్యాల సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ను ఆయన ఛాంబర్లో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వానాకాలం వరి పంట కోత దశకు చేరుకుందని, జగిత్యాల నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే వరి కోతలు ప్రారంభమయ్యాయని తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించే క్రమంలో మధ్యవర్తులను ఆశ్రయించి మోసపోకుండా ఉండేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరితగతిన ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ను కోరారు.

దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు, సంబంధిత అధికారులతో మాట్లాడి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రాష్ట్ర సమగ్ర ఆర్థిక, పారిశ్రామిక ప్రగతిని పరుగులెత్తించేందుకు సీఎం చంద్రబాబు కృషి

- గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అన్ని విధాల నష్టపోయింది꠰
- విశాఖ సీఐఐ సదస్సు కోసం ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి
- విశాఖలో ఈ నెల 12, 13 తేదీల్లో జరగనున్న సీఐఐ సదస్సు ఏర్పాట్లపై విశాఖ జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్ తో సమీక్ష నిర్వహించిన జిల్లా ఇంచార్జ్ మంత్రి డిఎస్ బీవీ స్వామి



అమరావతి, నవంబర్ 09,(మనం ప్రత్యేక ప్రతినిధి) : విశాఖలో ఈ నెల 12, 13 తేదీల్లో జరగనున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్టు జిల్లా ఇంచార్జ్ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. సీఐఐ సదస్సు ఏర్పాట్లపై విశాఖ జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్ తో సోమవారం అమరావతి నుంచి జూమ్ వేదికగా మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై అధికారులు, ప్రజా ప్రతినిధులకు మంత్రి పలు సూచనలు చేశారు. అందరూ సమన్వయంతో పనిచేసి సదస్సును విజయవంతం చేయాలన్నారు. అనంతరం మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ....సీఐఐ సదస్సు కోసం ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేస్తున్నాం. నావిగేటింగ్ న్యూ వరల్ ఆర్డర్ , బ్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్' థీమ్తో సదస్సు జరుగుతుంది.

ఈ సదస్సుకు సుమారు 59 దేశాల నుంచి ప్రతినిధులు, 15 మంది విదేశీ మంత్రులు హాజరవుతారు, మొత్తం 1,250 మందికి పైగా దేశీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు, సీఈఓలు, పాలసీ మేకర్లు హాజరవుతారు. వాణిజ్యం, గ్రీన్ ఎనర్జీ, క్వాంటం కంప్యూటింగ్, టెక్నాలజీ ఇన్నోవేషన్, ఏరోస్పేస్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటి ఆరు కీలక రంగాలపై సదస్సులో ప్రధానంగా చర్చలు జరుగుతాయని మంత్రి తెలిపారు. వైసిపి పార్టీ హయాంలో రాష్ట్రం అన్ని విధాల నష్టపోయిందని నేడు కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర సమగ్ర ఆర్థిక, పారిశ్రామిక ప్రగతిని పరుగులెత్తించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

పూజా కార్యక్రమాలకు హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్



జగిత్యాల, నవంబర్ 09 (మనం న్యూస్): జగిత్యాల పట్టణంలోని పలు వ్యాపార సంస్థల్లో నిర్వహించిన లక్ష్మీ పూజా కార్యక్రమాలకు జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొని లక్ష్మీదేవికి పూజలు నిర్వహించారు. ఈ దీపావళి పర్వదినం సందర్భంగా వ్యాపార సంస్థల యజమానులు, వారి కుటుంబ సభ్యులకు లక్ష్మీదేవి కటాక్షం ఎల్లప్పుడూ ఉండాలని, అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి



- జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్
- 66 దరఖాస్తుల స్వీకరణ

సిరిసిల్ల, నవంబర్ 9 (మనం ప్రతినిధి): సిరిసిల్ల జిల్లాలోని ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పెండింగ్లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి మొత్తం 66 దరఖాస్తులను స్వీకరించారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి సంబంధిత శాఖల అధికారులు సత్వర మే పరిష్కరించాలని సూచించారు. సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో 5, వేములవాడలో 2 దరఖాస్తులు స్వీకరించగా, జిల్లాలోని మండల కార్యాలయాల్లో కూడా ప్రజావాణి నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ తదితర అధికారులు పాల్గొన్నారు.

జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా అడువాల జ్యోతి లక్ష్మణ్



జగిత్యాల, నవంబర్9 (మనం న్యూస్): జగిత్యాల జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా జగిత్యాల పట్టణానికి చెందిన మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ను నియామకం కాబడినది. ఈనియామకంకు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ జారీ చేశారు. ఈ సందర్భంగా అడువాల జ్యోతి మాట్లాడుతూ పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని నిలుపుకొని ఈ బాధ్యత ను సమర్థవంతంగా నిర్వహిస్తానని, మహిళా కాంగ్రెస్ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకంకు సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ , టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, , జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

గ్రామీణ విద్యార్థులకు విజ్ఞాన వెలుగులు

కోస్గిలో రూ.6.6 కోట్లతో సర్ సి.వి. రామన్ సైన్స్ మ్యూజియం ప్రారంభం

గ్రామీణ విద్యార్థులకు ప్రయోగాత్మక విద్య అందించడమే లక్ష్యం

కోస్గిలో 106 విజ్ఞాన ప్రదర్శనలు: ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి





నారాయణపేట, నవంబర్ 9 (మనం న్యూస్): గ్రామీణ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పరిశోధనాత్మక ఆలోచనలను పెంపొందించడంతో పాటు ఆధునిక విజ్ఞానాన్ని వారికి చేరువ చేయాలనే లక్ష్యంతో నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలో రూ.6.6 కోట్ల వ్యయంతో నిర్మించిన సర్ సి.వి. రామన్ సైన్స్ మ్యూజియాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. హైదరాబాద్లోని బి.ఎం. బిర్లా సైన్స్ సెంటర్ ఆధ్వర్యంలో రూపొందించిన ఈ మ్యూజియంలో 106 ఇంటరాక్టివ్ సైన్స్ ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు స్వయంగా ప్రయోగాలు చేస్తూ విజ్ఞానాన్ని నేర్చుకునేలా ప్రత్యేకంగా రూపకల్పన చేశారు. మ్యూజియం ప్రారంభోత్సవానికి విచ్చేసిన ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్ ప్రియాంక స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి సర్ సి.వి. రామన్ విగ్రహానికి నివాళులర్పించి, మ్యూజియంలోని వివిధ విజ్ఞాన ప్రదర్శనలను పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన శాస్త్రీయ పరికరాలు, నమూనాలు, ప్రయోగాల పనితీరు, వాటి ప్రత్యేకతలను జిల్లా సైన్స్ అధికారి విజయ్ కుమార్, కోస్గి పట్టణంలోని బహార్ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముఖ్యమంత్రికి వివరించారు.

గ్రామీణ విద్యార్థులకు విజ్ఞాన భాండాగారం..

ఈ మ్యూజియం ద్వారా విద్యార్థులు పాఠ్యపుస్తకాల్లోని శాస్త్రీయ సిద్ధాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించి, ప్రయోగాల ద్వారా అర్థం చేసుకునే అవకాశం కలగనుంది. వారిలో పరిశీలనా శక్తి, ప్రశ్నించే తత్వం, విమర్శనాత్మక ఆలోచన, విశ్లేషణ సామర్థ్యం, సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు పరిశోధనలు, నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తిని కలిగించనుంది. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఈ మ్యూజియాన్ని సందర్శించడం ద్వారా ఆధునిక విజ్ఞానశాస్త్రం, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవచ్చు.

ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విజ్ఞాన వనరులను చేరువ చేయడం ద్వారా భావి శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులుగా ఎదిగేందుకు ఈ మ్యూజియం ప్రేరణగా నిలవనుంది. సర్ సి.వి. రామన్ స్ఫూర్తితో విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందిస్తూ, విజ్ఞానాన్ని అనుభవపూర్వకంగా నేర్చుకునే సంస్కృతిని ప్రోత్సహించే దిశగా కోస్గి సైన్స్ మ్యూజియం ప్రత్యేక విజ్ఞాన కేంద్రంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్, ఆర్డీడీ సోమిరెడ్డి, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, బిర్లా సైన్స్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ మృత్యుంజయ రెడ్డి, ప్రాజెక్టు అధికారి సుబ్రహ్మణ్యం, జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయ్ కుమార్, కోస్గి మున్సిపల్ చైర్మన్ నాగులపల్లి నరేందర్, జిల్లా విద్యాశాఖ అధికారి భానుప్రసాద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బాల సదనం బాలికలతో కలెక్టర్ దీపావళి సంబురాలు



సిద్దిపేట, నవంబర్ 8 (మనం ప్రతినిధి): రాజేశం నేను క్లాస్మేట్ లు ఉంది బాలసదనం పిల్లలతో దీపావళి పండుగను క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి నిర్వహించారు. పిల్లలతో కలిసి లక్ష్మీ పూజ నిర్వహించి హారతి అందజేశారు. కుటుంబ సభ్యులతో కలిసి పులిహోర, అన్నం, కూరలు, సేమియా, మిఠాయిలు పిల్లలకు దగ్గరుండి వడ్డించారు. ప్రార్థన చేసి పిల్లలు భోజనం చేశారు. అనంతరం పిల్లలతో కలిసి కలెక్టర్ టపాకాయలు కాల్చారు. కలెక్టర్ పిల్లల చేయి పట్టుకుని టపాకాయలు అంటించడంతో పిల్లలు ముఖాల్లో ఆనందం వెళ్ళి విరిసింది. టపాకాయల కాంతులు, కేరింతలు, నవ్వుల నడుమ బాలసదనం పిల్లలు ఉత్సాహంగా గడిపారు. బాలికలకు పండుగ కానుకలు అందజేసి, కలెక్టర్ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, జీవితంలో ఎంతటి ఓడుదుడుకులు ఎదురైనా ధైర్యంగా నిలబడి పట్టుదలతో చదివి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. పిల్లలకు ప్రేమ, ఆప్యాయత, భద్రతతో కూడిన వాతావరణాన్ని కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పండుగలను కుటుంబ సభ్యుల మధ్య జరుపుకున్నట్లే, బాలసదనం పిల్లలతో కలిసి జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, జిల్లా కలెక్టర్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీ, కూతురు మృతి

మాజీ ఎమ్మెల్యే ఓడితెల సతీష్ కుమార్ దిగ్భ్రాంతి



చిగురుమామి నవంబర్ 9 (మనం న్యూస్): హుస్నాబాద్ ప్రధాన రహదారిపై హుస్నాబాద్ మండలం పందిళ్ల శివారులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతురు మృతి చెందడం పట్ల హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన పైడిపల్లి శ్రీకాంత్ (33), ఆయన కుమార్తె మహన్వి (9) రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. పండుగ వేళ కుటుంబంతో సంతోషంగా గడపాల్సిన సమయంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు ప్రాణాలు కోల్పోవడం తీరని విషాదమని, తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు అలాగే వారి మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే స్పందించి వారి కుటుంబ సభ్యులకు గాయపడిన వారికి మెరుగైన చికిత్స వెంటనే అందించాలని కోరారు , ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్ భార్య స్వాతికి మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికా రులను కోరారు. భగవంతుడు దయవల్ల తల్లి బిడ్డ త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. అలాగే రోడ్డు ప్రయాణాల్లో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని సూచించారు.

ఓల్ ఎంఐజీ బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించేలా కృషి

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ భరోసా

బాధితులకు ప్రత్యామ్నాయ నివాసం కల్పించండి

పటాన్చె నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జీ ఆదర్శ్ రెడ్డి వినతి



రామచంద్రాపురం, నవంబర్ 9 (మనం న్యూస్): శేరిలింగంపల్లి పరిధిలోని ఓల్ ఎంఐజీ ప్రాంతంలో గత 40 ఏళ్లుగా నివాసం ఉంటున్న పేద కుటుంబాలకు అండగా ఉంటామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ భరోసా ఇచ్చారు. రైల్వే విస్తరణ పనుల నేపథ్యంలో గుడిసెలు కోల్పోతున్న బాధిత కుటుంబాలకు ప్రత్యామ్నాయ నివాసం కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు పటాన్చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్చార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి బాధిత కుటుంబాలతో కలిసి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని కలిసి వినతిపత్రం అందజేశారు. సుమారు నాలుగు దశాబ్దాలుగా అక్కడే నివాసం ఉంటున్న పేద కుటుంబాలు రైల్వే విస్తరణ పనుల కారణంగా నిరాశ్రయులయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆర్థికంగా వెనుకబడిన బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని, ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇళ్లు కేటాయించాలని కోరారు. బాధితుల సమస్యలను సానుకూలంగా పరిశీలించిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించేలా సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు భాస్కర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

- కార్మిక శాఖ మంత్రి వివేక్
- రాష్ట్రంలో ఇప్పటికే 2 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టాం
- రాబోయే రెండేళ్లలో మరో 2 లక్షల ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక
- చిన్నకంజర్లలో 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమం
- మంత్రితో కలిసి పాల్గొన్న కాంగ్రెస్ నేత కాట శ్రీనివాస్ గౌడ్





పటాన్చె, నవంబర్ 9 (మనం న్యూస్): పేదల సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని చిన్నకంజర్ల గ్రామంలో నిర్వహించిన మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమానికి పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ తో కలిసి మంత్రి వివేక్ వెంకటస్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. 2012లో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేసిందని మంత్రి గుర్తు చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణంపై హామీలు ఇచ్చినప్పటికీ ఆశించిన స్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదలందరికీ సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే రెండు లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టామని, రాబోయే రెండేళ్లలో మరో రెండు లక్షల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని వెల్లడించారు. చిన్నకంజర్లకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారు ఈశ్వరమ్మ తన అనుభవాన్ని వివరిస్తూ.. ఇల్లు నిర్మించుకున్న తర్వాత వర్షాకాలంలో ఇంట్లోకి నీరు రాకుండా ప్రశాంతంగా జీవిస్తున్నామని తెలిపారని మంత్రి ప్రస్తావించారు. పేద కుటుంబాలకు సొంతింటి భరోసా కల్పించడంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో ఉపయోగపడుతోందన్నారు. ఇళ్ల పథకంతో పాటు పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి తెలిపారు. అర్హులకు పెన్షన్లు, సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాల ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు వివరించారు. విద్యారంగంలోనూ పలు మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని చెప్పారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో కేంద్ర వంటశాలలను ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో సమీకృత పాఠశాలల ఏర్పాటుతో పాటు ఆధునిక విద్యా సదుపాయాలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 10 వేల మంది ఉపాధ్యాయులను నియమించినట్లు వెల్లడించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. ఆధునిక సాంకేతిక నైపుణ్యాల్లో యువతకు శిక్షణ అందించి మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పేదలు, విద్యార్థులు, యువత సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కొనసాగిస్తోందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పాండు, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ చలపతిరావు, మాజీ కార్పొరేటర్ బురుగడ్డ పుష్ప నగేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శివానందం, సుధాకర్ యాదవ్, సుధాకర్ గౌడ్, వి. చంద్రారెడ్డి, కే.నరసింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



రైతు మేళాతో ఆధునిక వ్యవసాయంపై అవగాహన

- జోగులాంబ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు

ఉమ్మడి మహబూబ్ నగర్ నవంబర్ 09 (మనం బ్యూరో): రైతు మేళాతో ఆధునిక వ్యవసాయ పరికరాలు, ఇతర సాంకేతికతపై, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కలుగుతుందని జోగులాంబ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట గ్రామంలో ఈనెల 7వ. తేదీ నుంచి 9వ. తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న కిసాన్ మేళాకు సోమవారం జిల్లా నుంచి 50 బస్సుల్లో రైతులు తరలి వెళ్లారు. కలెక్టరేట్ ఆవరణలో అదనపు కలెక్టర్ నర్సింగరావు జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మారుతున్న కాలానుగుణంగా రైతులు వ్యవసాయంలో నూతన విధానాలు అవలంబిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ముఖ్యంగా ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను పండించడానికి సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు. నేల సారవంతతను కాపాడడానికి రసాయనిక ఎరువుల స్థానంలో నానో యూరియా వినియోగించడం అవసరమని సూచించారు. పర్యావరణ పరిరక్షణతో భవిష్యత్తు తరాల మనుగడ ఆధారపడి ఉంటుందన్నారు. కాబట్టి రైతులు కిసాన్ మేళాను సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మూడు రోజులపాటు పెద్ద సంఖ్యలో వ్యవసాయానికి, అనుబంధ రంగాలకు సంబంధించిన వివిధ స్టాల్స్ ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

కవితమ్మ సిద్ధాంతాలకు ఆకర్షితులవుతున్న తెలంగాణ ప్రజలు

కాంగ్రెస్ మరియు బిజేపీ నుండి తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరికలు

టీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ కొట్టాల యాదగిరి



గజ్వేల్, నవంబర్ 9 మనం న్యూస్: తెలంగాణ రక్షణ సేన పార్టీ కవితమ్మ సిద్ధాంతాలకు తెలంగాణ ప్రజలు ఆకర్షితులవుతున్నారని దానితో రాబోయే రోజుల్లో తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండా ఎగరవేయడం తధ్యమని తెలంగాణ రక్షణ సేన గజ్వేల్ నియోజకవర్గం ఇంచార్జ్ కొట్టాల యాదగిరి అన్నారు. సోమవారం నాడు కుకునూరు పల్లి మండలం లక్ష్మారం గ్రామం నుండి కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ ఉప సర్పంచ్ కంకణాల మల్లేశం మరియు కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు అష్రాఫ్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నుండి ఏడవ వార్డుకు చెందిన మున్ను, ప్రజ్ఞాపూర్ నాలుగో వార్డుకు చెందిన బిజెపి సీనియర్ నాయకురాలు శైలజ తెలంగాణ రక్షణ సేన పార్టీ సిద్ధాంతాలకు విధి విధానాలకు ఆకర్షితులై పార్టీలో చేరడం జరిగిందని కొట్టాయానికి తెలిపారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రశ్నించే గొంతుక తెలంగాణ రక్షణ సేన మాత్రమే అని ఇట్టి విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు చేరిన వారు మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన పార్టీ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత గారి పాంచ జన్య సిద్ధాంతాలు సామాజిక న్యాయం బహుజన తెలంగాణ సాధన ఈ యొక్క అంశాలు తమరిని ఆలోచింపజేశాయని సామాజిక న్యాయంలో మేము సైతం సిద్ధమంటూ పార్టీలో చేరామని చెప్పారు కార్యక్రమంలో ఏక్స్ ఎంపీటీసీ ఎడ్ల నర్సింలు, టౌన్ సెల్ అధ్యక్షులు లింగని రాజు, లీగల్ సెల్ అధ్యక్షులు నరేష్ చారీ,పాషా, లక్ష్మణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే



- గ్రీవెన్స్ డేలో 16 ఫిర్యాదులు స్వీకరణ
- ఫిర్యాదులను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలి
- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

సిరిసిల్ల నవంబర్ 09 (మనం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో బాధితుల సమస్యలను పరిష్కరించి, వారికి సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 16 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్లో మాట్లాడి, ఫిర్యాదులపై విచారణ చేపట్టి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... పోలీస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యమని, పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఫిర్యాదులను స్వీకరించి అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం చేయాలన్నారు. గ్రీవెన్స్ డేలో స్వీకరించిన ఫిర్యాదులను ఆన్లైన్లో నమోదు చేసి, వాటి పరిష్కారంపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి న్యాయం పొందేలా ఈ కార్యక్రమం దోహదపడుతుందని ఎస్పీ పేర్కొన్నారు.

తుఫాను కారణంగా దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే జారె



- దెబ్బతిన్న రోడ్లు చెరువులు కాలువలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి
- అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం
- పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చర్యలు

దమ్మపేట, నవంబర్ 9(మనం న్యూస్): దమ్మపేట మండలం, లింగాలపల్లి, గ్రామంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ,పర్యటించి ఇటీవల మురసు తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించారు. భారీ వర్షాల కారణంగా కోతకు గురైన రహదారులు చెరువులు వంటకాలువలను క్షేత్రస్థాయి లో పరిశీలించి ప్రజలకు రైతులకు ఇబ్బందులు కలగకుండా వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తుఫాను కారణంగా పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను పరామర్శించి వారికి భరోసా కల్పించారు. పంట నష్ట వివరాలను ప్రభుత్వానికి నివేదించి అర్హులైన రైతులకు నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అధికారులు గ్రామాల్లో పంట నష్టాన్ని త్వరితగతిన అంచనా వేసి నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు.అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా నిర్వహించిన మన ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు ఈ సందర్భంగా మడకం లక్ష్మి , నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులు మండల నాయకులు స్థానిక నాయకులు గ్రామస్తులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నా: ఎమ్మెల్యే జారె

సామాన్య కుటుంబాలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం
కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్, సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



దమ్మపేట, నవంబర్ 09 (మనం న్యూస్): సామాన్య మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ,అన్నారు. దమ్మపేట మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 87 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ,పథకాల ద్వారా రూ.87 లక్షల 10 వేల 92 విలువైన చెక్కులను ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మరో 36 మంది లబ్ధిదారులకు రూ.15 లక్షల 60 వేల విలువైన చెక్కులను ఎమ్మెల్యే. స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్ పథకాల చెక్కుల పంపిణీని ప్రభుత్వం నిలిపివేస్తుందని గతంలో ప్రతిపక్షాలు చేసిన ప్రచారంలో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలన్ని కొనసాగిస్తున్నామని చెప్పారు. సోమవారం 87 మంది ఆడబిడ్డల కుటుంబాలకు అందించిన చెక్కులే ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. మహిళల అభ్యున్నతి సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు గృహజ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం గ్యాస్ సబ్సిడీతో పాటు స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఆర్థికంగా ఎదగడంతో పాటు సంఘాల కార్యకలాపాలు మరింత బలోపేతం కావాలనే ఉద్దేశంతో ప్రతి గ్రామంలో డ్వాక్రా మహిళా సంఘాలకు కమ్యూనిటీ భవనాలు నిర్మిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలో ఇప్పటికే దాదాపు 70 శాతం పనులు పూర్తయ్యాయని మిగిలిన పనులను కూడా త్వరగా పూర్తి చేసి మహిళలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఇటీవల మురసు తుఫాన్ ప్రభావంతో అశ్వారావుపేట నియోజకవర్గంలో భారీగా నష్టం జరిగిందని తెలిపారు. వర్షాలు వరదల కారణంగా దెబ్బతిన్న రహదారులు చెరువులు ఇతర మౌలిక సదుపాయాల పునరుద్ధరణకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విపత్తు సంభవించిన వెంటనే అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాన్ని అంచనా వేయడంతో పాటు రోడ్ల మరమ్మతులు చెరువుల పునరు ద్ధరణ పనులకు ప్రాధాన్యత ఇచ్చామని వివరించారు.కేవలం రెండు రోజుల్లోనే నియోజకవర్గానికి అవసరమైన నిధులు కేటాయించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి,మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,కి నియోజకవర్గ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సామాన్య కుటుంబాలకు కష్టకాలంలో ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రజల అవసరాలను గుర్తించి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మద్దినేని మురళి, ఎంపీడీవో రవీందర్ రెడ్డి, దమ్మపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కక్కిరాల రమేష్, దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వనమాల శ్రీనివాసరావు, తదితరులు, పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన కలెక్టర్ దివాకర టిఎస్




ఖమ్మం, నవంబర్ 09(మనం బ్యూరో): ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, ఎల్నినో నేపథ్యంలో పంట రుణాల వడ్డీ మాఫీ చేసి రెన్యువల్ చేయాలని, పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి పత్తికి, మిర్చికి 50 వేల రూపాయలు వరి పంటకు 30 వేల నష్ట పరిహారం ఇవ్వాలని, పంటల బీమా పథకం అమలు చేయాలని, కూరగాయల, పండ్ల తోటలను కోతుల బెడద నుంచి రక్షించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, వ్యవసాయ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. బోనకల్ మండలం మోటమర్రి గ్రామ సర్పంచ్ ఎం. సురేష్ గ్రామ పరిధిలోని ఇసుక క్వారీ నుండి ఇసుక రవాణా కోసం అధికారికంగా అనుమతి మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, మైన్స్ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పెనుబల్లి మండలం జెడ్పీహెచ్ఎస్ కొండ్రుపాడు పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుని కేటాయించవలసిందిగా కోరుతూ గ్రామ పెద్దలు దరఖాస్తు సమర్పించగా, జిల్లా విద్యాశాఖ అధికారికి రాస్తూ ప్రాధాన్యత క్రమంలో సమస్య పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. జిఓ 59 దరఖాస్తుల పరిశీలన పురోగతిపై సంబంధిత జిల్లా అధికారులను అడిగి, ప్రతి దరఖాస్తుపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి నవంబర్ 20వ తేదీలోగా పూర్తి చేయాలనీ, భూమి విస్తీర్ణం, హద్దులు, భూమి స్వభావాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలనీ సూచించారు.

భద్రాచలంలో ప్రైవేట్ ఆస్పత్రుల మధ్య

ధరల పోటీ

అయోమయంలో రోగులు...



భద్రాచలం, నవంబర్ 9(మనం న్యూస్): దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలంలో వైద్య రంగం సరికొత్త మలుపు తిరుగుతోంది. నిన్నమొన్నటి వరకు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాలంటేనే ఫీజులు, పరీక్షల చార్జీలు చూసి భయపడిపోయే సామాన్య ప్రజలకు.. ఇప్పుడు పట్టణంలో కనిపిస్తున్న పరిణామాలు విస్మయానికి గురిచేస్తున్నాయి. ఒకప్పుడు కన్సల్టేషన్ ఫీజు, ఓపీ చార్జీలు, రూమ్ రెంట్, స్టాఫ్ మెయింటెనెన్స్ అంటూ రకరకాల పేర్లతో బిల్లులు మోత మోగించిన ప్రైవేట్ ఆస్పత్రులు, ఇప్పుడు క్రమంగా ఫీజులను భారీగా తగ్గిస్తుండడం గమనార్హం.

పోటీ పెరిగింది.. ఫీజులు తగ్గాయి..

పట్టణంలో ఇటీవల ప్రైవేట్ నర్సింగ్ హోమ్లు, కార్పొరేట్ తరహా ఆస్పత్రులు పదుల సంఖ్యలో వెలిశాయి. డాక్టర్ల సంఖ్య పెరగడంతో వారి మధ్య తీవ్రమైన పోటీ వాతావరణం నెలకొంది. రోగులను ఆకర్షించేందుకు కొందరు వైద్యులు ఓపీ చార్జీలు పూర్తిగా రద్దు చేస్తుండగా, మరికొందరు కాన్పులు, ఆపరేషన్ల ప్యాకేజీలను గణనీయంగా తగ్గించి బ్యానర్లు కడుతున్నారు. గతంలో సాధారణ లేదా సిజేరియన్ డెలివరీలకు రూ.20,000 పైమాటే వసూలు చేయగా, ప్రస్తుతం మందులు, బెడ్ చార్జీలు, మత్తు డాక్టర్ ఫీజులన్నీ కలిపి రూ.15,000 కే చేస్తామంటూ ఆఫర్ల తరహాలో బోర్డులు ఏర్పాటు చేస్తుండడం వైద్య వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది.

సేవా దృక్పథమా...! ఉనికి కోసమా....?

కనీసం ఆస్పత్రి నిర్వహణ ఖర్చులు (మెయింటెనెన్స్) వెళ్తే చాలు అన్నట్లుగా కొందరు యాజమాన్యాలు వ్యవహరిస్తుండడం చూస్తుంటే, మార్కెట్ పోటీ తట్టుకోవడానికే ఈ దారి ఎంచుకున్నట్లు స్పష్టమవుతోంది. అయితే, ఫీజుల తగ్గుదల పేద, మధ్యతరగతి రోగులకు ఊరటనిచ్చే విషయమే అయినప్పటికీ.. నాణ్యమైన చికిత్స అందుతుందా లేదా అన్న సందేహాలు రోగుల్లో వ్యక్తమవుతున్నాయి. ఆస్పత్రుల మధ్య సాగుతున్న ఈ అనూహ్య 'ధరల పోటీ' పట్టణ ప్రజలను అయోమయంలో పడేస్తోంది.

జాతీయస్థాయి ఆర్చరీ పోటీల నిర్వహణకు ఏర్పాట్లు

డిసెంబర్ 17 నుంచి 20 వరకు పోటీలు
హోటళ్లలో తాగునీరు, పారిశుధ్యం, నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలి
ప్రతి హోటల్కు ఒక లైజన్ అధికారిని నియమించి సమన్వయం చేయాలి
వైద్య సేవలు అందుబాటులో ఉంచాలి: కలెక్టర్ దివాకర టిఎస్



ఖమ్మం, నవంబర్ 9(మనం న్యూస్): స్థానిక సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టేడియంలో డిసెంబర్ 17 నుంచి 20వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న ఖేలో ఇండియా జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి సంబంధిత అధికారులతో ఖేలో ఇండియా పోటీల నిర్వహణపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఖేలో ఇండియా జాతీయస్థాయి ఆర్చరీ పోటీల నిర్వహణపై ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులను ఆదేశించారు. జాతీయస్థాయి పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు, సహాయక సిబ్బంది, సాంకేతిక నిపుణులు హాజరుకానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. పోటీ కోసం మొత్తం 134 మంది జిల్లాకు వస్తున్నారని ఇందులో 64 మంది క్రీడాకారులు, 20 మంది సహాయక సిబ్బంది, 20 మంది సాంకేతిక సిబ్బంది, 24 మంది క్రీడా వాలంటీర్లు, ఇతరులు ఉంటారని తెలిపారు. వీరికి అవసరమైన వసతి సదుపాయాల కోసం చెక్లిస్ట్ ప్రకారం మొత్తం 74 గదులను ముందస్తుగా బుక్ చేయాలని ఆదేశించారు. క్రీడాకారులు, సిబ్బంది రాకపోకలకు ఇబ్బందులు లేకుండా 22 వాహనాలను ఏర్పాటు చేయాలని, వాహనాలు, హోటళ్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. స్టేడియంలో, ప్రతి హోటల్లో తాగునీరు, పారిశుధ్యం, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి హోటల్కు ఒక లైజన్ అధికారిని నియమించి, సంబంధిత హోటల్ యాజమాన్యంతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఆదేశించారు. పోటీలు జరిగే సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టేడియానికి చేరుకునే రహదారులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, అవసరమైన మరమ్మతులు, ఇతర మౌళిక సదుపాయాల పనులను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. క్రీడా శాఖ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పోటీల నిర్వహణకు అవసరమైన అన్ని పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పోటీల సమయంలో క్రీడాకారులకు అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, సమీప ఆసుపత్రుల్లో అవసరమైన పడకలను ముందుగానే రిజర్వ్ చేసి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది, అవసరమైన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, తమకు కేటాయించిన బాధ్యతలను పూర్తి స్థాయిలో నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు డిసిపి రామానుజం, డివైఎస్ఓ సునీల్ రెడ్డి, ఆర్టీఓ జగదీష్, ఫైర్ అధికారి బి.అజయ్ కుమార్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ వి. రంజిత్, అసిస్టెంట్ కమీషనర్ అనిల్ కుమార్, టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి, ఆర్ అండ్ బి, విద్యుత్ శాఖ అధికారులు, తహసీల్దార్, తదితరులు పాల్గొన్నారు.

నల్గొండలో ఏఐకేఎస్ రైతు జాతీయ మహాసభలు

15న లక్ష మందితో భారీ సభ

రైతాంగ హక్కులు – ఐక్య పోరాటాలపై కార్యాచరణ
తెలంగాణా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ పిలుపు
ఏఐకేఎస్ జాతీయ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



ఖమ్మం, నవంబర్ 09(మనం న్యూస్): తెలంగాణ సాయుధ పోరాట పురిటిగడ్డ నల్లగొండ పట్టణ వేదికగా ప్రతిష్టాత్మకంగా జరగనున్న అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభలను, నవంబర్ 15వ తేదీన భారీ ఎత్తున నిర్వహించ తలపెట్టిన భారీ రైతు బహిరంగ సభను విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ పిలుపునిచ్చారు. నవంబర్ 15, 16, 17, 18 తేదీలలో నల్లగొండ జరిగే జాతీయ మహాసభల వాల్ పోస్టర్ను సోమవారం ఖమ్మం సుందరయ్య భవనంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు, సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభాలు, కార్పొరేట్ శక్తుల దోపిడీ విధానాలు, కేంద్ర ప్రభుత్వ ప్రజా, రైతు వ్యతిరేక విధానాలపై భవిష్యత్ కార్యాచరణను రూపొందించే దిశగా ఈ మహాసభలు చారిత్రాత్మక వేదిక కానున్నాయని ఆయన స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా అన్నదాతలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్న తరుణంలో, వ్యవసాయ రంగాన్ని సర్వనాశనం చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన పన్నెండు సంవత్సరాల కాలంలో అనుసరిస్తున్న విధానాల వల్ల వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోయిందని తెలిపారు. అమెరికా సామ్రాజ్యవాద ఒత్తిళ్లకు తలొగ్గి, విదేశీ శక్తులకు, కార్పొరేట్ సంస్థలకు దేశీయ వ్యవసాయ రంగాన్ని తాకట్టు పెట్టేలా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల పేరుతో విదేశీ వ్యవసాయ ఉత్పత్తులను ఎటువంటి దిగుమతి సుంకాలు లేకుండా, జీరో ట్యాక్స్తో దేశంలోకి యథేచ్ఛగా దిగుమతి చేసుకునేలా ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారని మండిపడ్డారు. దీనివల్ల దేశంలో పండే ఆహారధాన్యాలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించక రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని, నిత్యం ఆత్మహత్యలకు పాల్పడే దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. విదేశీ వాణిజ్య ఒప్పందాల ద్వారా దేశీయ ఆహారధాన్యాల పంటలకు తీవ్రమైన కొరత ఏర్పడే ప్రమాదం ముంచుకొస్తోందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే రైతాంగ హక్కులను పరిరక్షించుకోవడానికి, కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టడానికి దేశవ్యాప్తంగా ఉన్న రైతాంగాన్ని ఐక్యం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పోతినేని సుదర్శన్ నొక్కిచెప్పారు. 'కార్పొరేట్ల దోపిడీ నశించాలి, రైతాంగాన్ని, వ్యవసాయం కాపాడబడాలి' అనే బలమైన నినాదంతో ఈ మహాసభలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా విదేశీ వాణిజ్య ఒప్పందాలను వ్యతిరేకించే అంశంపై సుదీర్ఘంగా చర్చించి, భవిష్యత్ ఉద్యమ కార్యచరణను మహాసభల్లో రూపొందిస్తామని వెల్లడించారు.

ఈ మహాసభల ప్రారంభ సూచికగా నవంబర్ 15వ తేదీన నల్లగొండ పట్టణంలో లక్ష మంది రైతాంగంతో తలపెట్టిన భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు యం. సుబ్బారావు, కళ్యాణ వెంకటేశ్వరరావు, తుమ్మ విష్ణువర్ధన్, వాసిరెడ్డి ప్రసాద్, ఎస్.కె. మీరా, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, పడగల నాగేశ్వరరావు, నామా లక్ష్మి నారాయణ, రెడపంగి ప్రకాష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మధు, వెంకయ్య పాల్గొన్నారు.

వినూత్నంగా రెడ్ ర్యాలీ...

మహాసభల బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ ఖానాపురం హవేలి కమిటీ ఆధ్వర్యంలో వినూత్నంగా రైతుల వేషధారణతో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఖానాపురం నుంచి టేకులపల్లి బ్రిడ్జి వరకు జరిగిన ఈ ప్రదర్శనలో యువతీ యువకులు రైతుల సంప్రదాయ దుస్తులైన పంచెలు, ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులుసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు, సీఐటీయూ అఖిల భారత కోశాధికారి మందడపు సాయిబాబు పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా రైతాంగం తీవ్ర ఆందోళనతో ఉందని అన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతులు పెద్ద ఎత్తున పోరాటం నిర్వహించారని గుర్తు చేశారు. రైతాంగ సమస్యలు, కేంద్ర ప్రభుత్వ విధానాలు, రైతుల హక్కుల పరిరక్షణ తదితర అంశాలపై చర్చించేందుకు దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి రైతు ప్రతినిధులు జాతీయ మహాసభలకు హాజరవుతున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై ఎలాంటి పోరాట కార్యాచరణ రూపొందించాలనే అంశంపై ఈ మహాసభల్లో సమగ్రంగా చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొన్నారు. రైతుల ఐక్యతను చాటుతూ వినూత్న వేషధారణతో నిర్వహించిన ఈ ప్రదర్శన రైతాంగంలో నూతన ఉత్సాహాన్ని నింపిందని తెలిపారు.

హవ్వ ఇవేం చదువులు మాష్టారూ...

ఉపాధ్యాయుల గైర్హాజరు విద్యార్థే ఉపాధ్యాయుడయిన వైనం విద్యాశాఖ పర్యవేక్షణాలోపం మారని గురువుల 'పని'తీరు



చర్ల, నవంబర్ 9 (మనం న్యూస్) : గిరిజన విద్యార్థులు చదువులు నష్టపోదురుగాక మాకేంటి, నెలనెలా మా జీతం మాకు వస్తే చాలు, ఇక వారి చదువుల సంగతి మాకెందుకు అనుకుంటున్నారు ఏజెన్సీ ప్రాంతంలో విదులు నిర్వహించే కొంతమంది ఉపాధ్యాయులు. మారుమూల గ్రామాలలోని పాఠశాలల పనితీరును ఎవరూ పట్టించుకోరన్న ధీమాతో పలువురు ఉపాధ్యాయులు తరచూ బడికి డుమ్మా కొట్టి తమ వ్యక్తిగత పనులలో నిమగ్నమవుతున్నారు. ఇప్పటికే పలు మార్లు ఉపాధ్యాయులు పాఠశాలకు డుమ్మాకొట్టడంతో బడులు మూతపడిన విషయం బహిర్గతమై విద్యాశాఖలోని డొల్లతనం బయటపడ్డప్పటికి ఉపాధ్యాయుల తీరులో మార్పు రావడం లేదు. దీనికంతటికి జిల్లా, మండల అదికారుల పర్యవేక్షణాలోపమే కానవస్తోంది. చర్ల మండలం కుర్నపల్లి గ్రామ పంచాయతీ ఎర్రబోరు మండల పరిషత్ ప్రాదమిక పాఠశాలలో 5 వ తరగతి విద్యార్థి రితిక్ ఉపాధ్యాయుడి అవతారం ఎత్తాడు. తనతోటి విద్యార్థులకు పాఠాలు బోధించాడు. బ్లాక్ బోర్డు అందే అంత ఎత్తు రితిక్ లేకపోవడంతో ఉపాధ్యాయులు కూర్చునే కుర్చిపైకి ఎక్కి బ్లాక్ బోర్డుపై అక్షరాలు రాస్తూ తన తోటి బాలబాలికలకు అంకెలు నేర్పించాడు. దీని కంతటికి కారణం పాఠశాలలో బోదించే ఉపాధ్యాయులు గైర్హాజరవడమే. పాఠశాలలో 1 నుండి 5 వ తరగతి వరకు 30 మంది విద్యార్థులు ఉండగా వీరికి విద్యాబుద్ధులను నేర్పించేందుకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. వీరిలో ఒకరు మద్యానికి బానిసై తరచూ విదులకు గైర్హాజరవుతుంటాడని, గత వారం రోజులుగా సార్ పాఠశాలకు రావడం లేదని గ్రామస్తులు వెల్లడించారు. సోమవారం ఒక ఉపాధ్యాయులురాలు పాఠశాలకు వచ్చినప్పటికి మీటింగ్ ఉన్నదంటూ విద్యార్థులను తరగతి గదులలో వదిలేసి వెల్లిపోయారు. దీంతో గతిలేక 5 వ తరగతి విద్యార్థి ఉపాధ్యాయుడి అవతారం ఎత్తాల్సి వచ్చింది. ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలల పునరుద్ధరణరోజే ఎర్రంపాడు పాఠశాల తెరుచుకోకపోవడం, అనంతం అదే నెలలో గోరుకొండ,కిష్టారంపాడు, బట్టిగూడెం, రాళ్లాపురం, కొండెవాయి తదితర ఐదు పాఠశాలలు ఒకే రోజు మూతపడిన విషయం తెలిసిందే. ఈ విషయమై జిల్లా విద్యాశాఖ అదికారులు కఠిన చర్యలు తీసుకోకుండా కేవలం మెమోలు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. దీంతో ఉపాధ్యాయులలో ధీమా పెరిగి తమను ఎవరు ఏమిచేస్తారులే అన్నట్లు వ్యవహరిస్తూ తమ పనితీరును మార్చుకోలేదు. ప్రతి రోజూ ఏదో ఒక పాఠశాల ఉపాధ్యాయులు గైర్హాజరవుతున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. దీని కంతటికి జిల్లా, మండల స్థాయి అదికారుల పర్యవేక్షణ లోపమే కారణమన్న విమర్శలు ఉన్నాయి. అదికారులు ఇకనయినా గ్రామాలబాట పట్టి గాడితప్పిన విద్యావ్యవస్థను పట్టాలెక్కించకపోతే భావి భారత పౌరుల భవిష్యత్ ప్రమాదంలో పడే అవకాశం ఉంది.

చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

- గ్రామీణుల్లో చైతన్యం తీసుకురావాలి
- హిందూపురం పెనుకొండలో ఘనంగా న్యాయ సేవాధికారి సంస్థ దినోత్సవం



హిందూపురం (మనం న్యూస్) నవంబర్ 09: మనిషి పుట్టుక నుండి మరణం వరకు ప్రతి అంశం చట్టంతో ముడిపడి ఉంటుందని, ప్రతి ఒక్కరూ అదనపు జిల్లా జడ్జి వి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక అదనపు జిల్లా కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో న్యాయ సేవాధికారి సంస్థ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టం గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. చిన్నపాటి సమస్యలకు న్యాయస్థానాలు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగి వ్యయప్రయాసాలకు గురికాకుండా రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకునేందుకు న్యాయసేవాధికార సంస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ న్యాయసేవాధికార సంస్థ ద్వారా చట్టాలపై అవగాహన కల్పించడంతోపాటు అర్హత ఉన్న వారందరికీ న్యాయ సహాయం అందించడం జరుగుతుందన్నారు. లోక్ అదాలత్, మధ్యవర్తిత్వం ద్వారా ఇరు వర్గాలతో సామరస్యంగా చర్చించి కేసులను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. దీనివల్ల న్యాయవాదులకు ఎలాంటి నష్టం ఉండదని, వీటిపై కక్షిదారులకు సైతం అవగాహన కల్పించాలన్నారు. సామాజిక సమస్యలతో పాటు వ్యక్తిగత సమస్యలను కూడా పరిష్కరించుకునే అవకాశం ఉంటుందనిబు తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు పారా లీగల్ వాలంటీర్లు చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తరచూ సమావేశాలను ఏర్పాటు చేసి చట్టాలు, న్యాయ సంబంధ విషయాలపై చర్చించి చైతన్యం తీసుకురావాలని న్యాయమూర్తి సూచించారు. పారా లీగల్ వాలంటీర్లకు న్యాయవాదుల ద్వారా శిక్షణ ఇప్పించడం జరుగుతుందని తెలిపారు. లోక్ అదాలత్ ఇప్పటికే ఎన్నో సామాజిక సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. అలాంటి వాటిపై న్యాయవాదులు కూడా దృష్టి సారించాలన్నారు. అదే విధంగా పెనుకొండ కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో న్యాయ సేవాధికారి సంస్థ దినోత్సవాన్ని న్యాయమూర్తులు బుజ్జప్ప, రాకేష్ నేతృత్వంలో ఘనంగా జరుపుకొన్నారు.ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు సుదర్శన్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అనంత గోపాలకృష్ణ, ఏజిపి రామచంద్రప్ప, న్యాయవాదులు రాజేశ్వర్, సిద్దు, శ్రీనివాస్ రెడ్డి, నాగరాజారెడ్డి , లోక్ అదాలత్ పీయల్వీలు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిటాల శ్రీరామ్ దంపతులకు పట్టు వస్త్రంతో స్వామివారి నమూనాల బహూకరణ



ధర్మవరం(రామగిరి) నవంబర్ 9 మనం న్యూస్: ధర్మవరం మున్సిపల్ చైర్మన్ పరిసే సుధాకర్ కుటుంబ సభ్యులతో కలిసి రామగిరి మండలం వెంకటాపురం గ్రామంలో జడ్పీటీసీగా ఎన్నికైన పరిటాల శ్రీరామ్ దంపతులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పట్టు వస్త్రంతో ప్రత్యేకంగా నేసిన శ్రీ వేంకటేశ్వర స్వామివారి నమూనాలను వారికి అందజేశారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పరిసే సుధాకర్ కుటుంబ సభ్యులతో కలిసి పరిటాల రవీంద్ర ఘాట్లు సందర్శించారు. అక్కడ పరిటాల రవి సమాధి వద్ద పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కార్తీకమాసం ప్రారంభంతో అన్నవరంలో ఆకాశదీపం వెలుగులు



అన్నవరం , నవంబర్ 9, మనం న్యూస్: కాకినాడ జిల్లా అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం రత్నగిరిపై కార్తీకమాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని సోమవారం నుంచి ఆకాశదీపం కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. కార్తీకమాసంలో ఆకాశదీపం వెలిగించే పవిత్ర సంప్రదాయానికి అనుగుణంగా దేవస్థానం అధికారులు, అర్చకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాయంత్రం వేళ ఆకాశదీపం వెలుగులతో రత్నగిరి ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

కార్తీకమాసం శివకేశవులకు అత్యంత ప్రీతికరమైన పవిత్ర మాసంగా భక్తులు భావిస్తారు. ఈ మాసంలో దీపారాధనకు విశేష ప్రాధాన్యత ఉంది. అందులో భాగంగా ఆకాశదీపం వెలిగించడం అనాదిగా వస్తున్న ఆధ్యాత్మిక సంప్రదాయం.

ఆకాశదీపం అనేది కేవలం ఒక దీపాన్ని ఎత్తులో వెలిగించడం మాత్రమే కాదు. దైవత్వానికి, జ్ఞానానికి, భక్తికి ప్రతీకగా భావిస్తారు. ధ్వజస్తంభం వద్ద ఎత్తుగా వెలిగించే ఈ దీపం కాంతి సమస్త లోకాలకు శుభాన్ని ప్రసాదించాలని భక్తులు ప్రార్థిస్తారు. పితృదేవతలకు మార్గదర్శకంగా నిలుస్తుందనే విశ్వాసం కూడా ఈ సంప్రదాయంలో ఉంది.

కార్తీకమాసం పొడవునా సాయంత్రం వేళ ఆకాశదీపాన్ని దర్శించుకోవడం, దీపారాధన చేయడం, నువ్వుల నూనె లేదా ఆవునెయ్యితో దీపాలను వెలిగించడం విశేష పుణ్యప్రదమని భక్తుల నమ్మకం. ఈ దీపకాంతి మనిషిలోని అజ్ఞానమనే చీకటిని తొలగించి ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రసాదించాలనే అంతరార్థాన్ని కలిగి ఉంది.

అన్నవరం రత్నగిరిపై ప్రారంభమైన ఈ ఆకాశదీపం కార్తీకమాసం అంతటా భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందించనుంది. స్వామివారి దివ్య సన్నిధిలో వెలిగే ఆకాశదీపాన్ని దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు. హరిహరుల అనుగ్రహం సమస్త ప్రజలకు కలగాలని, లోకమంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని ఈ పవిత్ర దీపారాధన సందర్భంగా భక్తులు ప్రార్థిస్తున్నారు.

నామినేషన్లలో అంబటి రమేష్ తెగింపు

ఆకివీడు నవంబర్ 9 మనం న్యూస్: ఆకివీడు నగర పంచాయతీ ఎన్నికల్లో పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి రమేష్... చూపిన చొరవా తెగువు... ఒంటి చేత్తో 28 వార్డులో నామినేషన్లు చాకచక్యంగా వేయించడమే కాకుండా..... ఏ ఒక్క వార్డు కూడా నామినేషన్ వేయకుండా ఉండకూడదని... మూడవ వార్డులో అభ్యర్థి లేనప్పుడు తన సోదరిని అభ్యర్థిగా నిలబెట్టి, 1వ వార్డులో తన అభ్యర్థిగా నామినేషన్ వేయడం జరిగింది...



పార్టీలో ఉన్న పార్టీ పెద్దల్ని సమీకరించుకుంటూ తనదైన శైలిలో ప్రచారం చేసుకుంటూ వన్ మెన్ ఆర్మీ గా ఎన్నికల్లో చురుగ్గా పాల్గొన్నారు..

తన ఒకటో వార్డు నామినేషన్ను దొంగ దారిలో... తన ప్రతిపాదికుడి ద్వారా ఉపసంహరణ చేయించి... మానసికంగా దెబ్బ కొట్టాలని చూసిన.... ఎక్కడ కూడా అధైర్య పడకుండా..... తనకు జరిగిన అన్యాయంపై గళం విప్పి ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేయడమే కాకుండా.... హైకోర్టులో రిట్ వేసి న్యాయపరంగా పోరాటం కూడా చేస్తున్నాడు .....

ఓటమి నాయకుల ద్వారా ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా సరే.... బెదిరింపులకు కూడా లొంగకుండా పార్టీని వంటి చేత్తో నడిపించడం చూసి ప్రత్యర్థులు, పుర ప్రజలు అంబటి రమేష్ కు ప్రశంసలు కురిపించారు..... ఉండి నియోజకవర్గంలో ఎక్కడా లేనివిధంగా..... ఆకివీడు పట్టణంలో ఐదుగురు కౌన్సిలర్లు గెలవటం కూటమి నాయకులకు మింగుడు పడని విషయంగా మారింది.....

తను కూడా అమ్ముడుపోయాడని ప్రత్యర్థులు తన శత్రువులు ఎన్ని వదంతులు పుట్టించినప్పటికీ వేటికీ కూడా స్పందించకుండా పార్టీ కోసం అంబటి రమేష్ నిలబడిన తీరు... యువ రాజకీయ నాయకులకు స్ఫూర్తిగా నిలిచింది..

ఈ సర్వే సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించండి

రీసర్వేపై జాయింట్ కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహణ

అనంతపురం, కలెక్టరేట్ నవంబర్ 09: మనం న్యూస్ : జిల్లాలో రీ సర్వేకు సంబంధించి కొనసాగుతున్న సమస్యలు మీద జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఏడీ సర్వే, ఎస్డీసీ, కేఆర్ఆర్సీ అధికారులు, సంబంధిత సెక్షన్ అధికారులతో రీ సర్వే పురోగతి, భూ రికార్డుల్లో ఉన్న లోపాలు, పరిష్కరించాల్సిన పెండింగ్ సమస్యలపై జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా రీ సర్వేకు సంబంధించిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. భూ రికార్డుల ఖచ్చితత్వాన్ని నిర్ధారిస్తూ, రీ సర్వే ప్రక్రియను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం సమర్థవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

పులి ప్రజలపై గాండ్రిస్తుంది జూకు పంపిస్తాం..

సర్పంచ్ ఓట్లకు సహకరించండి..
వైఎస్ఆర్సీపి నాయకులను జైల్లో పెట్టి గెలిచారు.. రమేష్ నాయుడు



నందికొట్కూర్ (మనం న్యూస్) : ప్రాతకోట వైయస్సార్సీపి ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేసినటువంటి గుజ్జుల మాధవిని మీ అమూల్యమైన ఓట్లు వేసి వేయించి సహకరించినా ప్రతి ఒక్కరికి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేసిన నంద్యాల జిల్లా వైఎస్సార్సీపి ఉపాధ్యక్షులు గుజ్జుల రమేష్ నాయుడు. పత్రికా సమావేశంలో మా నాయకుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి. డాక్టర్ దారా సుధీర్. బలపరిచిన ఎంపీటీసీ గుజ్జుల మాధవికి ఓట్లు వేసినందుకు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి అభిమానంతో మా మీద నమ్మకంతోటి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దాదాపుగా 1600 ఓట్లు వేసి ఆశీర్వదించడం జరిగింది మా మీద నమ్మకం ప్రేమ చూపించినటువంటి ప్రాతకోట గ్రామ ప్రజలకు శిరస్సు వంచి హృదయపూర్వక నమస్కారాలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా నా భార్య ఎంపీటీసీగా గుజ్జులా మాధవి పోటీ చేస్తే కనీసం నన్ను ఓటు కూడా వేయనీయకుండా మా అన్న మా కార్యకర్తలు దాదాపు పది మందిని నిర్బంధించి ప్రజాస్వామ్యంగా ఎన్నికలు జరిపించుకుని ప్రాతకోట గ్రామంలో నీతి నిజాయితీగా గెలిచినటువంటి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మిద్దె మునిస్వామి గారి భార్య మిద్దె మాధవి గారికి కూడా హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను రమేష్ నాయుడు తెలియజేశారు.ఇప్పుడు ఈ విధంగా ఎన్నికల్లో గెలిచినారో అదే నీతి నిజాయితీ తోటి ప్రాతకోట గ్రామానికి మంచి చేయాలని కోరుతున్నానని ప్రధానంగా చెప్పేది ఏమంటే కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో పోలింగ్ జరగకుండా అడ్డుకోవడం కౌంటింగ్ లో తారుమారు చేసే పరిస్థితి చూపించింది. ఈ కార్యక్రమంలో చిన్న అంకిరెడ్డి.పుల్లారెడ్డి. వైఎస్ఆర్సిపి మండల ఉపాధ్యక్షుడు రమణ ప్రసాద్.అస్లాం భాష. కట్టుబడి దివాన్ సాహెబ్.దూదేకుల ఖాజా హుస్సేన్.మిద్దె రాజశేఖర్.మురళి. నారాయణ.సురేంద్ర.నబీ.ఫోటో స్టూడియో కురుమన్న. వైయస్సార్సీపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థిపై ఘన విజయం వైసీపీ విజయం

నందికొట్కూర్ (మనం న్యూస్): నందికొట్కూరు మండలం నాగటూరు గ్రామంలో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేసింది. కూటమి అభ్యర్థులకు గట్టి పోటీ ఇస్తూ వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థి దుస్సెట్టి హరిబాబు 187 ఓట్ల ఆధిక్యంతో ఘన విజయం సాధించారు. ఈ ఫలితంతో బిజినవేముల. నాగటూరు గ్రామంలో వైసీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది.

ఎన్నికల ప్రచార సమయంలో కూటమి, వైసీపీ నాయకులు తమ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అయినా కూడా బిజనవేముల గ్రామంలో వైసీపీ నాయకులు వైసిపి నాయకులు.నూర్ భాషా.సయ్యద్అల్లి. షేక్ బాబులాల్.ను కూటమి నాయకుల ప్రోత్బలంతో పోలీస్ స్టేషన్ కు తరలించినప్పటికీ వైసీపీ శ్రేణుల ఇంటింటి ప్రచారాలు, సమావేశాలు, ఓటర్లను కలుసుకుంటూ మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చేశారు కనుక. అయితే ఓటర్లు తమ తీర్పును వైసీపీ అభ్యర్థి దుస్సేటి హరిబాబుకు అనుకూలంగా వెల్లడించారు. ఓట్ల లెక్కింపులో హరిబాబుకు 187 ఓట్ల మెజారిటీ సాధించి ప్రత్యర్థులపై పైచేయి సాధించారు.

లోక్ అదాలత్ ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలి

గుత్తి,నవంబర్ 9 (మనం న్యూస్): సంవత్సరాల తరబడి పరిష్కారం కాకుండా పెండింగ్లో ఉన్న కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునేందుకు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్చార్జ్ ఆరో అదనపు జిల్లా జడ్జి బాబు నాయక్ సూచించారు. సోమవారం గుత్తి పట్టణంలోని స్థానిక కోర్టు ప్రాంగణంలో మండల న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్చార్జ్ ఆరో అదనపు జిల్లా జడ్జి బాబు నాయక్, సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ చారి హాజరై కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా జడ్జి బాబు నాయక్ మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరికీ న్యాయ సేవలు అందుబాటులో ఉండాలన్నారు. ముఖ్యంగా



పేదలు, ఆర్థికంగా వెనుకబడినవారు, మహిళలు, పిల్లలు, బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సహాయం అందించడమే న్యాయ సేవా సంస్థల ప్రధాన లక్ష్యమని తెలిపారు.

అదేవిధంగా అప్పీల్కు అవకాశం లేని వారు, దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న కేసుల పరిష్కారం కోసం లోక్ అదాలత్ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, ఏజీపీ పక్రు భాష, న్యాయవాదులు చలపతి, నూర్ మహమ్మద్, చంద్రశేఖర్, గంగాధర్ కుమార్, నవీన్ తదితరులతో పాటు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

కార్తీక పౌర్ణమి గిరిప్రదక్షిణకు పటిష్ట ఏర్పాట్లు

గిరిప్రదక్షిణ మార్గాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



అన్నవరం, నవంబర్ 9, మనం న్యూస్ : కార్తీక మాసంలో అత్యంత పవిత్రమైన పర్వదినంగా భావించే కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో సోమవారం కాకినాడ జిల్లా కలెక్టర్, అన్నవరం దేవస్థానం చైర్మన్, కార్యనిర్వహణాధికారి, వివిధ శాఖల అధికారులు, పంచాయతీరాజ్ డీఈలు, ఆర్ అండ్ బీ ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది గిరిప్రదక్షిణ మార్గాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

కార్తీక పౌర్ణమి రోజున వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా గిరిప్రదక్షిణ మార్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, రహదారి మరమ్మతులు, పారిశుధ్యం, విద్యుత్ దీపాలు, తాగునీటి సదుపాయాలు తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. భక్తుల రాకపోకలకు అనుగుణంగా మార్గాన్ని సిద్ధం చేయాలని, అవసరమైన చోట రహదారులను మెరుగుపరచాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు.

గిరిప్రదక్షిణ మార్గంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రమాదాలకు ఆస్కారం లేకుండా రహదారుల వెంబడి అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిర్ణీత సమయంలో ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు.

అంగన్వాడీ కార్యకర్తలకు బాల్యదశ అభివృద్ధిపై శిక్షణ

శంఖవరం, నవంబర్ 9 మనం ప్రతినిధి: కాకినాడ జిల్లా శంఖవరం మండలంలోని కత్తిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు బాల్యదశ అభివృద్ధి, పోషణ, విద్యకు సంబంధించిన అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శంఖవరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ పి. వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ శిక్షణలో పుట్టినప్పటి నుంచి మూడు సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలకు అందించాల్సిన బాల్యారంభ ఉద్దీపన కార్యక్రమాలపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. చిన్నారులతో ప్రతిరోజూ నిర్వహించే పరస్పర చర్యలు వారి భావోద్వేగ, సామాజిక, శారీరక అభివృద్ధిపై ఎలా ప్రభావం చూపుతాయో వివరించారు. అలాగే పోషణ్ ట్రాకర్ యాప్లోని హోమ్ విజిట్ షెడ్యూల్ ద్వారా సమర్థవంతంగా గృహ సందర్శనలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించే విధానాన్ని తెలియజేశారు. బాల్యదశలో ఆటల ఆధారిత అభ్యాసం ప్రాముఖ్యత, పిల్లల ఎదుగుదలలో గృహ ఆధారిత కార్యకలాపాల పాత్రపై శిక్షణ ఇచ్చారు. ఆధార్ శిల వారపు క్యాలెండర్ను ఉపయోగించి



రోజువారీ కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించడం, ఈసీసీఈ (ప్రారంభ బాల్య సంరక్షణ, విద్య), కమ్యూనిటీ ఈవెంట్స్ నిర్వహణ తదితర అంశాలను వివరించారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమమైన 'పోషణ్ భీ పఢాయీ భీ' లక్ష్యాలు, అమలు విధానంపై అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్వైజర్ బి. రజని, శంఖవరం మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్నాబ్ తుఫాన్ బియ్యం పంపిణీ ప్రారంభం

కాట్రేనికోన నవంబర్ 9 మనం ప్రతినిధి : కాట్రేనికోన మండలంలో మత్స్యకార గ్రామాలలో ఆర్నాబ్ తుఫాను బియ్యం పంపిణీ కి అధికారులు శ్రీకారం చుట్టారు. సోమవారంపల్లం గ్రామం లో షాప్ నెంబర్ 25, 26 , 34, 43 లలో ఆర్నాబ్ తుఫాన్ కి సంబంధించి మత్స్యకార కుటుంబాలకు 50 కే జి లు చొప్పున బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తహసిల్దార్ రవి కిరణ్ తెలిపారు. మిగిలిన గ్రామాలలో, మిగిలిన కమ్యూనిటీ వారికీ తుఫాన్ కు సంబంధించిన రేషన్ బియ్యం, ఇతర నిత్యావసరాలు ఏమైనా ఇస్తారా లేదా అనే విషయం పై అధికారులు పూర్తి సమాచారం ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. తుఫాన్ సమయంలో అందరూ కూడా ఉపాధి లేక ఇళ్ళకే పరిమితం అయ్యారని కానీ కేవలం ఒక సామాజిక వర్గానికి మాత్రమే 50 కేజీ లు ఇస్తూ మిగిలిన సామాజిక వర్గాల వారికీ తక్కువ మొత్తం లో ఇవ్వడం ఎంత వరకూ సమంజసమో ప్రభుత్వం ఆలోచన చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయం పై సమాజం లో ప్రజలు నుండి భిన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.



రవీంద్ర బాబును కలిసిన ఉచ్చిల రవి

కాట్రేనికోన నవంబర్ 9 మనం ప్రతినిధి : వైసీపీ మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ పండుల రవీంద్ర బాబు ను డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మేధావులు ఫోరం కన్వినర్, ఉప్పూడి వైసీపీ సీనియర్ నాయకుడు ఉచ్చిల రవి కుమార్ రవీంద్ర బాబు స్వగృహం నందు కలిశారు. రవీంద్ర బాబు పుట్టినరోజు ను పురస్కరించుకొని ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. భగవంతుని ఆశీస్సులు తో ఆరోగ్యవంతం గా ఉండాలని, రానున్న రోజుల్లో రాజకీయం గా మంచి ఉన్నత పదవులలో ఉండాలని ఆకాంక్షించారు.



ఉక్రెయిన్- రష్యా శాంతి చర్చల వేళ..

జెలెన్‌స్కీకి ప్రధాని మోడీ ఫోన్





కీవ్, నవంబర్ 9: దేశ ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో ఫోన్లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్- రష్యా యుద్ధానికి సంబంధించిన ఇటీవలి పరిణామాలను, తమ వైఖరిని ప్రధాని మోడీకి జెలెన్స్కీ వివరించారని ప్రధాని కార్యాలయం తెలిపింది. వివాదాన్ని శాంతియుతంగా పరిష్కరించే లక్ష్యంతో చేసే అన్ని ప్రయత్నాలకు సహకరించేందుకు భారత్ సిద్ధంగా ఉందని ప్రధాని మోడీ తెలియజేశారని పేర్కొంది. చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవాలన్న వైఖరిని ఆయన పునరుద్ఘాటించారని తెలిపింది.

అదేవిధంగా భారత్- ఉక్రెయిన్ మధ్య వివిధ రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై జెలెన్స్కీ, ప్రధాని మోడీ చర్చించుకున్నట్లు వెల్లడించింది. ఉక్రెయిన్ , రష్యాల మధ్య శాంతి చర్చలు త్వరలోనే మళ్లీ మొదలుకానున్న వేళ ఇరువురు నేతలు మాట్లాడుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదిలా ఉండగా.. రష్యా- ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు తమ మధ్యవర్తిత్వంలో ఈ నెల 10, 11 తేదీల్లో అబుధాబీ వేదికగా శాంతి చర్చలు జరుగుతాయని అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే.

మోదీ ఇప్పటికే పలుమార్లు చెప్పారు: జెలెన్స్కీ

మరోవైపు.. యుద్ధాన్ని ముగించేందుకు ఇదే సరైన సమయమని ప్రధాని మోదీ ఇప్పటికే పలుమార్లు చెప్పారని, రష్యా అధ్యక్షుడు పుతిన్తో కూడా నేరుగా ఈ మాట అన్నారని జెలెన్స్కీ గుర్తుచేశారు. మోదీతో ఫోన్ సంభాషణపై ఆయన 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. ''నల్ల సముద్రం ద్వారా ధాన్యం ఎగుమతులను రష్యా అడ్డుకోవడం గురించి మేం చర్చించాం. ఫుడ్ కారిడార్లను ఏర్పాటు చేయడంలో మధ్యవర్తిత్వం వహించేందుకు భారత్ సిద్ధంగా ఉంది. సముద్ర మార్గాల దిగ్బంధనంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడటంతోపాటు కోట్లాది మంది ప్రజలు బాధపడుతున్నారనే విషయాన్ని రష్యా అర్థం చేసుకోవాలి'' అని తెలిపారు.

ఇరాన్‌పై 'మిషన్' పూర్తికాలేదు



● ఇజ్రాయెల్ రక్షణ మంత్రి

జరూసలెం , నవంబర్ 9: ఇరాన్‌పై చేపట్టిన మిషన్ ఇంకా ముగిసిపోలేదని ఇజ్రాయెల్ పేర్కొంది. తమకు ముప్పు కలిగించేందుకు ఆ దేశం అణ్వాయుధాల అభివృద్ధితోపాటు ఇతర ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించింది. అమర సైనికుల స్మారక కార్యక్రమంలో పాల్గొన్న రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ మాట్లాడుతూ.. దేశ లక్ష్యాలు నెరవేరాలంటే ఐడీఎఫ్‌కు పూర్తి బలం అవసరమన్నారు. ఇదే సమయంలో ఒకవేళ యుద్ధం ప్రారంభమైతే.. కాల్పులు జరపవద్దని ఇరాన్ మిత్రపక్షం హెజ్బొల్లాను హెచ్చరించారు. ''ఇరాన్ విషయానికొస్తే ఆ మిషన్ ఇంకా పూర్తి కాలేదు. అణ్వాయుధ కార్యక్రమాలను పునరుద్ధరించడంతోపాటు ఇజ్రాయెల్ను ప్రమాదంలో పడేసే ఇతర ప్రయత్నాలకు పాల్పడుతోంది. ఈ బెదిరింపులను ఆమోదించలేం. మున్ముందు చేపట్టబోయే భారీ కార్యక్రమాల కోసం మనమంతా ఐకమత్యంగా ఉండాల్సిన సమయం'' అని ఐడీఎఫ్‌కు కట్జ్ పిలుపునిచ్చారు. గాజా, లెబనాన్, సిరియాల నుంచి బలగాలను ఉపసంహరించుకోబోమని స్పష్టం చేసిన ఆయన.. ఒకవేళ ఇజ్రాయెల్‌పై దాడిలో ఇరాన్‌తో చేతులు కలపాలని ఆ దిశగా హెజ్బొల్లా అడుగులు వేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు.

రాంపురం రెడ్డి సోదరులను కృతజ్ఞతలు తెలిపిన జెడ్పీటీసీ

మంత్రాలయం , నవంబర్ 9 మనం న్యూస్: ఎమ్మిగనూరు పట్టణంలోని భీమా నిలయం లో పెద్దాయన వై. సీతారామిరెడ్డి , రాంపురం లో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ,వైఎస్సార్సీపీ నేత వై. ప్రదీప్ రెడ్డి ని మంత్రాలయం జడ్పీటీసీ గా అవకాశం కల్పించడంతో భీమారెడ్డి సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువ కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. అలాగే పరిషత్ పోరులో గెలుపొందిన వైసీపీ ఎంపీటీసీలు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కి , వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్ రెడ్డి శాలువా కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. వీరితో పాటు నాయకులు జనార్దన్ రెడ్డి, వీకేసి రఘు ఉన్నారు.

వైసీపి అభ్యర్థులకు షాక్..



టిడిపిఅభ్యర్థి ఘన విజయం!

నందికొట్కూర్ (మనం న్యూస్) లక్ష్మాపురం గ్రామంలో ఏనుముల దానమ్మ 199 ఓట్ల భారీ మెజారిటీ నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం లక్ష్మాపురం గ్రామంలో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఏనుముల దానమ్మ ఘనవిజయం సాధించారు. వైయస్సార్సీపి టిడిపి అభ్యర్థుల మధ్య పోటీ నెలకొన్నప్పటికీ, ఓటర్లు టిడిపి పార్టీ అభ్యర్థికి పట్టం కట్టడం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. దానమ్మ తన సమీప ప్రత్యర్థులపై ఏకంగా 199 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించి తన సత్తా చాటారు.

ఎన్నికల ప్రచార సమయంలో దానమ్మకు మద్దతుగా పగిడ్యాల జెడ్పిటిసి బండి రమణమ్మ విస్తృత ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటా తిరుగుతూ ఓటర్లను కలవడం, ప్రజా సమస్యలపై స్పందించడం వంటి అంశాలు ఆమె విజయానికి దోహదపడ్డాయని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

తగ్గిన క్యాన్సర్ మందుల ధరలు



ఢిల్లీ,నవంబర్ 9: క్యాన్సర్ నివారణ మందుల కనీస ధరలు సోమవారం నుంచి అమల్లోకి వచ్చాయి. 1,364 క్యాన్సర్ నిరోధక ఔషధాల ధరలు తగ్గాయి. దీని వల్ల పేషంట్లకు ఏటా రూ.3,540.38 కోట్లు ఆదా కానుంది. 670 బ్రాండ్ల ధరల్లో 50 శాతం కంటే ఎక్కువ తగ్గినట్లు కేంద్రం పేర్కొంది. ఎంఆర్పీలో అత్యధికంగా 96.45 శాతం తగ్గింపు ఉందని తెలిపింది. జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ సిఫార్సుల మేరకు 137 రకాల క్యాన్సర్ ఔషధాలపై ట్రేడ్ మార్జిన్లను పరిమితం చేసినట్లు రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ ఇప్పటికే వెల్లడించింది. సవరించిన ఔషధ ధరల జాబితాలను రిటెయిలర్లు, డీలర్లు, ఆసుపత్రులు తమ ప్రాంగణాల్లో, వెబ్సైట్లలో ప్రజలకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నిబంధనలు సక్రమంగా అమలవుతున్నాయా లేదా అన్న విషయాన్ని రాష్ట్రాల ఔషధ నియంత్రణ అధికారులు పర్యవేక్షిస్తారు. జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ వెబ్సైట్లో ధరలు చూసుకుని, నిబంధనల ఉల్లంఘనలు జరిగితే సంబంధిత హెల్ప్లైన్ నంబర్ల (1800-111-255) ద్వారా వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చని మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

ఇరాన్‌పై దాడులు ఉండకపోవచ్చు



● అమెరికా అధ్యక్షుడు ట్రంప్

వాషింగ్టన్ , నవంబర్ 9: మధ్యంతర ఎన్నికల్లో ఓటమికి దారితీసిన పలు అంశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెనక్కి తగ్గుతున్నట్లు కనిపిస్తోంది. ఇరాన్‌పై మళ్లీ దాడులు పునఃప్రారంభించకపోవచ్చని తాజాగా చెప్పారు. ప్రస్తుతం యుద్ధాన్ని ముగించేలా ఒప్పందం కుదుర్చుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ స్పందించారు. అదే సమయంలో యుద్ధం చేసే ఆప్షన్‌ను కూడా తన వద్ద ఉంచుకున్నట్లు హెచ్చరించారు.

''ఇరాన్ అణు కార్యక్రమం విషయంలో ఒప్పందం కుదిరి, హర్మూజ్ జలసంధి తిరిగి తెరుచుకుంటే.. మళ్లీ ఆ దేశంపై దాడులు జరిగే అవకాశం చాలా తక్కువ. అదే సమయంలో చర్చలు విఫలమైతే మళ్లీ దాడులకు వెనకాడబోం. మా వద్ద మూడు విమాన వాహక నౌకలు సిద్ధంగా ఉన్నాయి. గంటల వ్యవధిలో ఇరాన్లో 38 వంతెనలను ధ్వంసం చేయగలం'' అని ట్రంప్ వెల్లడించారు.


ఇటీవల ఇరాన్, అమెరికా మధ్య శాంతి ఒప్పందం కోసం పలు ప్రయత్నాలు జరిగాయి. ఆ ప్రయత్నాలు జరుగుతున్నప్పుడే అమెరికా దాడులు చేసింది. ఇటీవల మధ్యంతర ఎన్నికల్లో యూఎస్ కాంగ్రెస్‌లో డెమోక్రాట్లకే ఆధిపత్యం లభించింది.

వారు ఉభయసభల్లో పట్టు సాధించడంతో ఈ యుద్ధాన్ని త్వరగా ముగించాలని రాజకీయంగా ఒత్తిడి పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ట్రంప్ స్పందన వచ్చింది.

ఇరాన్ యుద్ధంలో కీలక ముందడుగు..!

ఇరాన్ యుద్ధం ముగించడంలో ఖతార్ మధ్యవర్తిత్వం వహిస్తోంది. ఘర్షణల ముగింపులో కొత్త ప్రతిపాదనలు చేస్తోంది. ఇలాంటి సమయంలో ఖతార్ ప్రధాని షేక్ మహమ్మద్ బిన్ అబ్దుల్ రహమాన్ అల్ థానీతో సోమవారం ట్రంప్ భేటీ కానున్నారు.

పర్వత రాజబాబును మర్యాదపూర్వకంగా కలిసిన ముద్రగడ గిరిబాబు



శంఖవరం, నవంబర్ 09 మనం ప్రతినిధి: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలంలోని శంఖవరం గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జ్ ముద్రగడ గిరిబాబు, పార్టీ సీనియర్ నాయకులు పర్వత రాజబాబు, ఆయన సతీమణి జానకీదేవిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో శంఖవరం గ్రామ పరిధిలోని మూడు ఎంపీటీసీ స్థానాల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించడంలో కీలక పాత్ర పోషించిన పర్వత రాజబాబును ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు శాలువా కప్పి, పూలమాల వేసి అభినందించారు. అనంతరం ఎన్నికల్లో విజయం సాధించిన ముగ్గురు ఎంపీటీసీలను ప్రత్యేకంగా శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలను అభినందిస్తూ భవిష్యత్తులో కూడా పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం పర్వత రాజబాబు, జానకీదేవి దంపతుల కుమారుడు యువ నాయకుడు పర్వత వివేక్ పుట్టినరోజు సందర్భంగా ముద్రగడ గిరిబాబు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శంఖవరం మండల అధ్యక్షులు నరాల శ్రీనివాస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అడపా సోమేష్, గొతు స్వామి, గొతు వాసు, సకురు గుర్రాజు, రామిశెట్టి నాని, బంకు శ్రీను, పగడాల మోహన్ సన్యాసిరావు, ఆచంట వెంకటాశ్వారావు, పిర్ల నాగేశ్వారావు, భారీ సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కూటమి కుట్రలను ఢీకొన్న కోట్ల హరి చక్రపాణి రెడ్డి దంపతులు

గూడూరు నవంబర్ 9 (మనం న్యూస్) ప్రస్తుతం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా కోడుమూరు నియోజకవర్గ కోడుమూరు మండలంలో కూటమి కుట్రలను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జడ్పిటిసి అభ్యర్థి కోట్ల భాను శ్రీ భర్త కోట్ల హరిచక్రపాణిరెడ్డి లో కూటమి కుట్రలను బద్దలు కొట్టి విజయం సాధించారని గూడూరు గూడూరు మండలం జూలకల్లు గ్రామానికి చెందిన వైకాపా నేతలు లక్కి రెడ్డి గారి మురళి మోహన్ రెడ్డి మాదిరెడ్డి లక్కి రెడ్డి గారి దివాకర్ రెడ్డి లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం జరిగిన స్థానిక సంస్థ ఎన్నికల్లో భాగంగా కూటమి ఎన్నో కుట్రలో కుతంత్రాలు చేసిందని అయితే కేవలం కోట్ల భాను శ్రీ కోట్ల హరి చక్రపాణి రెడ్డి దంపతులు బద్దలు కొట్టి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగరవేశారని వారు తెలిపారు. కచ్చితంగా



రానున్న 2029 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభంజనాన్ని తట్టుకోలేరని కూటమి తుడిచిపెట్టబోతుందని వారు తెలిపారు.

పోటీకి సై అంటున్న గ్రామాలు!

● సర్పంచ్ ఎన్నికల సమరానికి పల్లెలు సిద్ధం.. గ్రామగ్రామాన రాజకీయ సందడి

● కర్నూలు ఉమ్మడి జిల్లాలో మూడు విడతలుగా పోలింగ్.. పల్లెల్లో అప్పుడే మొదలైన ఎన్నికల వేడి

కర్నూలు, నవంబర్ 9 (మనం న్యూస్): గ్రామీణ రాజకీయాల్లో మరోసారి ఎన్నికల సందడి మొదలుకానుంది. గ్రామాలకు పెద్దదిక్కుగా నిలిచే సర్పంచ్ పదవులను దక్కించుకునేందుకు ఆశావహులు ఇప్పటి నుంచే రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

పల్లెపల్లెలో రాజకీయ చర్చలు ఊపందుకుంటుండగా, ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు తమ అనుచరులతో సమావేశాలు నిర్వహిస్తూ ఎన్నికల వ్యూహాలకు పదును పెడుతున్నారు. సర్పంచ్గా పోటీ చేయాలనే ఆశతో పలువురు గ్రామాల్లో ప్రజలతో మమేకమవుతూ తమ బలాబలాలను అంచనా వేసుకుంటున్నారు.

మూడు విడతల్లో ఎన్నికల నిర్వహణ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించనున్నారు. నవంబర్ 26న మొదటి విడత, నవంబర్ 29న రెండో విడత, డిసెంబర్ 2న మూడో విడత పోలింగ్ జరగనుంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల సందడి మరింత పెరగనుంది.

రిజర్వేషన్లతో మారుతున్న రాజకీయ సమీకరణాలు

సర్పంచ్ స్థానాలకు ప్రకటించిన రిజర్వేషన్లు గ్రామాల్లో రాజకీయ సమీకరణాలను మార్చుతున్నాయి. ఏ గ్రామంలో ఏ వర్గానికి అవకాశం దక్కింది? ఎవరెవరు పోటీకి సిద్ధమవుతున్నారు? ఏ పార్టీ నుంచి ఎవరికి మద్దతు లభించనుంది? అనే అంశాలపై గ్రామాల్లో ఆసక్తికర చర్చలు సాగుతున్నాయి. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు కేటాయించిన స్థానాల్లో కొత్త నాయకత్వం తెరపైకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారిన ఎన్నికలు

సర్పంచ్ ఎన్నికలు గ్రామస్థాయి ఎన్నికలే అయినప్పటికీ ప్రధాన రాజకీయ పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారనున్నాయి.

అధికార కూటమి పార్టీలు తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తుండగా, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కూడా గ్రామాల్లో తమ పట్టును నిరూపించుకోవాలని భావిస్తోంది. మరోవైపు స్వతంత్ర అభ్యర్థులు సైతం బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్నారు.

గ్రామాభివృద్ధే ప్రధాన ప్రచారాస్త్రం!

తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, పారిశుధ్యం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలు ఎన్నికల్లో కీలకంగా మారనున్నాయి. గ్రామ సమస్యలను పరిష్కరించే సామర్థ్యం ఉన్న నాయకుడికే పట్టం కట్టాలని ఓటర్లు భావిస్తున్నారు. మాటలకంటే చేతల్లో అభివృద్ధి చూపించే అభ్యర్థులకే ప్రజలు ప్రాధాన్యత ఇచ్చే అవకాశముంది.

కర్నూలు ఉమ్మడి జిల్లాపై ప్రత్యేక దృష్టి

కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని గ్రామ పంచాయతీల్లో ఎన్నికల సందడి రోజురోజుకూ పెరుగుతోంది. గ్రామస్థాయి నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువ నాయకులు తమ అనుచరులతో చర్చలు జరుపుతున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో రాజకీయంగా పట్టున్న కుటుంబాలు, సామాజిక వర్గాల నాయకులు అభ్యర్థుల ఎంపికలో కీలక పాత్ర పోషించే అవకాశముంది.

ఓటరు తీర్పే అంతిమం!

ఎన్నికల సందడిలో అభ్యర్థులు ఎవరైనా, పార్టీల బలాబలాలు ఎలా ఉన్నా అంతిమ నిర్ణయం మాత్రం ఓటరుదే. గ్రామాభివృద్ధికి కట్టుబడి ఉండే నాయకుడిని ఎన్నుకోవాలని ప్రజలు భావిస్తున్నారు. ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రజాస్వామ్యానికి ఎంతో అవసరం.

మొత్తానికి కర్నూలు ఉమ్మడి జిల్లాలో రానున్న సర్పంచ్ ఎన్నికలు గ్రామీణ రాజకీయాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపనున్నాయి. నిన్నటివరకు గ్రామాల్లో సాగిన రాజకీయ చర్చలు ఇక ఎన్నికల పోరుగా మారనున్నాయి. పోటీకి సై అంటున్న ఆశావహులతో పల్లెలు ఎన్నికల సమరానికి సిద్ధమవుతున్నాయి.

ఏపీ పారిశ్రామిక ప్రగతికి నూతన దశదిశ

● నేవిగేటింగ్ న్యూవరల్ ఆర్డర్ థీమ్తో సీఐఐ సమ్మిట్

● వాణిజ్యం నుంచి క్వాంటం వరకూ ఆరు అంశాలపై చర్చ

● 58 దేశాల నుంచి ప్రభుత్వ, పారిశ్రామిక ప్రతినిధుల హాజరు

● ఇప్పటికే 6 ప్రాంతీయ సదస్సుల్లో రూ.86వేల కోట్ల ఒప్పందాలు

● నవంబరు 12, 13వ తేదీల్లో విశాఖ వేదికగా 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు

● ముఖ్య అతిథులుగా సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు అమిత్ షా, పీయూష్ గోయెల్, దిగ్గజ కంపెనీల చైర్మన్లు, సీఈఓలు

అమరావతి, నవంబరు 09,(మనం ప్రత్యేక ప్రతినిధి): నేవిగేటింగ్ న్యూ వరల్ ఆర్డర్ థీమ్తో విశాఖ వేదికగా ఈ నెల 12,13వ తేదీల్లో రెండు రోజుల పాటు 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు జరుగనుంది. మారుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థలకు నూతన దశాదిశ అందించేలా ఈ పెట్టుబడుల సదస్సు విశాఖలో ఆవిష్కృతం కానుంది. కేవలం పెట్టుబడుల ఆకర్షణకు మాత్రమే పరిమితం కాకుండా వాణిజ్యం నుంచి క్వాంటం వరకూ వివిధ అంశాలపై మేధోమథనం నిర్వహించి ఆ ఫలితాలను ముందుకు తీసుకెళ్లేలా ఈ భాగస్వామ్య సదస్సులో చర్చలు జరుగనున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర హోం అమిత్ షా సహా కేంద్రమంత్రులు, అంతర్జాతీయ పారిశ్రామిక, వాణిజ్య దిగ్గజ కంపెనీల ప్రతినిధులు ఈ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు హాజరు కానున్నారు. దాదాపు 58 దేశాలకు చెందిన ప్రభుత్వ, పారిశ్రామిక ప్రతినిధులు కూడా ఈ సదస్సుకు హాజరయ్యేందుకు ఇప్పటికే నమోదు చేసుకున్నారు. ప్రపంచ మార్కెట్లతో ఏపీ పరిశ్రమల్ని అనుసంధానించటమే లక్ష్యంగా ఈ భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రపంచ పెట్టుబడులు, అంతర్జాతీయ వాణిజ్యం, సాంకేతిక భాగస్వామ్యాలకు ఆంధ్రప్రదేశ్ను కీలక కేంద్రంగా నిలిచేలా ఈ సదస్సులో చర్చలు, ఒప్పందాలు జరుగనున్నాయి. మారుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వాణిజ్యం, సాంకేతికత, పరస్పర విశ్వాసం, నిపుణుల దార్శనిక ఆలోచనలకు ప్రాధాన్యమిస్తూ చర్చలు సాగనున్నాయి. ప్రపంచ దేశాలతో భారత ఆర్థిక భాగస్వామ్యానికి ప్రధాన వేదికగా ఈ సదస్సును 1995 నుంచి ఏటా నిర్వహిస్తున్నారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని డీపీఐఐటీతో కలిసి భారత పరిశ్రమల సమాఖ్య సీఐఐ ఈ సదస్సును నిర్వహిస్తోంది.

ఈ పెట్టుబడుల సదస్సుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆతిథ్యం ఇస్తోంది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ సమ్మిట్కు అధ్యక్షత వహించనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహాధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. 58 దేశాల ప్రాతినిధ్యం, 16 మంది విదేశీ మంత్రులు, 40 మంది అంతర్జాతీయ స్థాయి ప్రతినిధులు ఈ సమ్మిట్ కు హాజరు కానున్నారు. సింగపూర్, నేపాల్, కంబోడియా, మయన్మార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కెనడా, స్లోవాక్ రిపబ్లిక్, మారిషస్, మొజాంబిక్, ఈజిప్ట్, అల్జీరియా, టాంజానియా, గ్వాటెమాలా తదితర దేశాల ప్రభుత్వ ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొననున్నారు. విధ దేశాల రాయబారులు, పారిశ్రామిక ప్రముఖులు, సాంకేతిక నిపుణులతో పాటు వరల్ ఫుడ్ ప్రోగ్రామ్, ఏడీబీ, యునెప్ లాంటి సంస్థల ప్రతినిధులు కూడా ఈ సదస్సుకు హాజరు కానున్నారు. ఈ సదస్సులో భాగంగా 400 పైచిలుకు బిజినెస్ టు బిజినెస్ సమావేశాలు నిర్వహించనున్నారు. దీంతో పాటు ప్రభుత్వాలతో పరిశ్రమల సంప్రదింపుల కోసం బీటూ జీ సమావేశాలు కూడా జరుగనున్నాయి.

ఏపీ ఉమెన్ గ్రోత్ సమ్మిట్ 2026

పెట్టుబడుల సదస్సులో భాగంగా ఈ నెల 11 తేదీన పారిశ్రామిక ప్రతినిధుల మధ్య ముందస్తు సమావేశాలు జరుగనున్నాయి. అదే రోజు రాత్రి 8 గంటలకు ముఖ్యమంత్రి అధికారిక విందు ఇవ్వనున్నారు. విశాఖలోని ఆంధ్రా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్ లో 12, 13 తేదీల్లో ప్రధాన సమావేశం నిర్వహించనున్నారు. దీనికి సమాంతరంగా ఏపీ ఉమెన్ అండ్ గ్రోత్ సమ్మిట్ 2026 నిర్వహిస్తారు. 12 తేదీ ఉదయం 9.30 గంటలకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పీయూష్ గోయెల్, సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, మంత్రి నారా లోకేష్, వరల్ ఎకనామిక్ ఫోరం ప్రతినిధి రాబర్ట్ తదితరులు సీఐఐ భాగస్వామ్య సదస్సును ప్రారంభించనున్నారు.

ఘనంగా దీపావళి వేడుకలు



హనుమకొండ, నవంబర్ 9(మనం న్యూస్): దీపావళి పండుగను పురస్కరించుకొని హనుమకొండ జిల్లా గుండ్ల సింగారం బాలాజీ బంజారా కాలనీ లో రిటైర్డ్ హెడ్మాస్టర్ లావుడియా శారదా రాము నాయక్, లంబాడీల ఐక్యవేదిక లైవ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు రాష్ట్ర ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ లావుడియా పల్లవి రాజు నాయక్, జీవన శ్రీ, కుటుంబ సభ్యులు ఘనంగా సాంప్రదాయ పద్ధతిగా దీపావళి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబంతో కలిసి దీపాలు వెలిగించి, టపాసులు కాల్చి ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకున్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దీపావళి ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని, కుటుంబ సభ్యుల మధ్య ప్రేమానురాగాలు, ఐకమత్యం పెంపొందాలని కోరుకున్నారు. దీపాల వెలుగులతో బాలాజీ బంజారా కాలనీ పండుగ శోభను సంతరించుకుంది. ఈ దీపావళి ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం, ఆశలు, అభివృద్ధికి కొత్త వెలుగులు తీసుకురావాలని కుటుంబ సభ్యులు ఆకాంక్షించారు



తెలుగుదేశం పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేద్దాం

- **కోదాడ మండల టీడీపీ అధ్యక్షుడు కట్టా సతీష్**

కోదాడ, నవంబర్ 9 (మనం న్యూస్): దీపావళి పండుగ సందర్భంగా తొగర్రాయి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ అభిమానులు కోదాడ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కట్టా సతీష్ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కట్టా సతీష్ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ వైపు మరింత మంది ఆకర్షితులవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో పార్టీలో పనిచేసి ఇతర పార్టీల్లోకి వెళ్లిన వారిలో చాలామంది తిరిగి తెలుగుదేశం పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. అందరం ఐక్యంగా, సమిష్టి కృషితో ముందుకు సాగుతూ కోదాడ మండలంతో పాటు ప్రతి గ్రామంలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ధూపాటి సతీష్, పోతురాజు గోపికృష్ణ, అమరబోయిన నాగేశ్వరరావు, కంపసాటి వినోద్, ధూపాటి మధు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మరణ ధ్రువీకరణ పత్రంతో కారుణ్య నియామకం

- **14 మంది అరెస్ట్, రూ.5 లక్షల నగదు స్వాధీనం**
- **బంధువులు, మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖ అధికారుల కుట్ర**
- **జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్**



నల్గొండ, నవంబర్ 8 (మనం ప్రతినిధి): నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాన్ని సృష్టించి, ప్రభుత్వ ఉద్యోగి విధుల్లో ఉండగానే మరణించినట్లు తప్పుడు రికార్డులు తయారు చేసి, ఆయన కుమారుడికి కారుణ్య నియామకం కింద ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించిన మోసపూరిత వ్యవహారాన్ని నల్గొండ జిల్లా పోలీసులు ఛేదించారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ అక్రమ వ్యవహారంలో ప్రత్యక్షంగా పాల్గొన్న కుటుంబ సభ్యులు, బంధువులు, మున్సిపల్ శాఖ మరియు వైద్య ఆరోగ్య శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది సహా మొత్తం 14 మందిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఆయన తెలిపారు. నల్గొండ జిల్లా శాలిగౌరారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్ గా పనిచేసిన చామకూరి వెంకటేశ్వర్లు 31-05-2025న పదవీ విరమణ పొందారు. ఆయన కొంతకాలంగా మూత్రపిండాల సంబంధిత అనారోగ్యంతో బాధపడుతూ 17-11-2025న సాయంత్రం 5.10 గంటలకు మరణించారు. అనంతరం 26-11-2025న ఆయన స్వగ్రామమైన నకిరేకల్ మండలం ఒగోడులో దశదిన కర్మలు నిర్వహించారు. మృతుడు వెంకటేశ్వర్లు ఉద్యోగంలో ఉండగానే మరణించినట్లు తప్పుడు రికార్డులు సృష్టిస్తే, ఆయన కుమారుడైన చామకూరి రాజుకు కారుణ్య నియామకం కింద ప్రభుత్వ ఉద్యోగం పొందే అవకాశం ఉంటుందని నిందితులు పథకం రచించారు. ఈ క్రమంలో మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు కలిసి కుట్రకు పాల్పడ్డారు. ఈ పథకంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శాలిగౌరారం సీనియర్ అసిస్టెంట్ కంచర్ల జగన్నాథ రెడ్డి, మృతుడి బంధువులైన చామకూరి రాజశేఖర్, చామకూరి రవీందర్, రాచకొండ వెంకటేశ్వర్లు, మృతుడి భార్య చామకూరి వసంత, కుమారుడు చామకూరి రాజుతో కలిసి ప్రణాళిక రూపొందించారు. ఈ వ్యవహారంలో నల్గొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో పనిచేస్తున్న పోలె రంజిత్ కుమార్ ను సంప్రదించి, మృతుడి భార్య వసంతతో రూ.13 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. మృతుడి బంధువులైన రాజశేఖర్, రవీందర్ సమన్వయంతో నల్గొండలోని మీ సేవా కేంద్రం నిర్వాహకుడు పనస చంద్రశేఖర్ ద్వారా మృతుడి ఆధార్ కార్డులో చిరునామాను మార్చారు. నల్గొండ పట్టణంలోని డివికె రోడ్డులో చైతన్యపురి కాలనీ, వార్డు నంబర్ 10, ఇంటి నంబర్ 500/1లో నివసిస్తున్నట్లు తప్పుడు చిరునామా నమోదు చేయించారు. ఈ తప్పుడు ఆధార్ కార్డు ఆధారంగా చామకూరి వెంకటేశ్వర్లు 28-05-2025న విధుల్లో ఉండగానే మరణించినట్లు నల్గొండ మున్సిపాలిటీ నుంచి నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాన్ని పొందారు. ఈ ప్రక్రియలో మృతుడి మేనల్లుడు, తెలంగాణ ప్రత్యేక పోలీసులో ఉద్యోగిగా పనిచేస్తున్న కట్ల సతీష్ కు విషయం తెలియజేసి దరఖాస్తు ఫారంపై సాక్షిగా సంతకం చేయించారు. మున్సిపల్ శాఖలో వార్డు ఆఫీసర్ గా పనిచేస్తున్న శివ జనార్ధన్, శానిటరీ ఇన్స్పెక్టర్ ప్రదీప్ రెడ్డి, మీ సేవా అధికారి రాజశేఖర్, మీ సేవా కేంద్ర నిర్వాహకుడు చందు తదితరులు పరస్పరం కుమ్మక్కై నిబంధనలకు విరుద్ధంగా నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం పొందేందుకు సహకరించినట్లు పోలీసుల దర్యాప్తులో గుర్తించారు. నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం ఆధారంగా మృతుడి కుమారుడికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించేందుకు శాలిగౌరారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి ఆకుల కృష్ణ సూర్య శిల్ప తన సంతకంతో సంబంధిత దరఖాస్తు ఫైలును జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయానికి పంపించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ గింకల రాకేష్, జూనియర్ అసిస్టెంట్ తుంగతుర్తి మోహన్ కృష్ణ, పరిపాలన అధికారి మహబూబ్ అలీ, ఆఫీస్ సూపరింటెండెంట్ జితేందర్ రెడ్డి, పోలె రంజిత్ కుమార్, శాలిగౌరారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీనియర్ అసిస్టెంట్ జగన్నాథ రెడ్డి తదితరులు మృతుడి కుటుంబ సభ్యులతో కుమ్మక్కై, తప్పుడు విచారణ నివేదికలు రూపొందించి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి సమర్పించినట్లు విచారణలో వెల్లడైంది. ఈ తప్పుడు పత్రాల ఆధారంగా మృతుడి కుమారుడు చామకూరి రాజుకు దామరచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కారుణ్య నియామకం కింద ప్రభుత్వ ఉద్యోగం కల్పించారు. పోలీసులు నగదు రూ.5,00,000, ఒక కంప్యూటర్, ఒక ప్రింటర్, 12 సెల్ ఫోన్లు, మృతుడు చామకూరి వెంకటేశ్వర్లు ఫొటో స్వాధీనం చేసుకున్నారు. నల్గొండ మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 04-11-2026న నల్గొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు. తొలుత వన్ టౌన్ ఎస్ఐ జి. ముత్తయ్య దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నల్గొండ డిఎస్పీ కె. శివరామిరెడ్డి పర్యవేక్షణలో నల్గొండ వన్ టౌన్ ఇన్ చార్జ్ సిఐ కె. ఆది రెడ్డి, నల్గొండ రూరల్ ఎస్ఐ బి. శివప్రసాద్, నల్గొండ టూ టౌన్ ఎస్ఐ డి. సైదాబాబు, వన్ టౌన్ ఎస్ఐలు ఎన్. వెంకట్ నారాయణ, జె. సైదులు మరియు ఇతర పోలీసు సిబ్బంది సమన్వయంతో దర్యాప్తు చేపట్టి ఈ మోసాన్ని ఛేదించారు.

క్రైస్తవులపై దాడులను ఖండిస్తూ భారీ శాంతియుత ర్యాలీ

సీఐకి, అంబేద్కర్ విగ్రహం వద్ద వినతిపత్రాల సమర్పణ



కోదాడ, నవంబర్ 9(మనం న్యూస్): దేశవ్యాప్తంగా క్రైస్తవులపై రోజురోజుకూ పెరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తూ, క్రైస్తవుల హక్కుల పరిరక్షణ, మత స్వేచ్ఛ, సామాజిక న్యాయం కోసం కోదాడ పట్టణంలో భారీ శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో క్రైస్తవ నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సంఘ పెద్దలు, మహిళలు, యువకులు, క్రైస్తవ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ర్యాలీలో పాల్గొన్న నాయకులు తొలుత కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్కు చేరుకొని పట్టణ సీఐకి క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మెమోరాండం సమర్పించారు. అనంతరం భారీ ర్యాలీగా బయలుదేరి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని అక్కడ కూడా వినతిపత్రం సమర్పించారు. క్రైస్తవుల రాజ్యాంగబద్ధమైన హక్కులను కాపాడాలని, ప్రార్థనా మందిరాలకు రక్షణ కల్పించాలని, మత స్వేచ్ఛకు భంగం కలిగించే చర్యలను అరికట్టాలని నాయకులు ఈ సందర్భంగా కోరారు.

ర్యాలీలో పాల్గొన్న ప్రముఖులు..

ఈ కార్యక్రమంలో కోదాడ మున్సిపాలిటీ మాజీ క్రిస్టియన్ కో-ఆప్షన్ సభ్యురాలు ఒంటిపాక జానకి ఏసయ్య, ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు పంది తిరుపతయ్య, సీపీఎం పార్టీ నాయకులు ముత్యాలు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కుడుముల రాంబాబు, క్రిస్టియన్ మైనార్టీ నాయకులు వి యేసయ్య, క్రైస్తవ నాయకులు రూజ్వెల్ట్, జిఆర్ అబ్రహం, కర్ల ప్రభుదాస్, డేవిడ్ రాజారావు, శాంత వర్ధన్, రాజేష్, సామేలు, కిరణ్, పాల్ చారి, జాన్, కోటయ్య, జాన్ చలమయ్య, డాకూరి ప్రభాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కోదాడ పట్టణంలోని వివిధ చర్చిల సంఘ పెద్దలు, పాస్టర్లు, మహిళలు, యువకులు మరియు క్రైస్తవ విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొని తమ సంఘీభావాన్ని తెలిపారు.

శాంతి, సమానత్వం, మత స్వేచ్ఛే మా ఆకాంక్ష

క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని, భారత రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛను ప్రతి పౌరుడికి సమానంగా అమలు చేయాలని, అన్ని మతాల ప్రజలు శాంతియుతంగా జీవించే వాతావరణాన్ని ప్రభుత్వాలు కల్పించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. కోదాడ క్రైస్తవ సమాజం ఐక్యతతో, క్రమశిక్షణతో, శాంతియుతంగా నిర్వహించిన ఈ ర్యాలీ విజయవంతము చెసారు.

పుస్తెలతాడు చోరీకి యత్నం.. ఇద్దరు కేటుగాళ్లు అరెస్ట్!



జనగామ,నవంబర్ 9 (మనం ప్రతినిధి): పొలం పనుల్లో నిమగ్నమైన మహిళలను లక్ష్యంగా చేసుకుని బంగారు ఆభరణాల చోరీకి పాల్పడేందుకు యత్నించిన ఇద్దరు వ్యక్తులను లింగాల ఘనపూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. ఈ ఘటన అక్టోబర్ 28న నెల్లుట్ల గ్రామ శివారులో చోటుచేసుకోగా, పోలీసుల దర్యాప్తుతో నిందితుల ఆచూకీ వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్లోని చైతన్యపురి ప్రాంతానికి చెందిన గోకారపు ఉపేందర్ (35), పాలమాకుల విష్ణు (20) సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో చోరీలకు పథకం రచించారు. ఇందులో భాగంగా పల్సర్ ఖ200 మోటార్ సైక్లి జనగామకు చేరుకుని, నెల్లుట్ల పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ ఒంటరిగా ఉన్న మహిళలను గమనించారు. మధ్యాహ్నం సమయంలో పత్తి చేనులో పనిచేస్తున్న మహిళ మెడలోని బంగారు పుస్తెలతాడును లాక్కునేందుకు ప్రయత్నించగా, ఆమె ప్రతిఘటించి గట్టిగా కేకలు వేయడంతో అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాలను సేకరించి నిందితులను గుర్తించారు. అనంతరం ఇద్దరినీ అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. నిందితుడు ఉపేందర్ వద్ద నల్లరంగు వన్ప్లస్ మొబైల్ ఫోన్ను స్వాధీనం చేసుకోగా, ఘటనకు ఉపయోగించిన పల్సర్ ఖ200 మోటార్ సైకిల్ను కూడా గుర్తించారు.

సిబ్బందికి సీఐ అభినందనలు కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై కిషోర్, కానిస్టేబుళ్లు అనుదీప్, వేణుగోపాల్ను సీఐ జి.వేణు అభినందించారు. మహిళలు అప్రమత్తంగా ఉండాలి గ్రామీణ ప్రాంతాల్లో పొలాల్లో పనిచేసే మహిళలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు. ప్రజల భద్రతకు పోలీస్ శాఖ నిరంతరం అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ప్రజాసంక్షేమమే సీఎం రేవంత్ లక్ష్యం

ఎమ్మెల్యే సామేల్ తోనే తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధి

జిల్లా అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య



తిరుమలగిరి నవంబర్ 09 (మనం న్యూస్) రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమమే వేయంగా పాలన సాధిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య అన్నారు. తిరుమలగిరి మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుంకరి జనార్దన్, మున్సిఅధ్యక్షులు కేసిడి వెంకట లక్ష్మారెడ్డి లు నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచి బాణాసంచాను కాల్చి ఆనందొాగా జన్మదిన వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నరసయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్న ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తూ, ప్రజా పాలనను సాగిస్తున్నారని చెప్పారు. రాబోయే రోజుల్లో రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలోకి వెళుతుందని చెప్పారు.మండల పార్టీ అధ్యక్షులు సుంకరి జనార్దన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, ఎమ్మెల్యే మందుల సామేలు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతున్నారని చెప్పారు. నియోజకవర్గంలో ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న సమస్యలను నేడు ఎమ్మెల్యే సామేలు చొరవతో పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి, మంత్రుల నియోజకవర్గాలతో సమానంగా తుంగతుర్తికి కూడా నిధులు, ప్రాజెక్టులు మంజూరవుతున్నాయని వివరించారు. మున్సిపాలిటీ అధ్యక్షులు కేసిడి వెంకటలక్ష్మారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గానికి వరాల జల్లు.. ఇందిరమ్మ ఇండ్లు ఒక వరం అని నియోజకవర్గానికి జూనియర్ కళాశాల, ఇంటిగ్రేటెడ్ స్కూల్, తెలంగాణ పబ్లిక్ స్కూల్, వంద పడకల ఆసుపత్రి, గోదాములు, ఇండస్ట్రియల్ పార్క్, ప్రభుత్వ భవనాల నిర్మాణాలు వంటి భారీ ప్రాజెక్టులు వస్తున్నాయని నరసయ్య పేర్కొన్నారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఒక గొప్ప వరమని, లబ్ధిదారులు జీవితకాలం సీఎం రేవంత్ రెడ్డిని, ఎమ్మెల్యే మందుల సామెల్ను గుండెల్లో పెట్టుకుంటారని అన్నారు. నిత్యం ప్రజల మధ్యే ఉంటూ ప్రజాసేవ చేస్తున్న ఎమ్మెల్యే సామెల్ సారథ్యంలో తుంగతుర్తి నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్సి చైర్మన్ పాలపు చంద్రశేఖర్, కౌన్సిలర్లు తిరుమణి యాదగిరి, కేసిడి కవిత రెడ్డి, బత్తుల శ్రీను, మల్లయ్య, మాజీ మండల అధ్యక్షుడు ఎల్సొజు నరేష్, జుమ్మిలాల్, కందుకూరి లక్ష్మయ్య, కందుకూరి నాగార్జున, శోభారాణి, సతీష్ గౌడ్, భాస్కర్ నాయక్, కిష్టు నాయక్, హీరు నాయక్, పిఎన్ఆర్, అబ్బాస్, సుధాకర్, వంశీ, గంగాధర్, యాకన్న, సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి



సూర్యాపేట, నవంబర్ 09 (మనం ప్రతినిధి): ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అదనపు కలెక్టర్ బి. హరిసింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రతి సోమవారం జరుగు ప్రజావాణి కి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మండల స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్లైన్ పోర్టల్లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ప్రజావాణి పోర్టల్లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్లో నమోదు చేయాలని సూచించారు.

ముఖ్యంగా రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. ప్రతి అధికారి తమ లాగిన్ లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని లేనియెడల వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణి కి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మండల స్థాయి సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని అన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి, రెవిన్యూ కి సంబందించి 24 దరఖాస్తులు, డిపిఓ 4, పిడి హౌజింగ్ 2, డిడబ్ల్యుఓ 3, డిఇఓ 4, డిఎంహెచ్వో 2, డిఆర్డిఓ 2, మిగిలిన 15 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 56 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమానికి జడ్పీ సీఈవో శిరీష, డిఆర్డిఓ పిడి సన్యాసయ్య, డిఎంహెచ్వో వెంకటరమణ, సిపిఓ కిషన్, సిఎఫ్ఓ దామోదర్ రెడ్డి, డీఎస్ఓ మోహన్ బాబు, డిడబ్ల్యుఓ నరసింహారావు, డిపిఓ యాదగిరి డిఐఈఓ సులోచన రాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడి ఉపేందర్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి , జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోలీస్ క్రీడలకు మహిళా పోలీస్‌ల ఎంపిక

తెలంగాణ రాష్ట్ర ఐదవ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో సత్తాచాటిన జిల్లా పోలీస్ క్రీడాకారులు

మహిళా వాలీబాల్ క్రీడలో ప్రథమ మహిళా కబడ్డీ క్రీడ ద్వితీయ బహుమతి.. ఎస్పి నరసింహని కలిసిన క్రీడాకారులు



సూర్యాపేట, నవంబర్ 9 (మనం ప్రతినిధి): వరంగల్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ నందు గత వారం జరిగిన తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఐదవ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్లో సూర్యాపేట జిల్లా పోలీస్ క్రీడాకారులు అద్భుత ప్రతిభ చూపారు. పోలీస్ జోన్-5 తరపున వివిధ క్రీడా పోటీల్లో ప్రాతినిధ్యం వహించిన జిల్లా పోలీస్ క్రీడాకారులు మహిళా వాలీబాల్లో ప్రథమ బహుమతి, మహిళా కబడ్డీలో ద్వితీయ బహుమతి సాధించడంలో కీలకపాత్ర పోషించారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం నందు ఎస్పీ నర్సింహాని క్రీడాకారులు మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా ఎస్పీ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయి క్రీడల్లో జోన్ 5 తరపున జట్టులో సూర్యాపేట జిల్లా పోలీసు క్రీడాకారులు ప్రతిభ చూపారని అభినందించారు. జోన్-5 మహిళా కబడ్డీ జట్టులో జిల్లాకు చెందిన మహిళా కానిస్టేబుళ్లు సీహెచ్. లత, ఎన్. దీపిక, ఎం. అనూష, ఎస్.కె. అనీఫా, ఈ. అరుంధతి, సీహెచ్. శిరీష . వాలీబాల్ జట్టులో జిల్లాకు చెందిన మహిళా కానిస్టేబుళ్లు కే. లావణ్య, బి. ప్రియాంక, కే. దివ్యభారతి, కే. ప్రవల్లిక ప్రాతినిధ్యం వహించి తమ ప్రతిభను చాటుకున్నారు. వీరి క్రీడా నైపుణ్యం, సమన్వయం, పట్టుదలతో జోన్-5 జట్టు పోటీల్లో బహుమతి సాధించింది అన్నారు. అలాగే ఈ కబడ్డీ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులు ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ స్పోర్ట్స్ మీకు తెలంగాణ రాష్ట్రం తరపున జట్టుకు ఎంపిక చేయాలని అభినందించారు.

ఆల్ ఇండియా పోలీస్ గేమ్స్‌కు జిల్లా క్రీడాకారుల ఎంపిక...

రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన సూర్యాపేట జిల్లా పోలీస్ క్రీడాకారులు ఆల్ ఇండియా పోలీస్ గేమ్స్కు ఎంపిక కావడం మరో విశేషం. మహిళా కబడ్డీ విభాగంలో సీహెచ్. లత, ఎన్. దీపిక, ఎం. అనూష, ఎస్.కె. అనీఫా తెలంగాణ రాష్ట్ర పోలీస్ జట్టు తరపున ఆల్ ఇండియా పోలీస్ గేమ్స్కు ఎంపికయ్యారు. ఈ పోటీలు వచ్చే నెలలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో జరగనున్నాయి. అదేవిధంగా మహిళా వాలీబాల్ విభాగంలో కే. లావణ్య, బి. ప్రియాంక తెలంగాణ పోలీస్ జట్టు తరపున జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలు వచ్చే నెలలో తమిళనాడు రాష్ట్రంలో నిర్వహించనున్నారు. మహిళా కోకో విభాగంలో కే. దివ్యభారతి తెలంగాణ రాష్ట్ర పోలీస్ జట్టు తరపున ఆల్ ఇండియా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీల్లో బహుమతులు సాధించడం, జాతీయస్థాయి పోలీస్ క్రీడలకు ఎంపిక కావడం సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖకు గర్వకారణమని పేర్కొన్నారు. రానున్న ఆల్ ఇండియా పోలీస్ గేమ్స్లో కూడా ఇదే స్ఫూర్తితో మరింత మెరుగైన ప్రదర్శన కనబరిచి జాతీయస్థాయిలో విజేతలుగా నిలిచి తెలంగాణ రాష్ట్రానికి, సూర్యాపేట జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచే పోలీస్ సిబ్బందికి శాఖాపరంగా తగిన ప్రోత్సాహకాలు, అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్ అడ్మిన్ ప్రవీణ్ కుమార్, ఆర్ఐ జానయ్య, కబడ్డీ టీం కోచ్ ఎస్ఐ రామచందర్ గౌడ్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్, వాలీబాల్ టీం కోచ్ కానిస్టేబుల్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులపై వేగంగా పోలీస్ సేవలు..

ప్రజా ఫిర్యాదులపై వేగంగా పోలీస్ సేవలు అందిస్తున్నామని జిల్లా ఎస్పీ కే నరసింహ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, వినతులను పరిశీలించారు. ప్రజలకు అవసరమైన సేవలు, తక్షణ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. ప్రజా రక్షణ కోసం పోలీసు సిబ్బంది అనుక్షణం విధులు నిర్వర్తిస్తున్నారని ఎస్పీ గారు పేర్కొన్నారు. ప్రజలు గొడవలు, తగాదాలకు దూరంగా ఉండాలని, సమస్యలు వచ్చినప్పుడు దాడులకు పాల్పడకుండా ఇరు వర్గాలు పెద్దల సమక్షంలో సామరస్యపూర్వకంగా, చట్ట పరిధిలో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డితో నాగరాజుకు
ప్రత్యేక ఆత్మీయ అనుబంధం

చిరకాల పరిచయమే నేటి సాన్నిహిత్యానికి నిదర్శనం..


సీఎం జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన రమ్య నాగరాజ్ దంపతులు



కొల్లాపూర్, నవంబర్ 8 (మనం న్యూస్): తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డితో కొల్లాపూర్కు చెందిన నాగరాజుకు గతం నుంచే రాజకీయ పరిచయాలు, ఆత్మీయ అనుబంధాలు కొనసాగుతున్నాయి. రాజకీయ పరిచయంతో ప్రారంభమైన ఈ అనుబంధం నేటికీ సన్నిహిత సంబంధంగా కొనసాగుతుండటం విశేషం. కొల్లాపూర్కు వచ్చిన సందర్భంలో నాగరాజును ఆప్యాయంగా పలకరిస్తూ 'ఏం నాగరాజు.. ఏం నడుస్తుంది?' అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలకరించిన తీరు వారి మధ్య ఉన్న ఆత్మీయతకు నిదర్శనంగా నిలుస్తోంది. అప్పటి నుంచి కొనసాగుతున్న ఈ సాన్నిహిత్యం నాగరాజుకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది.

ఈ చిరకాల ఆత్మీయ అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని కొల్లాపూర్ మున్సిపాలిటీ మాజీ చైర్పర్సన్, ప్రస్తుత కౌన్సిలర్ రమ్య నాగరాజ్ తన భర్త నాగరాజుతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యమంత్రి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజలకు మరింతకాలం సేవలందించాలని భగవంతుడిని ప్రార్థించారు. ముఖ్యమంత్రితో తమకు ఉన్న పాత పరిచయాలు, ఆత్మీయ సంబంధాలు భవిష్యత్తులోనూ ఇలాగే కొనసాగాలని ఆకాంక్షిస్తూ, 2047 వరకు ముఖ్యమంత్రిగా కొనసాగి తెలంగాణ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి మరిన్ని సేవలు అందించాలని రమ్య నాగరాజ్ దంపతులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

సంతకాలు ఎవరివి? ఏ ఆధారాలతో
ధాన్యం కేటాయించారు?



- **సివిల్ సప్లై అధికారుల నిర్లక్ష్యమా.. సంతకాల ఫోర్జరీ జరిగిందా?**
- **68 ఎస్కేల బకాయిలపై సమగ్ర విచారణకు డిమాండ్.**
- **80 ఏళ్ల వయస్సులో నాకు బకాయిలు పెట్టాల్సిన అవసరమేముంది? నా పేరును ఎందుకు చెడగొడుతున్నారు.**
- **సీబీఎం మిల్ యజమాని ఆవేదన**

సిరిసిల్ల, నవంబర్ 09 (మనం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో సీబీఎం బాయిల్ రైస్ మిల్ వ్యవహారం రోజు రోజుకూ సిరిసిల్ల జిల్లాలో, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారుతోంది. ప్రభుత్వ ధాన్యం కేటాయింపులు, అగ్రిమెంట్ పత్రాలు, అధికారుల వద్ద ఉన్న రికార్డులు, సంతకాల ప్రామాణికతపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అసలు అగ్రిమెంట్లు లేకుండా ధాన్యం ఎలా కేటాయించారు.? అధికారుల వద్ద ఉన్న పత్రాలపై సంతకాలు ఎవరు చేశారు.? వాటికి సంబంధించిన ఆధారాలు ఏమిటి?. అన్న ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది. సీబీఎం బాయిల్ రైస్ మిల్ యజమాని చీకోటి మురళీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. 2020, 2021 నుంచి2021, 2022 వరకు మాత్రమే ప్రభుత్వ ధాన్యం దిగుమతి ప్రక్రియకు సంబంధించి అగ్రిమెంట్ పత్రాలపై తాను సంతకాలు చేశానని, వాటికి సంబంధించిన, ఎన్ఓసీలు తన వద్ద ఉన్నాయని తెలిపారు. అయితే 2022, 2023. 2023, 2024. 2024, 2025. 2025, 2026. సంవత్సరాలకు సంబంధించి ప్రభుత్వానికి గానీ, సివిల్ సప్లై అధికారులకు గానీ ఎలాంటి అగ్రిమెంట్ పత్రాలపై తాను సంతకాలు చేయలేదని చీకోటి మురళీధర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అగ్రిమెంట్లు లేకుండా ధాన్యం ఎలా కేటాయించారు?


2022 , 2023 నుంచి 2026 వరకు అగ్రిమెంట్లు చేయలేదని మిల్ యజమాని చెబుతున్న నేపథ్యంలో ఆయా సంవత్సరాల్లో సీబీఎం రైస్ మిల్లుకు ప్రభుత్వ ధాన్యం ఏ ప్రాతిపదికన కేటాయించారు.? అనే అంశంపై విచారణ చేపట్టాలి. అగ్రిమెంట్ పత్రాలు ఎవరు సమర్పించారు?. వాళ్ల పేరు వెల్లడించాలి. వాటిపై ఉన్న సంతకాలు నిజమైనవేనా?. బహిర్గతం చేయాలి. సివిల్ సప్లై అధికారులు సంబంధించిన పత్రాలను అధికారులు పరిశీలించారా?. ఒకవేళ సంతకాల విషయంలో తేడాలు ఉంటే వాటిపై విచారణ ఎందుకు జరగడం లేదు.? అన్న ప్రశ్నలు ఇప్పుడు కీలకంగా మారాయి.

68 ఎస్కేల బకాయిలపై స్పష్టత ఏది?

ప్రస్తుతం ప్రభుత్వానికి సీబీఎం రైస్ మిల్ నుంచి 68 ఎస్కేల ధాన్యం బకాయి ఉందని చెబుతున్న నేపథ్యంలో, ఆ బకాయిలకు సంబంధించిన పూర్తి వివరాలను బయటపెట్టాలని మిల్ యజమాని కోరుతున్నారు. ఏ సంవత్సరానికి సంబంధించిన ధాన్యం? ఎంత కేటాయించారు?. ఎంత మిల్లింగ్ చేశారు? ఎంత బియ్యం ప్రభుత్వానికి అప్పగించారు? ఎంత బకాయి ఉంది.? అనే వివరాలను అధికారిక రికార్డులతో వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు.

80 ఏళ్ల వయస్సులో నేను బకాయిలు ఎందుకు పెడతాను?

80 ఏళ్ల వృద్ధాప్యంలో ఉన్న నేను ప్రభుత్వానికి బకాయిలు పెట్టాల్సిన అవసరం ఏముంది.? ఆవేదన చెందుతున్నాడు.మార్కెట్లో నాకు



ఎంతోకాలంగా మంచి పేరు, గౌరవం ఉన్నాయి. అలాంటి నా పేరును బకాయిల పేరుతో చెడగొట్టే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదని చీకోటి మురళీధర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాను సంతకం చేయని అగ్రిమెంట్ల ఆధారంగా తనను బకాయిదారుడిగా ఎలా పేర్కొంటారని ఆవేదన చెందుతున్నారు. ఏ పత్రాల ఆధారంగా ధాన్యం కేటాయించారు.? వాటిపై సంతకాలు ఎవరు చేశారు.? అనే విషయాలను అధికారులు బహిర్గతం చేయాలని కోరుతున్నారు. తనకు ఉన్న సామాజిక గౌరవం, మార్కెట్లో ఉన్న మంచి పేరుకు భంగం కలగకుండా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కలెక్టర్ స్థాయిలో సమగ్ర విచారణ జరగాలి

సిబిఎం బాయిల్ రైస్ మిల్ ఇండస్ట్రీ వ్యవహారం వరుస కథనాలు మనం దినపత్రికలో వస్తున్న విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తక్షణమే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని మిల్ యజమాని విజ్ఞప్తి చేస్తున్నారు. 2020 నుంచి 2026 వరకు ఉన్న అగ్రిమెంట్ పత్రాలు, ఎన్ఓసీలు ధాన్యం కేటాయింపు రికార్డులు, రవాణా వివరాలు, మిల్లింగ్ లెక్కలు, ప్రభుత్వానికి బియ్యం అప్పగించిన వివరాలను పరిశీలించాలని కోరుతున్నారు.

అగ్రిమెంట్ పత్రాలపై సంతకాల విషయంలో అనుమానాలు ఉంటే వాటిని ఫోరెన్సిక్ పరీక్షకు పంపించి నిజానిజాలు నిగ్గుతేల్చాలని, అధికారుల నిర్లక్ష్యం ఏమైనా ఉందా.? నిబంధనలకు విరుద్ధంగా ధాన్యం కేటాయింపులు జరిగాయా? అనే కోణాల్లోనూ విచారణ జరపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వ ధాన్యం వ్యవహారంలో పారదర్శకత ఉండాలి. తప్పు చేసిన వారు ఎవరైనా సరే బాధ్యత వహించాలి. నిజమైన బకాయిలను గుర్తించి ప్రభుత్వానికి రావాల్సిన ధాన్యాన్ని రికవరీ చేయడంతో పాటు, తప్పుడు పత్రాలు సమర్పించినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో ఆధారాలు లేకుండా ఎవరినీ బకాయిదారులుగా ముద్ర వేయకూడదు.

సంతకాలు ఎవరివి? ధాన్యం ఎవరికి కేటాయించారు.? 68 ఎస్కేల బకాయిల వెనుక వాస్తవాలేమిటి? 80 ఏళ్ల వృద్ధుడి ఆవేదనకు అధికారులు సమాధానం చెబుతారా? ఈ ప్రశ్నలన్నింటికీ జిల్లా యంత్రాంగం సమగ్ర విచారణ ద్వారా సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది అని పలువురు రైస్ మిల్ యజమాన్యం అభిప్రాయపడుతున్నారు .

అశోక్‌ని కలిసిన కాంగ్రెస్ పార్టీ నేతలు



ములుగు, నవంబర్ 9, మనం ప్రతినిధి: దీపావళి పర్వదినం సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ నివాసంలో దీపావళి శుభాకాంక్షలు తెలిపిన గోవిందరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు..... ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు అడుగు వెంకటకృష్ణ, భూక్షిఇ జిల్లా అధ్యక్షులు కొంపల్లి శ్రీనివాసరెడ్డి, జిల్లా నాయకులు గుండెబోయిన అనిల్ కుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి భక్తి సాంగ్ విడుదల చేసిన నాగరమేష్



మంగపేట, నవంబర్ 9(మనం ప్రతినిధి): మంగపేట మండలం రాజుపేట శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో గురుస్వామి కర్రి శ్యాంబాబు రచించి, ఆలపించిన నూతన అయ్యప్ప స్వామి భక్తి గీతాన్ని సోమవారం ఘనంగా విడుదల చేశారు. ప్రజాసేవ నాయకుడు బాడిశ నాగరమేష్, బిఆర్ఎస్ నాయకులు ఎడ్లపల్లి నర్సింహారావు, జిల్లా మహిళా నాయకురాలు కొమురం ధనలక్ష్మి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి సంయుక్తంగా పాటను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగరమేష్ మాట్లాడుతూ... మన ఏజెన్సీ ప్రాంతంలో ఇంతటి గొప్ప ఆధ్యాత్మిక భావంతో, భక్తి శ్రద్ధలతో శ్యామ్ బాబు గీతాన్ని రచించి ఆలపించడం అభినందనీయమని కొనియాడారు. భక్తులలో భక్తి భావాన్ని పెంపొందించేలా ఇలాంటి మంచి ప్రయత్నాలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కర్రి రామ్మోహన్, చదలవాడ సాంబశివరావు,కర్రి శ్రీను, సుధాకర్ రెడ్డి, కొమరం పుల్లారావు, రూప భద్రయ్య ,మండల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మండలం లోని పలు బాధిత కుటుంబాలకు పరామర్శ,ఆర్థిక సహాయం

- **దశ దిన కర్మ లకు ఒక్కో కుటుంబానికి ఐదు వేలరూపాయల చొప్పున 20,000 ఆర్థిక సహాయం**
- **మాజీ బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ సోదరుడి కుటుంబాన్ని పరామర్శ**
- **పాల్గొన్న బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులు ,బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం..బాడిశ నాగ రమేష్**





మంగపేట, నవంబర్ 9, మనం ప్రతినిధి: మంగపేట మండలం లోని పలు గ్రామాల్లో ఇటీవల చనిపోయిన బాధిత కుటుంబాల ఇంటికి సోమవారం నాడు ములుగు జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి,శ్రీ రామ కృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్ బాడిశ నాగ రమేష్ ,బిఆర్ఎస్ పార్టీ నాయకుల తో కలిసి వెళ్లి పరామర్శించి,ఆర్థిక సహాయం అందించారు .అందులో భాగంగా ప్రొద్మూర్ గ్రామం లో ఇటీవల అనారోగ్యం తో షారుక్(23) చనిపోగా ,వారి కుటుంబాన్ని కలిసి 5,000 రూపాయలను,ఇదే గ్రామానికి చెందిన మల్కపల్లి నరేష్ చనిపోగా వారి కుటుంబాన్ని కలిసి 5,000 రూపాయలను అందించారు.అదేవిధం గా గంపోనిగూడెం గ్రామంలో ఇటీవల బిఆర్ఎస్ పార్టీ నాయకులు పోగు సమ్మయ్య అనారోగ్యం తో చనిపోగా వారి సతీమణి రమాదేవి కి 5000/- రూపాయలను అందజేయడం జరిగింది.పూరేడుపల్లి బిఆర్ఎస్ పార్టీ గ్రామకమిటీ అధ్యక్షుడు కొప్పుల మాణిక్యం బంధువు కొప్పుల విజయలక్ష్మి ఇటీవల పాముకాటు తో చనిపోయింది.మృతురాలికి నాలుగు నెలల చిన్న బాబు .వారి కుటుంబాన్ని పరామర్శించి 5,000/-రూపాయలను అందజేయడం జరిగింది.అదేవిధం గా మంగపేట మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ సోదరుడు కుడుముల శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యం తో మరణించగా వారి కుటుంబాన్ని మోట్లగూడెం లోని వారి ఇంటికి వెళ్లి పరామర్శించడం జరిగింది.అనంతరం నిమ్మగూడెం గ్రామానికి చెందిన సామాజిక నాయకుడు మద్దెల వెంకటేశ్వర్లు తండ్రి చంద్రయ్య అనారోగ్యం తో చనిపోగా వారి కుటుంబాన్ని పరామర్శించడం జరిగింది.చింతకుంట గ్రామం లో కుంజా సుమంత్ ఇటీవల అనారోగ్యంతో చనిపోగా,దశదిన కర్మ ల నిమిత్తం 5,000/-ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా మహిళా నాయకురాలు కొమరం ధనలక్ష్మి,జిల్లా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఖుర్బాన్ ఆలీ,బిఆర్ఎస్ పార్టీ నాయకులు నూనె లింగయ్య,పూజారి శ్రీనివాస్,ఎండి అయూబ్,కోరెం నర్సింహులు,అప్జల్,హైదర్ బుట్టో,సత్తర్ పాషా,దేవేందర్,గోపాల్, కోరం నగేష్ ,సంపద్ రెడ్డి కొమరం వెంకటేశ్వర్లు,అజ్జు ,మునిగేలా మహేష్,మండల సంతోష్ వివిధ గ్రామాల గ్రామకమిటీ అధ్యక్షులు కొమరం పుల్లారావు, సోయం ఈశ్వర్,కొప్పుల మాణిక్యం ,రూపభ ద్రయ్య, మునిగేలా సాంబుల్ ,యూత్ నాయకులు హైమద్,కొమరం బాలకృష్ణ, అలీముద్దీన్, దిలీప్ మరియు సోషియల్ మీడియా వారియర్స్ గుడివాడ శ్రీహరి,మునిగేలా నరేష్ తదితరులు పాల్గొన్నారు

ప్రజల వినతులపై పరిష్కార చర్యలు చేపట్టాలి




- **జిల్లా అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, ఎం. సంపత్ రావు**

ములుగు, నవంబర్ 9,మనం ప్రతినిధి: ప్రజావాణిలో అందిన ప్రజల వినతులను పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కార చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, ఎం. సంపత్ రావు సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. సోమవారం ములుగు జిల్లా సమీకృత కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించారు. అర్జీదారులు తెలిపిన సమస్యలను విని, వారి దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అర్జీలను సంబంధిత శాఖలవారీగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ అవసరమైన వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అర్జీలను పెండింగ్లో ఉంచకుండా, తీసుకున్న చర్యల వివరాలను అర్జీదారులకు తెలియజేయాలని సూచించారు. ప్రజావాణిలో మొత్తం 19 అర్జీలు అందాయి. వీటిలో భూ సమస్యలకు సంబంధించి 10, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి 2, పింఛన్లకు సంబంధించి 2, ఉద్యోగానికి సంబంధించి ఒకటి, ఇతర సమస్యలపై 4 అర్జీలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

సొసైటీ చైర్మన్ పదవి విద్యావంతులకు మాత్రమే ఇవ్వాలి

- **జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్ డిమాండ్ చేశారు**

మంగపేట, నవంబర్9, మనం ప్రతినిధి: సహకార సంఘాల (సొసైటీల) ప్రక్షాళన కోసం జ్వాలా చైర్మన్ కోడెల నరేష్ గళం విప్పారు. సొసైటీ చైర్మన్ పదవిని కేవలం చదువుకున్న విద్యావంతులకే కేటాయించాలని ఆయన స్పష్టం చేశారు. గతంలో సొసైటీ పాలకవర్గ అయోమయ ఆధ్వర్యంలో అభివృద్ధి అనేది బాగా జరిగిందని రైతులు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు కానీ ఇప్పుడు కూడా అలాంటి అభివృద్ధే కావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారు అలాగే గతం లోని మార్క్స్ సెంటర్ల ద్వారా జరిగిన భారీ అవకతవకలను గుర్తుచేస్తూ ఇప్పటికైనా ప్రవేట్ వారికి మార్క్స్ సెంటర్లు అప్పగించకుండా సొసైటీ వారికి కానీ లేదా మహిళలల ద్వారా నడుపుతున్న ఐక్య ల వారికి అయిన సెంటర్లు కేటాయించాలని నరేష్ కోరారు అలాగే కనీసం పదవ తరగతి చదువుకున్న వారికే చైర్మన్ పదవిని ఇస్తేనే బాధ్యతాయుతంగా ఉంటుందని ఆయన తేల్చిచెప్పారు



మార్క్స్ సెంటర్ల పేరుతో మిల్లర్లతో కుమ్మక్కై ఏటా కోట్ల రూపాయల అవినీతి జరుగుతున్నా, సంబంధిత అధికారులు పట్టించుకో కపోవడం పట్ల ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల అమాయకమైన రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని, వారి కష్టాలను పట్టించుకునే నాథుడే కరువయ్యారని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, అవినీతికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలకు తావులేకుండా అర్హత గలవారికే పదవులు కట్టబెట్టాలని డిమాండ్ చేశారు.

6రోగుల వైద్య సేవల్లో పల్నాడు జిల్లా అగ్రస్థానం

- **అట్టడుగున కర్నూలు జిల్లా**
- **రాష్ట్రవ్యాప్తంగా 135 మంది వైద్యాధికారులకు షోకాజ్ నోటీసులు**
- **ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్కు నివేదించిన ప్రజారోగ్య సంచాలకులు**

అమరావతి, నవంబర్,9,(మనం ప్రత్యేక ప్రతినిధి ప్రభుత్వ పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవల పనితీరు మెరుగుపరచడంలో పల్నాడు జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. 81.6 శాతం ప్రజాభిప్రాయాలతో పల్నాడు అగ్రస్థానంలో ఉండగా, 81.5 శాతంతో పోలవరం, 80.7 శాతంతో నెల్లూరు, 78.3 శాతంతో తిరుపతి, 77.5 శాతంతో కృష్ణా జిల్లాలు వరుసగా 2 నుంచి 5 స్థానాల్లో నిలిచాయి. గత జూలై నుంచి నవంబరు 7 వరకు ఐవీఆర్ఎస్ ద్వారా రోగుల నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా వైద్యారోగ్య శాఖ జిల్లాల పనితీరును అంచనా వేసింది. వైద్యుల అందుబాటు, మందులు, పారిశుద్ధ్యం, ఇతర సౌకర్యాలపై రోగులు వెల్లడించిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంది. మరోవైపు అక్టోబర్ నెలలో ఐవీఅర్ యస్ ద్వారా పొందిన సమాచారం మేరకు రోగులకు సేవలు అందించడంలో వెనుకబడిన పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన రాష్ట్రవ్యాప్తంగా 135 మంది వైద్యాధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ ఆర్.వెంకటరమణ వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్కు నివేదించారు. ఐవీఆర్ఎస్ ద్వారా రోగుల అభిప్రాయాలు, ఆసుపత్రుల పనితీరుపై మంత్రి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. దీనికి అనుగుణంగా ఉన్నతాధికారులు సమీక్ష సమావేశాల్లో ఐవీఆర్ఎస్ నివేదికల ఆధారంగా జిల్లా అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. అట్టడుగున కర్నూలు, అనంతపురం, ఎన్టీఆర్ జిల్లాలు గడచిన ఐదు నెలల పనితీరు ఆధారంగా వెనుకబడిన జిల్లాల్లో కర్నూలు 69.5 శాతం, అనంతపురం 69.8 శాతం, ఎన్టీఆర్ జిల్లా 70.9 శాతం, అనకాపల్లి 71.5 శాతం, మార్కాపురం 71.8 శాతంతో ఉన్నాయి. అక్టోబరు పనితీరుపై రాష్ట్రవ్యాప్తంగా 135 మంది వైద్యులకు నోటీసులు అక్టోబరు నెలకు సంబంధించి వైద్యుల అందుబాటు, పారిశుద్ధ్యం, వైద్య సేవలకు డబ్బులు అడిగారా?, మందులు ఇచ్చారా? అనే నాలుగు అంశాలపై ఐవీఆర్ఎస్ ద్వారా రోగుల అభిప్రాయాలను సేకరించారు. ఈ నాలుగు అంశాల కు సంబంధించి ఒక్కో అంశంలో 100 శాతం ప్రతికూల సమాధానా వచ్చిన రాష్ట్రంలో 135 మంది వైద్యాధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డాక్టర్ ఆర్.వెంకటరమణ తెలిపారు.

నేల ఆరోగ్యమే.. మనుషుల ఆరోగ్యానికి ఆధారం

- **రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పాటించాలి**
- **ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు**

ఏటూర్ నాగారం నవంబర్ 9, మనం ప్రతినిధి: మానవ శరీరానికి ఆరోగ్యం ఎంత ముఖ్యమో వ్యవసాయానికి భూమి ఆరోగ్యం అంతే ముఖ్యమని ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు అన్నారు. రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రియ వ్యవసాయ పద్ధతులకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు.

వ్యవసాయ శాఖ ములుగు జిల్లా ఆత్మ



(అభీఱు) ఆధ్వర్యంలో నేల ఆరోగ్య కార్డు సిఫారసుల మేరకు రసాయన ఎరువులను సమతుల్యంగా వినియోగించడంపై వాజేడు మండలంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి వాజిద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిటమట రఘు హాజరయ్యారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు రామచందర్, స్వామి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ.. పంటల సాగులో అధికంగా రసాయన పదార్థాలు వినియోగించడం వల్ల ఆహారం కలుషితమై ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. ఆవు పేడ, కోళ్ల ఎరువు, ఇతర పశువుల వ్యర్థాలతో తయారుచేసిన సేంద్రియ ఎరువులు, జీవామృతాన్ని వినియోగించి పంటలు సాగు చేయాలని సూచించారు. సేంద్రియ పద్ధతుల్లో పండించిన ఆహారం ఆరోగ్యానికి మేలు చేస్తుందని పేర్కొన్నారు. భూమిలో నత్రజని, భాస్వరం, పొటాష్తో పాటు మెగ్నీషియం, మాంగనీస్ తదితర పోషకాలు సమతుల్యంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో జాఫర్, ముక్కెర లాలయ్య, ముమ్మనేని రమేష్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు

కార్తీక మాసం ప్రారంభం

- **ఇంద్రకీలాద్రిపై శాస్త్రోక్తంగా ఆకాశ దీపం ఏర్పాటు**

విజయవాడ, నవంబర్, 9,(మనం ప్రతినిధి) : శ్రీ పరాభవ నామ సంవత్సర కార్తీక మాస ప్రారంభాన్ని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం ప్రదోష కాలంలో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శాస్త్రోక్తంగా 'ఆకాశ దీపం' ఏర్పాటు కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. శ్రీకనక దుర్గమ్మ, శ్రీ మల్లేశ్వర స్వామి వార్ల సన్నిధి మరియు శ్రీ నటరాజ స్వామి వారి ఆలయంలో స్థానాచార్యుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛారణల నడుమ ఈ విశేష క్రతువు జరిగింది. ఈ పూజా కార్యక్రమాలలో దేవస్థాన ట్రస్ట్ బోర్డు చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు సమర్పించారు. కార్తీక మాసంలో ప్రదోష వేళ ఆకాశ దీపాన్ని దర్శించుకోవడం వల్ల సర్వపాపాలు నశించి, అకాల మృత్యు భయాలు తొలగిపోతాయని మరియు సవ ఎస్త శుభాలు, ఆయురారోగ్య ఐశ్వర్యాలు చేకూరుతాయని శాస్త్ర వచనం.

సకల లోకాలకు శాంతి, సౌభాగ్యాలు కలగాలని కాంక్షిస్తూ ఈ దివ్య దీపాన్ని శాస్త్రోక్తంగా వెలిగించి ఆలయ ధ్వజంనకు ఏర్పాటు చేసినట్లు అర్చకస్వాములు తెలిపారు.

నా పాత్ర చంపేయడం వెనుక డైరెక్టర్ ఆలోచన అదే.. కీర్తి సురేష్



మ్యారేజ్ తర్వాత సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసిన కీర్తి సురేష్.. ప్రజెంట్ వరుస ప్రాజెక్టులు చేస్తూ సందడి చేస్తుంది. ఈ క్రమంలోనే తాజాగా ప్రమోషన్స్లో పాల్గొన్న ఈ అమ్మడు.. 'డోరతి చిత్రంలో మిమ్మల్ని ఎవరు చంపారు? ఆ పాత్ర ఎలా మరణించింది.. ఆ సస్పెన్స్ ఏంటీ?' అనే ప్రశ్నపై స్పందిస్తూ.. 'నా మనసులో కూడా ఇదే ప్రశ్న మెదిలింది. ఆ పాత్రకు ఏమైందో మనం ఎందుకు చూపించలేదు? అని దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ని అడిగాను. ఆయన దీన్ని ఒక 'ఓపెన్ ఎండెడ్' (ముగింపును ప్రేక్షకుల ఊహకే వదిలేసేలా) ఉంచాలనుకున్నారు. సాధారణంగా చాలా సినిమాల్లో ఒక పాత్ర ఎలా మరణించింది, దానికి గల కారణం ఏమిటి అనేది చూపిస్తుంటాం. కాబట్టి సహజంగానే మనకు ఇలాంటి ప్రశ్నలు కలుగుతాయి, కానీ 'డోరతి' చిత్రంలో దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ ఆ పద్ధతిని మార్చాలనుకున్నారు.

ఆ పాత్ర ఎలా మరణించిందో చూపించాల్సిన అవసరం ఏముంది? ఆమె ఎలా మరణించి ఉండవచ్చో మీరే ఊహించుకోవచ్చు కదా!' అంటూ చెప్పుకొచ్చింది. అలాగే.. 'నేను ఎప్పుడు నా దర్శకుడిని నమ్ముతాను. ఎందుకంటే కథ పూర్తిగా దర్శకుడి చేతుల్లోనే ఉంటుంది. నటీనటుల కంటే కూడా, ఆ పాత్ర ఎలా ఉండాలి, ఎలా ప్రవర్తించాలి అనే విషయాలు దర్శకుడికి బాగా తెలుసు. అందుకే, ప్రతి విషయాన్ని నేను దర్శకుడినే అడిగి తెలుసుకుంటాను. దర్శకుడు చెప్పిన విషయాలను బట్టి, ఆ పాత్ర ఎలా ఉంటుందో నా మనసులో ఒక రూపురేఖలను సిద్ధం చేసుకుంటాను. అందుకే డోరతిలో కూడా నా పాత్ర దర్శకుడిని నమ్మి చేశాను' అని చెప్పుకొచ్చింది కీర్తి సురేష్.

అదంతా నిజమే

టాంపరింగ్ వివాదంపై ఖవాజా వ్యాఖ్యలకు వార్నర్ మద్దతు



ఎనిమిదేళ్ల కిందట దక్షిణాఫ్రికా వేదికగా జరిగిన శాండ్ పేపర్ గేట్ వివాదం మళ్లీ వార్తల్లోకి వచ్చింది. బాల్ టాంపరింగ్ కు పాల్పడ్డారంటూ అప్పటి ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్, వైస్ కెప్టెన్ డేవిడ్ వార్నర్ తోపాటు బౌలర్ కామెరూన్ బాన్ క్రాఫ్ట్ పై వేటు పడింది. తాజాగా ఆసీస్ మాజీ ఆటగాడు ఉస్మాన్ ఖవాజా తన ఆత్మకథలో ఈ అంశం గురించి ప్రస్తావించాడు. అలాగే, ఇన్ స్టాగ్రామ్ లోనూ వీడియో పోస్టు చేశాడు. ఇప్పుడు దానిపై 'బాల్ టాంపరింగ్' వివాదంలో ఉన్న డేవిడ్ వార్నర్ స్పందించాడు. ఉస్మాన్ ఖవాజా చెప్పినవన్నీ వాస్తవమేనని స్పష్టం చేశాడు.

''నేను ఈ విషయంపై మాట్లాడి దాదాపు ఎనిమిదేళ్లు అవుతుంది. ఖవాజా నీకు నా పూర్తి మద్దతు ఉంది. ఇప్పుడు నువ్వు చేసిన పనికి ధన్యవాదాలు. నువ్వు చెప్పిన విషయాలు వంద శాతం నిజం. ఇప్పుడు అందరికీ నిజం తెలిసింది. అయితే, కొందరు 'ఎనిమిదేళ్ల తర్వాత ఎందుకు చెబుతున్నావు?' అని అడుగుతున్నారు. పుస్తకం అమ్ముకోవాలనే ఉద్దేశంతో మాట్లాడుతున్నారని కొందరు అనొచ్చు. కానీ, ఇది ఉస్మాన్ కథ. ఇది ఖవాజా నమ్మే విషయం'' అని వార్నర్ వెల్లడించాడు.

విచారణే సరిగా లేదు..

''బాల్ టాంపరింగ్ వివాదంపై జరిగిన దర్యాప్తు కూడా సరిగాలేదు. ఆ ప్రక్రియ మొత్తం హడావుడిగా, అస్తవ్యస్తంగా జరిగింది. బాన్ క్రాఫ్ట్ పక్కనే ఉస్మాన్ ఖవాజా కూర్చొని ఉన్నాడు. అతడిని ఏమీ అడగలేదు. మరి ఇదెలా సమగ్ర దర్యాప్తు అవుతుంది? ఇక్కడెవరినీ నిందించేందుకు లేము. అలాగే, మా పాత గాయాలను తిరగదోడేందుకు కాదు కానీ, జవాబుదారీతనం, పారదర్శకత అత్యంత ముఖ్యం. సరిగ్గా దర్యాప్తు చేయాలని కోరుకొనే వ్యక్తిని విమర్శించడం ఇకనైనా ఆపాలి. గత ఎనిమిదేళ్లుగా ఎన్నో మాటలు పడ్డాం. ఇది కేవలం నా ఒక్కడినే కాదు.. నా కుటుంబంపైనా ప్రభావం చూపించింది. మేమెందుకు తనను పట్టుకున్నామో.. ఎందుకిన్ని కెమెరాలు ఉన్నాయో.. టీవీలో మేమెందుకు ఏడుస్తున్నామో అని ముఖ్యంగా నా 12 ఏళ్ల కుమార్తె అడగాలనుకుంది'' అని వార్నర్ భావోద్వేగానికి గురయ్యాడు.

ఇంతకీ ఖవాజా ఏమన్నాడంటే?

''బాల్ టాంపరింగ్ వివాదంలో కేవలం ముగ్గురినే బాధ్యులను చేయడం సరికాదు. ఈ విషయం జట్టులోని ఆటగాళ్లతోపాటు సహాయక సిబ్బందికి కూడా తెలుసు. దక్షిణాఫ్రికాతో మూడు టెస్టులో మాత్రమే కాకుండా రెండో మ్యాచ్ లోనూ శాండ్ పేపర్ ను ఉపయోగించడం జరిగింది. స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్, కామెరూన్ బాన్ క్రాఫ్ట్ లను మాత్రమే కాకుండా.. జట్టుగా అందరూ బాధ్యత తీసుకోవాల్సింది'' అని ఖవాజా వ్యాఖ్యానించాడు.



మూడో వన్డేకూ వరుణుడి ముప్పు!

భారత్-న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న వన్డే సిరీస్ కు వరుణుడు పదేపదే అడ్డంకిగా మారుతున్నాడు. ఇప్పటికే తొలి రెండు మ్యాచ్ లకు వర్షం అంతరాయం కలిగించగా.. మంగళవారం హామిల్టన్ లో జరగనున్న మూడో వన్డేకూ వర్షం ముప్పు పొంచి ఉంది. ఇవాళ జట్టు సాధన సమయంలో వర్షం రావడంతో అవుట్ డోర్ ప్రాక్టీస్ ను ఇండోర్ స్టేడియానికి మార్చారు. మంగళవారం హామిల్టన్ లో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ సంస్థ తెలిపింది.

తొలి రెండు వన్డేల్లోనూ విజయం సాధించిన భారత్ 2-0తో ఆధిక్యంలో ఉంది. ఆక్లాండ్ లో జరిగిన తొలి వన్డేలో డక్ వర్త్ లూయిస్ (డీఎల్ఎస్) పద్ధతిలో ఐదు వికెట్ల తేడాతో గెలిచింది. వెల్లింగ్టన్లో నాలుగు పరుగుల తేడాతో విజయం సాధించింది. మూడో వన్డేలోనూ గెలిచి సిరీస్ ను కైవసం చేసుకోవాలని టీమ్ఇండియా పట్టుదలగా ఉంది. అయితే, అందుకు వరుణుడు సహకరిస్తాడో, లేదో చూడాలి.



టీమ్ఇండియా దక్షిణాఫ్రికా టూర్ జట్లను ప్రకటించిన బీసీసీఐ

డిసెంబరులో భారత మహిళల జట్టు దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లనుంది. ఈ టూర్ లో ఆతిథ్య జట్టుతో ఒక టెస్టు, మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడనుంది. ఈ మ్యాచ్ ల కోసం బీసీసీఐ జట్లను ప్రకటించింది. మూడు ఫార్మాట్లలోనూ స్మృతి మంధాన కెప్టెన్ గా వ్యవహరించనుంది. డిసెంబరు 9న గెబెర్హాలో ప్రారంభంకానున్న ఏకైక టెస్టు మ్యాచ్ తో ఈ టూర్ మొదలవుతుంది.

టెస్టు జట్టు: స్మృతి మంధాన (కెప్టెన్), షెఫాలి వర్మ, ప్రతికా రావల్, హర్మన్ప్రీత్ కౌర్, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ డియోల్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), యస్తికా భాటియా (వికెట్ కీపర్), దీప్తి శర్మ (వైస్ కెప్టెన్), శ్రీ చరణి, స్నేహ్ రాణా, క్రాంతి గౌడ్, నందిని శర్మ, జింతిమణి కలిత, సయాలీ సత్ఘరే.

వన్డే జట్టు: స్మృతి మంధాన (కెప్టెన్), షెఫాలి వర్మ, ప్రతికా రావల్, హర్మన్ప్రీత్ కౌర్, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ డియోల్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), యస్తికా భాటియా (వికెట్ కీపర్), దీప్తి శర్మ (వైస్ కెప్టెన్), శ్రీ చరణి, వైష్ణవి శర్మ, క్రాంతి గౌడ్, నందిని శర్మ, జింతిమణి కలిత, సయాలీ.

టీ20 జట్టు: స్మృతి మంధాన (కెప్టెన్), షెఫాలివర్మ (వైస్ కెప్టెన్), జెమీమా రోడ్రిగ్స్, హర్మన్ప్రీత్ కౌర్, నికీ ప్రసాద్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), జి. కమలిని (వికెట్ కీపర్), అనుష్క శర్మ, దీప్తి శర్మ, శ్రీ చరణి, ప్రేమ రావత్, అమన్జోత్ కౌర్, క్రాంతి గౌడ్, నందిని శర్మ, రేణుకా సింగ్ ఠాకూర్, అరుంధతి రెడ్డి, సయాలీ.


భారత మహిళల జట్టు దక్షిణాఫ్రికా పర్యటన షెడ్యూల్

- డిసెంబరు 9 - ఏకైక టెస్టు
- డిసెంబరు 16 - తొలి వన్డే
- డిసెంబరు 19 - రెండో వన్డే
- డిసెంబరు 22 - మూడో వన్డే
- డిసెంబరు 26 - తొలి టీ20
- డిసెంబరు 29 - రెండో టీ20
- డిసెంబరు 30 - మూడో టీ20

98 రోజుల్లో షూటింగ్ కంప్లీట్..

నితిన్ సినిమాపై పెరిగిన క్యూరియాసిటీ!

యంగ్ హీరో నితిన్ నటిస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ 'అలియాస్ రుక్మిణి'. 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నేచురల్ స్టార్ నాని సమర్పిస్తున్నారు. దీప్తి గంటా యూనానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు. కృష్ణ అనే ఆసక్తికరమైన పాత్రలో నితిన్ కనిపించనుండగా, హీరోయిన్గా ఆఫియా సయ్యద్ నటిస్తోంది. ఆమె ఈ సినిమాతో తెలుగు తెరకు పరిచయం అవుతోంది. సాయికుమార్, హర్షవర్ధన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. కథ, కథనంలో వైవిధ్యంతో పాటు వినోదం, భావోద్వేగాలకు ప్రాధాన్యతనిస్తూ దర్శకుడు మురళీకాంత్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం షూటింగ్కు సంబంధించిన లేటెస్ట్ అప్డేట్ ను పంచుకున్నారు మేకర్స్. 'అలియాస్ రుక్మిణి షూటింగ్ పూర్తి అయింది. మరో 25 రోజుల్లో, థియేటర్లలో చెప్పలేని భావోద్వేగాలతో అందమైన చిత్రాన్ని జరుపుకుందాం.. డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది' అని అఫీషియల్ గా ప్రటించారు. అయితే.. ఈ సినిమాను ఆగస్టు 3న ప్రకటించగా.. కేవలం 98రోజులు అంటే నవంబర్ 9కు షూటింగ్ పూర్తి చేసుకుని డిసెంబర్ 4న విడుదలకు సిద్ధం కావడంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మరింత ఉత్సాహం నెలకొంది. అంతే కాకుండా.. ముఖ్యంగా 'అలియాస్ రుక్మిణి' టైటిల్ గ్లింప్స్ నాని, దర్శకుడి మధ్య జరిగే సంభాషణ సినిమాపై ఆసక్తిని పెంచింది.



ఇండస్ట్రీకి రాకముందే ఆ పార్ట్ కి సర్జరీ చేయించుకున్నా.. జాన్వీ కపూర్

దివంగత నటి శ్రీదేవి కూతురిగా ఇండస్ట్రీలోకి వచ్చిన జాన్వీ కపూర్ హిందీలో పలు సినిమాల్లో నటించి తనకంటూ ఒక ఇమేజ్ సొంతం చేసుకుంది. అలాగే తెలుగులో ఎన్టీఆర్, రామ్ చరణ్ వంటి స్టార్స్ తో చేసిన ఈ భామ తన నటన, అందంతో మెప్పించినప్పటికీ ఏఐ దుర్వినియోగం వల్ల పలు ఇబ్బందుల్లో చిక్కుకుంది. అంతేకాకుండా ట్రోలింగ్ కి గురైంది. తాను నటిని అవుతానని చెప్పినప్పుడు తన తల్లి శ్రీదేవి మొదట కొంత అభ్యంతరం చెప్పారని గుర్తు చేసుకుంది. 'ఈ రంగంలోకి రావాలంటే నీ జీవితాన్ని పూర్తిగా దీనికే కేటాయించాలి' అని శ్రీదేవి స్పష్టం చేసినట్లు తెలిపింది. ప్రారంభంలో తనపై శ్రీదేవికి పెద్దగా నమ్మకం ఉండేది కాదని, ఈక్రమంలోనే అమెకు సినీ ప్రముఖులు సపోర్ట్ చేయడంతో.. ఈ గండం నుంచి గట్టెక్కింది. ఇటీవల 'పెద్ది' చిత్రంతో అలరించిన ఈ భామ, ప్రస్తుతం కొత్త సినిమాలేవీ ఒప్పుకోకపోయినా వరుస ఇంటర్వ్యూలు ఇస్తూ ఎప్పుడూ వార్తల్లో ఉంటోంది. ఈనేపథ్యంలో, తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న జాన్వీ, తన సినీ ప్రయాణం మొదట్లో జరిగిన ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకుంది. అయితే తాను ముక్కుకు సర్జరీ చేయించుకున్న తర్వాతే ఆ నమ్మకం కుదిరిందని జాన్వీ వెల్లడించింది.

ఇండస్ట్రీలోకి రావడానికి ఒప్పుకున్నట్లు చెప్పింది. జాన్వీ కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

పొలిటికల్ ఎంట్రీపై స్పందించిన సూర్య

తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ బాటలోనే పలువురు కోలీవుడ్ హీరోలు కూడా రాజకీయాల్లోకి రాబోతున్నారంటూ గత కొంతకాలంగా రకరకాల వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే రాఘవ లారెన్స్ తన పొలిటికల్ ఎంట్రీపై అధికారిక ప్రకటన చేయగా, ధనుష్, సూర్య కూడా పాలిటిక్స్ లోకి వస్తున్నట్లు అనేక పుకార్లు షికారు చేస్తున్నాయి. ఈ క్రమంలో, తాజాగా ఈ వార్తలపై కోలీవుడ్ వర్సటైల్ నటుడు సూర్య స్పందిస్తూ పూర్తి స్పష్టతనిచ్చారు. తాను రాజకీయాల్లోకి రావడం లేదని సూర్య క్లారిటీ ఇస్తూ ఆ వార్తలకు పూర్తిగా ముగింపు పలికారు.

అయితే తనకు పాలిటిక్స్ అంటే ఎలాంటి ద్వేషం లేదని, రాజకీయ పరిణామాలను ఎప్పటికప్పుడు నిశ్శబ్దంగా గమనిస్తూనే ఉంటానని తెలిపారు. నేటి యువత రాజకీయాలపై పూర్తి అవగాహన పెంచుకుని ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు కూడా విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. పూర్తి అంకితభావం ఉన్నవారు ఎవరైనా సరే ధైర్యంగా రాజకీయాల్లోకి రావచ్చని ఆయన పేర్కొన్నారు. తనకు సరైన మార్గం తెలియకపోయినా, ఈ సమయంలో రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన మాత్రం తనకు లేదని స్పష్టం చేస్తూ పుకార్లకు చెక్ పెట్టారు.

బరువు తగ్గి సినిమాలు చేసుంటే బాగుండేది

అనీష్ హీరోగా పరిచయమవుతున్న సినిమా 'ఇట్లు అర్జున'. అనస్వర రాజన్ హీరోయిన్. ఈనెల 13న థియేటర్లలోకి రానుంది. ఈ క్రమంలోనే మూవీ ప్రమోషన్లు చేస్తున్నారు. అక్కినేని నాగార్జున సమర్పణలో ఈ చిత్ర రూపొందుతోంది. అయితే ఈ మూవీ ప్రమోషన్స్ లో ఎన్టీఆర్ పాల్గొన్నాడు. ఈ సందర్భంగా ఆయన చేసిన కామెంట్స్ ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

ఏదీ మనసుకి తీసుకోను

హీరో అనీష్ తో జరిగిన ఇంటర్వ్యూలో ఎన్టీఆర్ మాట్లాడుతూ.. 'మొదటి సినిమా అని కాదు. ఇప్పటికీ నా సినిమా రిలీజ్ అవుతుందంటే నాకు నిద్ర పట్టదు. చాలా నెర్వస్ గా ఉంటాను. సినిమా హిట్ అయినా.. ఫ్లాప్ అయినా మ్యాగ్జిమమ్ ఒకరోజు ఉంటుంది అంతే. ఒక్కరోజు కంటే ఎక్కువ ఏదీ మనసుకి తీసుకోను. అది ఒకరు చెప్తే రాదు. ఏ నటుడికైనా స్లోగా అర్థమవుతుంది. ముందుముందు నువ్వు(అనీష్) కూడా నేర్చుకుంటావులే' అని ఎన్టీఆర్ తెలిపారు.



యంగ్లో తాను కొద్దిగా బొద్దుగా లావుగా ఉండేవాడినని.. అలా కాకుండా కొంచం బరువు తగ్గి సినిమాలు చేసుంటే బాగుండేదేమో అనిపిస్తుందని నవ్వుతూ తారక్ చెప్పుకొచ్చారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.